


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 140 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ బుధవారం 1 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 140 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD WED 1 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## ప్రజాస్వామ్యయుతంగా మూసీ పునరుజ్జీవం..

### ఏప్రిల్ 15 వరకు ఆన్‌లైన్‌లో అభిప్రాయ సేకరణ: డిప్యూటీ సీఎం భట్టి

- నిర్వాసితులు, డిఫెన్స్ భూములపై సంప్రదింపులు
- విలువైన సూచనలు చేసిన వారితో సబ్ కమిటీ భేటీ
- 24 గంటలూ అందుబాటులో కేబినెట్ సబ్ కమిటీ
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి





హైదరాబాద్ పెన్ పవర్:మూసీ పునరుజ్జీవ పనులను ప్రజాస్వామ్యయుతంగా చేపడుతున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. మూసీపై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం సోమవారం (మార్చి 31) సచివాలయం లో జరిగింది. మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు ఆన్ లైన్ లో musrirde@gmail.com మెయిల్ ఐడీ ద్వారా మూసీ పునరుజ్జీవంపై ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తామని తెలిపారు. ఆన్ లైన్ లో వచ్చిన విలువైన సలహాలు, సూచనలను అన్నింటినీ అధికారులతో కలిసి విశ్లేషణ చేస్తామని చెప్పారు. అభిప్రాయాలు వెల్లడించిన వారితో నేరుగా దశలవారీగా సబ్ కమిటీ సభ్యులు సం ప్రదింపులు చేస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు. మూసీ నది ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం పనులకు మార్చి 28న శంకుస్థాపన జరిగిందని, ఆ రోజు నుంచి మూసీ ఫేస్ 1, ఫేస్ 2 వరకు చేయాల్సిన పనులకు సంబంధించిన రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసుకోవాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. డిఫెన్స్ భూములు, మూసీ నిర్వాసితులతో సంప్రదింపులు, నిర్మాణ డిజైన్లు తుది దశకు తీసుకురావడం, బ్యాంకర్స్ తో మాట్లాడటం - మిగతా2లో

## రేవంత్ రెడ్డి అసెంబ్లీలో 'పహిల్వాన్' భాష మాట్లాడుతున్నారు



- అసెంబ్లీలో పాలసీలు ఉంటాయి కానీ కుస్తీ పోటీలు ఉండవని వ్యాఖ్య
- అసెంబ్లీని ఇష్టం వచ్చినట్లు నడుపుతున్నారని ఆరోపణ
- కాళేశ్వరం ప్రాజెక్టుపై రేవంత్ రెడ్డి, సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు తేడా లేదని విమర్శ

హైదరాబాద్ పెన్ పవర్:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలసీలను గాలికి వదిలేసి, పహిల్వాన్ల భాషను మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు ధ్వజమెత్తారు. అసెంబ్లీలో పాలసీలు ఉంటాయి కానీ పహిల్వాలు, కుస్తీ పోటీలు ఉండవని ఎద్దేవా చేశారు. అసెంబ్లీని కుస్తీల పోటీగా మార్చారని మండిపడ్డారు. కత్తులతో కోలాటంలో తలలు తీసేస్తామని మరో ఎమ్మెల్యే వ్యాఖ్యానించారని మండిపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయాలని కోరారు. - మిగతా2లో



## పసుపు తడిసినా కొనాల్సిందే..

### తూకంలో కోతలు విధించవద్దు: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం

- ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కొనుగోలు చేయాలి
- రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవు

హైదరాబాద్ పెన్ పవర్: అకాల వర్షాల నేపథ్యం లో పసుపు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అండగా నిలిచింది. బలమైన గాలులు, వర్షాల వల్ల తేమకు గురైన పసుపును కూడా ఎటువంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారుల ను ఆదేశించారు. వర్షానికి తడిసిన పసుపును తూకంలో కోతలు విధించకుండా, ప్రభుత్వం నిర్ణయించిన - మిగతా2లో

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు

- జనవరి 29న మినీ మేడారం జాతర సందర్భంగా గొడవ
- పోలీస్ కమిషనర్ పై కౌశిక్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు
- ఏప్రిల్ 4న విచారణకు రావాలంటూ సీఐడీ నోటీసులు

- మిగతా2లో



## ఫ్రీ బస్ జర్నీతో మహిళలకు రూ.10 వేల కోట్లు ఆదా



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ప్రజా భవన్ వేదికగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ప్రగతిపై కీలక ప్రకటన చేశారు. ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని ఆయన గుర్తుచేశారు. డిసెంబర్ 9, 2023న ప్రారంభమైన మహాలక్ష్మి పథకం అద్భుత ఫలితాలను ఇస్తోందని - మిగతా2లో

## ట్యాంక్‌బండ్ శివకు తెలంగాణ ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం



హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఎంతో మంది ప్రాణాలను కాపాడిన శివకు ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఆర్థిక సహాయంతో పాటు ట్యాంక్ బండ్ శివ కుమారుడు వేణుమాధవ్‌కు - మిగతా2లో

## కాంగ్రెస్ నేతలు రాజకీయ రాబందుల్లా తయారయ్యారు

- ప్రపంచ సవాళ్ల మధ్య భారత్ నిలకడగా ఉందని వ్యాఖ్య
- కాంగ్రెస్ వదంతులు వ్యాపింపజేస్తోందని తీవ్ర విమర్శలు
- గుజరాత్‌లోని డీసా ఎయిర్‌బేస్‌ను ప్రారంభించిన ప్రధాని
- ఈ ప్రాజెక్టు ఆలస్యానికి కాంగ్రెసే కారణమని ఆరోపణ
- దేశ ఐక్యతకు పాటుపడాలని ప్రజలకు పిలుపు



హైదరాబాద్ పెన్ పవర్:ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన, భౌగోళిక రాజకీయ సవాళ్లు నెలకొన్నప్పటికీ, భారతదేశం స్థిరంగా ఉందని స్పష్టం చేశారు. మంగళవారం గుజరాత్‌లోని వావ్-థరాడ్‌లో రూ. 19,800 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ ఐక్యతను దెబ్బతీస్తూ, కాంగ్రెస్ వదంతులను ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు రాజకీయ రాబందుల్లా తయారయ్యారని మండిపడ్డారు.పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, యుద్ధ పరిస్థితుల కారణంగా ప్రపంచ ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం పడుతోందని మోదీ అన్నారు. "ప్రపంచంలోని ఎన్నో దేశాలు - మిగతా2లో

## అమెరికా సాయం చేయదు.. మీ ఆయిల్ మీరే తెచ్చుకోండి

### మిత్రదేశాలపై ట్రంప్ ఫైర్



- ఇరాన్‌పై దాడులకు సహకరించని మిత్రదేశాలపై ట్రంప్ ఆగ్రహం
- మీ ఆయిల్‌ను మీరే తెచ్చుకోండి అంటూ 'ట్రూత్ సోషల్'లో పోస్ట్
- అమెరికా నుంచి కొనుగోలు చేయండి లేదా బలవంతంగా తెచ్చుకోండి అని సూచన
- హార్ముజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించడంతో పెరిగిన చమురు ధరలు

- మిగతా2లో

## ఒక్కడు... 27 బైకులు చోరీ చేశాడు!

- ప్రకాశం జిల్లాలో ఘరానా దొంగ అరెస్ట్
- 27 బైకులు చోరీ చేసిన వైనం
- చెడు వ్యసనాల కోసమే దొంగతనాలు చేస్తున్నట్లు వెల్లడి
- నిందితుడి నుంచి రూ.10 లక్షల విలువైన బైకులు స్వాధీనం
- అరెస్ట్ సమయంలో కిలోకు పైగా గంజాయి కూడా పట్టివేత

- మిగతా2లో



పెన్ పవర్ డెస్క్:ఒకటి కాదు రెండు కాదు... ఏకంగా 27 బైకులను ఒక్కడే చోరీ చేశాడు. చెడు వ్యసనాలకు బానిసై, సులభంగా డబ్బు సంపాదించేందుకు దొంగగా మారిన ఓ వ్యక్తిని ప్రకాశం జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి సుమారు రూ.10 లక్షల విలువైన 27 మోటార్‌సైకిళ్లను, కిలోకు పైగా

## మా పంటలు ఎండిపోతుంటే అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తారా?

### ఏపీ ప్రభుత్వంపై మంత్రి జూపల్లి ఆగ్రహం

- శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు తగ్గినా ఏపీ విద్యుత్ ఉత్పత్తి చేస్తోందన్న జూపల్లి
- ఏపీ ప్రభుత్వం కనీసం తాగడానికి నీళ్లు కూడా లేకుండా చేస్తోందని ఆవేదన
- రైతుల హక్కులు కాలరాస్తే ఊరుకోబోమని హెచ్చరిక

- మిగతా2లో



## తెలంగాణలో ఐదు రోజుల పాటు వర్షాలు

- ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని వెల్లడి
- గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం
- పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ శాఖ

- మిగతా2లో



## నేటి నుంచి తెలంగాణలో చికెన్ దుకాణాలు బంద్..

- పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్‌లు పెంచాలని చికెన్ షాపు యజమానుల డిమాండ్
- ఇటీవల గతంలో కంటే మార్జిన్‌లు తగ్గించారని ఆవేదన
- కిలో చికెన్‌పై రూ.30 మార్జిన్ ఇవ్వాలని డిమాండ్

- మిగతా2లో



# ఎడిటర్ వ్యూ

## ఆధునిక శరీర ధర్మశాస్త్ర పితామహుడు విలియం హార్వే

శరీరంలో రక్తప్రసరణ జరిగే పద్ధతి గురించి చాలా కాలం క్రితమే పరిశోధించి, భావి వైద్యులకు అపూర్వ విజ్ఞానాన్ని అందించిన గొప్ప శాస్త్రవేత్త విలియం హార్వే. మనిషి గుండెకు సంబంధించిన పూర్తి వివరాలను మిగతా జంతువుల గుండెలతో పోల్చి చూసి శాస్త్ర బద్ధంగా అందజేసిన ఘనత విల్లియం హార్వేకు దక్కుతుంది. శరీరం ద్వారా రక్త ప్రసరణను కనుగొన్న మొదటి పరిశోధకుడు. శరీరంలో రక్త ప్రసరణను సరిగ్గా వివరించి, విలియం హార్వే, ధమనులు మరియు సిరలు పూర్తి సర్క్యూట్ ను ఏర్పరుస్తాయని చూపించాడు. సర్క్యూట్ గుండె వద్ద మొదలై గుండెకు తిరిగి వెళుతుందని అపూర్వ పరిశోధనల ఫలితాలను రుజువు పరిచాడు. మానవ శరీరంపై ఆసక్తి పెంచుకున్న హార్వే అనేక జంతువుల శరీర అంతర్భాగాలను క్షుణ్ణంగా పరిశీలించి గుండెకు, రక్త ప్రసరణ వ్యవస్థ కు సంబంధించి లోతుగా అధ్యయనం చేసిన క్రమంలో గుండె పనితీరు, రక్త ప్రసరణ విధానాలను గమనించాడు. నాడి కొట్టుకోవడం అంటే గుండె కొట్టు కోవడమే అని రుజువు చేశాడు. మనిషి గుండె నిమిషానికి ఎన్ని సార్లు కొట్టు కుంటుందో, ఎంత రక్తాన్ని పంప్ చేస్తుందో చెప్పగలిగాడు. తన పరిశీలనలతో రెండు అమూల్యమైన గ్రంథాలను వెలువరించాడు. విలియం హార్వే (ఏప్రిల్ 1, 1578 – జూన్ 3, 1657) ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వైద్యశాస్త్రవేత్త. గుండె పనిచేసే తీరును, శరీరంలో రక్తప్రసరణ జరిగే పద్ధతిని చాలా క్రితమే వివరించి నేటి వైద్యులకు మార్గదర్శకు డయ్యాడు. నేడు హృదయం గురించి అందరికీ తెలుసు. రక్త ప్రసరణ వ్యవస్థ మొత్తం ఎలా నడుస్తుందో చెప్పగలుగు తున్నారు. అదే 16 వ శతాబ్దం వరకు గుండె గురించి దేవునికి తప్ప మానవ మాత్రులకు ఏమీ తెలియదు అని భావించేవారు. విలియం హార్వే ఇంగ్లండులోని ఫోక్‌స్టోన్‌లో 1578 ఏప్రిల్ 1న సంపన్నుడైన పట్టణ మేయరుకు పదిమంది సంతానంలో ఒకడిగా పుట్టాడు. పదిహేనవ యేట కేంబ్రిడ్జిలోని సైన్స్ కాలేజీలో చేరాడు. పట్టభద్రుడయ్యాడు. ఆపై వైద్య విద్య కోసం ఇటలీలోని పాడువా వైద్య విద్యాలయంలో చేరాడు. అక్కడ హరోనిమస్ ఫాబ్రీసియస్ అనే ప్రముఖ వైద్య శాస్త్రజ్ఞుని వద్ద శిష్యరికం చేశాడు. 1602 లో వైద్య శాస్త్రంలో పట్టా పుచ్చు కొనటమే కాకుండా ప్రత్యేకమైన యోగ్యతా పత్రాన్ని పొంద గలిగాడు. అక్కడి నుంచి లండన్ తిరిగి వచ్చాక ఇంగ్లండ్ రాజు మొదటి ఛార్లెస్ కొలువులో ఆస్థాన వైద్యుడిగా నియమితు డయ్యాడు. అంతటి హోదాలో ఉన్న సంపన్నులు ఎవరైనా విలాసంగా జీవితం గడిపేస్తారేమో కానీ, విలియం హార్వే మాత్రం కొత్త విషయాలు తెలుసు కోడానికి పరిశోధకుడిగా మారాడు. గుండెకు సంబంధించిన సందేహాలు మాత్రం ఆయనను వదలలేదు. గుండె నుండి బయలు దేరిన రక్తం రక్త నాళాలలో అటూ ఇటూ ప్రవహించి చివరికి హరించుకు పోతుందే తప్ప మళ్లీ గుండెను చేరదు అనే వాదంలో నిజం ఉన్నట్లు హార్వేకు తోచలేదు. పెద్ద పెద్ద సిరలలో కవాటాలు ఎందుకు ఉంటాయనే తపన కూడా ఆయనలో బయలుదేరింది. 1615 లో రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ లో ఆయన లెక్చరర్ గా నియమింప బడ్డాడు. చేపలు, కప్పలు, కోళ్ళ పిండాలను జాగ్రత్తగా పరిశీలిస్తూ వాటి రక్త ప్రసరణ గురించి ఎంతో క్షుణ్ణంగా అధ్యయనం చేయ సాగాడు. గుండె ముడుచు కోవటం వల్ల రక్తం ధమనుల ద్వారా రక్త నాళాలకు వెళుతుందని తెలుసు కున్నాడు. నాడి కొట్టుకోవడం అంటే గుండె కొట్టు కోవడమే అని రుజువు చేశాడు. గుండెలో నాలుగు గదులు ఉంటాయని, ధమనుల ద్వారా గుండె లోని రక్తం బయటికి పంప్ చేయ బడుతుందని, సిరల ద్వారా కవాటాలు రక్తాన్ని గుండె వైపుకి వెళ్ళనిస్తాయే కాని గుండె లోంచి రక్తాన్ని వెలుపలికి రానివ్వవని తెలుసు కున్నాడు. ఒక అర గంటలో శరీరంలో ఉన్న మొత్తం రక్తం గుండె నుండి వెలువడే రక్తమే ఎక్కువగా ఉంటుందని నాడీ వేగం, గుండె స్పందించే రేటు ఆధారంగా నిర్ధారించుకో గలిగాడు.

చనిపోయిన ఖైదీల శరీరాలను అడుగడుగునా పరిశీలించడం ద్వారా గుండె ఒక పంపులాగా పనిచేస్తుందని, శరీరంలో సిరలు, ధమనుల ద్వారా రక్తం వలయా కారంలో ప్రవహిస్తుందని తెలుసు కున్నాడు. రక్తం ప్రవహించే మార్గంలో వాల్వులు ఎలా పనిచేస్తాయో కనిపెట్టాడు. మనిషి గుండె నిమిషానికి ఎన్ని సార్లు కొట్టుకుంటుందో, ఎంత రక్తాన్ని పంప్ చేస్తుందో చెప్ప గలిగాడు. తన పరిశీలనలతో రెండు అమూల్యమైన గ్రంథాలను వెలువరించాడు. 1628 లో, 50 సంవత్సరాల వయస్సులో, హార్వే తన పరిశోధనా ఫలితాలను ప్రచురించాడు – సాధారణంగా దీనిని డి మోటో కార్డిస్ – ది మోషన్ ఆఫ్ ది హార్ట్ అని పిలుస్తారు. ఆంగ్లంలో అనాటమికల్ స్టడీస్ ఆన్ ది మోషన్ ఆఫ్ ది హార్ట్ అండ్ బ్లడ్ ఇన్ యానిమల్స్ అంటారు. ఈ ప్రచురణ వైద్య శాస్త్ర చరిత్రలో అపూర్వమైనది. పరిశోధనల ద్వారా వచ్చిన ఫలితాలను మళ్ళీ పరిశోధనల ద్వారానే రూఢి పరచాలనే శాస్త్రవాది హార్వే. ఈ పుస్తకం ప్రచురించిన మూడు సంవత్సరాల తరువాత హార్వే మొదటి చార్లెస్ మహారాజుకు రాజ వైద్యునిగా నియమించ బడ్డాడు. కానీ రాజకీయ విపరిణామాల కారణంగా హార్వే లండన్ విడిచి పెట్టవలసి వచ్చింది. అప్పుడే కొంతమంది దుండగులు హార్వే ఇంటిలో లేని సమయం చూచి ఆయన నాలుగు దశాబ్దాలుగా సేకరించిన దాచుకున్న అమూల్యమైన విజ్ఞాన సంపద నంతా నాశనం చేశారు. అయినా హార్వే బాధ పడలేదు. నిరాశతో క్రుంగిపోలేదు. ప్రత్యుత్పత్తి, పిండాభివృద్ధి అంశాల మీద జీవితమంతా పరిశోధించాడు. 1651 లో “ఎక్సర్ సైజస్ ఆన్ ది జనరేషన్ ఆఫ్ ఆనిమల్స్” అనే పుస్తకాన్ని ప్రచురించాడు. ఈ పుస్తకం ప్రతులు అతి త్వరిత గతిలో అమ్ముడైపోయి కొత్త చరిత్రను సృష్టించాయి. హార్వే 1657 సంవత్సరం జూన్ 3 న మరణించాడు.

## కాంగ్రెస్ నేతలు రాజకీయ రాబందుల్లా తయారయ్యారు

- మొదటి పేజి తరువాయి

అస్థిరతను ఎదుర్కొంటున్నాయి. డీజిల్, పెట్రోల్, గ్యాస్ సమస్యలతో సతమతమవుతున్నాయి. అయితే, మన విజయవంతమైన విదేశాంగ విధానం, ప్రజల ఐక్యత వల్ల భారత్ ఈ పరిస్థితులను అదుపులో ఉంచగలిగింది” అని ఆయన వివరించారు. చిన్న దేశాల నుంచి అగ్రరాజ్యాల వరకు ఇంధన ధరలు 10 నుంచి 25 శాతం పెరిగాయని, కానీ భారత్ మాత్రం ఆ భారాన్ని ప్రజలపై పడనీయడం లేదని తెలిపారు. ఈ వాస్తవాలను కాంగ్రెస్ చూడలేకపోతోందని మోదీ విమర్శించారు. “దేశానికి ఐక్యత అవసరమైన ఈ సమయంలో కొందరు రాజకీయాలు చేస్తున్నారు. ఇందులో కాంగ్రెస్ ముందుంది. ధైర్యం చెప్పాల్సిన చోట భయాన్ని, వదంతులను వ్యాపింపజేస్తున్నా రు. రాజకీయ రాబందుల్లా దేశంలో గందరగోళం కోసం ఎదురుచూస్తూ, ఎన్నికల లబ్ధి పొందాలని చూస్తున్నారు” అని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. ఇంధన ధరల విషయంలోనూ ప్రజలను క్యూలలో నిలబెట్టి లబ్ధి పొందాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా డీసా ఎయిర్‌బేస్‌ను ప్రారంభించడంపై మోదీ సంతోషం వ్యక్తం చేశారు. “ఈ ఎయిర్‌బేస్ అంతర్జాతీయ సరిహద్దుకు కేవలం 130 కిలోమీటర్ల దూరంలో ఉంది. దేశ భద్రతకు ఇది చాలా కీలకం” అని ఆయన పేర్కొన్నారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఈ ప్రాజెక్టుకు భూసేకరణ జరిగిందని గుర్తుచేశారు. “అప్పుడు ఢిల్లీలో అధికారంలో ఉన్నవారికి గుజరాత్‌పై ఎందుకో ద్వేషం. ఏళ్ల తరబడి ఫైళ్లను తొక్కిపెట్టి ప్రాజెక్టును అడ్డుకున్నారు. మీరు నన్ను ఢిల్లీకి పంపిన తర్వాత ఆ ఫైళ్లను బయటకు తీసి, ఈ ఎయిర్‌బేస్‌ను పూర్తి చేశాను” అని మోదీ తెలిపారు. ఈ ఆలస్యానికి కాంగ్రెస్ వైఖరే కారణమని, దేశ భద్రత విషయంలో వారి ప్రవర్తనను జాతి ఎప్పటికీ క్షమించదని అన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన గ్లోబల్ ఏఐ సమ్మిట్‌లో ప్రపంచ దేశాలు భారత్‌ను ప్రశంసిస్తుంటే, కాంగ్రెస్ నేతలు మాత్రం దేశ ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూశారని మోదీ ఆరోపించారు. భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడే శక్తుల మాదిరిగా కాంగ్రెస్ మాట్లాడుతోందని విమర్శించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో చూపిన ఐక్యతను ఇప్పుడు కూడా ప్రదర్శించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఉత్తర గుజరాత్ అభివృద్ధికి దోహదపడే ఈ ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, దేశీయ, అంతర్జాతీయ సవాళ్లను భారత్ ఎలా ఎదుర్కొంటుందో చెప్పడానికి నిదర్శనమని ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

## తెలంగాణలో ఐదు రోజుల పాటు వర్షాలు

తెలంగాణ రాష్ట్రంలో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈరోజు, రేపు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈరోజు, రేపు పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, అసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. రేపు కామారెడ్డి, సంగారెడ్డి,ద

మెదక్, వికారాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై ఈరోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వెల్లడించింది.

# రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ‘పహిల్వాన్’ భాష మాట్లాడుతున్నారు

- మొదటి పేజి తరువాయి

గడిచిన రెండున్నర సంవత్సరాలలో రేవంత్ రెడ్డి సభలో మాట్లాడిన ఎన్నో అనాగరిక వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తమ గొంతు నొక్కివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాక్షేత్రంలో ప్రభుత్వం వైఫల్యాలను నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. అసెంబ్లీని కూడా ఈ ప్రభుత్వం ఇష్టం వచ్చినట్లు నడుపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీ బ్రేక్ పేరుతో, రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళుతున్నారని, ముఖ్యమంత్రి కేరళ నుంచి వస్తున్నారని, ఆర్థిక మంత్రి ప్రిపేర్ అవుతున్నారని, లంచ్ బ్రేక్ అంటూ ఇలా వివిధ కారణాలతో సభను గంటల పాటు వాయిదా వేస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వివిధ కారణాలతో అసెంబ్లీ సమయాన్ని వృథా చేశారని మండిపడ్డారు. కావాలని సభను రాత్రి వరకు నడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ ఎన్నికల కోసం శాసనసభను 30వ తేదీనే నిరవధిక వాయిదా వేశారని ఆరోపించారు. కేరళ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అవసరమేమో కానీ తెలంగాణ ప్రజలకు, బీఆర్ఎస్ శాసనసభ్యులకు ప్రజా సమస్యలు ముఖ్యమని అన్నారు.

**రేవంత్ రెడ్డి, సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు తేడా లేదు**

కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు పెద్దగా తేడా లేదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వమే అన్ని అనుమతులు ఇచ్చిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు కూడా కాళేశ్వరం చాలా గొప్ప ప్రాజెక్టు అని ప్రశంసించాయని అన్నారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లాంటి వారు కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణాకు వరప్రదాయిని అని అన్నారని గుర్తు చేశారు. ఇటీవల పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఎకనామిక్ సర్వేలో కాళేశ్వరం వల్ల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని చెప్పిందని వెల్లడించారు. అసెంబ్లీలో ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా కాళేశ్వరం వల్ల గత రెండేళ్లలో వేల ఎకరాల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని నివేదిక పెట్టారని తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలో గంధమల్ల ప్రాజెక్టుకు, మూసీలో తెచ్చే గోదావరి నీళ్లు కాళేశ్వరం నుండి వస్తున్నాయని తెలిపారు. సీఆర్ పాటిల్ తెలంగాణకు వచ్చి ఇక్కడ రైతులను నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయని అడిగితే సమాధానం వస్తుందని అన్నారు. కేవలం బీఆర్ఎస్ పార్టీ మీద బురదజల్లడానికే కాళేశ్వరం గురించి తప్పుగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో రూ.50 కోట్లు ఖర్చు చేస్తే మరో 2 లక్షల ఎకరాల ఆయకట్టు వస్తుందని రెండేళ్ల నుంచి దాదాపు 20 లేఖలు రాస్తున్నా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించడం లేదని ఆరోపించారు. మా మీద కోపం ఉంటే తీర్చుకోవచ్చు... కానీ ఆ కోపాన్ని రైతుల మీద చూపించవద్దని కోరారు.

# ప్రజాస్వామ్యయుతంగా మూసీ పునరుజ్జీవం..

- మొదటి పేజి తరువాయి

ఇలా పనులను ఎక్కడికి అక్కడ విభజన చేసుకొని ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు.

సీఎం రేవంత్ రెడ్డి యావత్ కేబినెట్ సంకల్పాన్ని అర్థం చేసుకొని అధికారులు ఉత్సాహంగా ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ ప్రాజెక్టు ఒక మైలురాయి గా నిలుస్తుందని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. అధికారులకు ఎలాంటి సలహా, సూచన ఇతర ఏ అవసరాలు ఉన్న సబ్ కమిటీ సభ్యులు 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని తెలిపారు. సమావేశంలో స్పెషల్‌సీఎస్ రంజన్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ ఈవీ నరసింహారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అధికారులు వినయ్ కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, కలెక్టర్లు హరిచందన, నారాయణరెడ్డి, మను చౌదరి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు

హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి తెలంగాణ సీఐడీ అధికారులు నోటీసులు అందజేశారు. ఏప్రిల్ 4న హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని ఈ నోటీసుల్లో పేర్కొన్నారు. గతంలో ఆయన చేసిన కొన్ని వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో ఈ నోటీసులు జారీ అయ్యాయి.

కేసు వివరాల్లోకి వెళితే... జనవరి 29న హుజూరాబాద్ నియోజకవర్గంలోని వీణవంకలో జరిగిన ‘మినీ మేడారం’ (సమ్మక్క–సారలమ్మ) జాతర సందర్భంగా గొడవ చోటుచేసుకుంది. జాతరకు వెళుతున్న కౌశిక్ రెడ్డిని, ఆయన కుటుంబాన్ని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో పోలీసులతో ఆయన తీవ్రంగా వాగ్వాదానికి దిగారు. తనను అడ్డుకున్న పోలీసులు,

కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంపై కౌశిక్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సీపీ మతాన్ని ప్రస్తావిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీనిపై ఐపీఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ క్షమాపణలు డిమాండ్ చేసింది. పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం, ఉన్నతాధికారులపై వ్యక్తిగత, మతపరమైన దూషణలకు దిగడం వంటి అంశాలపై అప్పట్లో నమోదైన కేసును ఇప్పుడు సీఐడీ విచారిస్తోంది. దీనికి సంబంధించి ఆయన వివరణ కోరుతూ నోటీసులు జారీ చేశారు.

# ఫ్రీ బస్ జర్నీతో మహిళలకు రూ.10 వేల కోట్లు ఆదా

- మొదటి పేజి తరువాయి

మంత్రి వెల్లడించారు. ఇప్పటివరకు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి.. దాదాపు 10 వేల కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని తెలిపారు. మహిళా ప్రయాణికులను కేవలం ప్రయాణికులుగా మాత్రమే కాకుండా, వారిని ఆర్టీసీకి యజమానులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రతిరోజూ 65 లక్షల మంది ప్రయాణికుల్లో 40 లక్షల మంది మహిళలే ఉంటున్నారని.. 97 డిపోల పరిధిలో రోజూ 35 లక్షల కిలోమీటర్లు బస్సులు తిరుగుతున్నాయని మంత్రి పొన్నం తెలిపారు. ఈ భారీ లక్ష్యాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్న డ్రైవర్లు, కండక్టర్లకు ఆయన ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా రాఖీ వంటి పండుగ దినాల్లోనూ కుటుంబాలకు దూరంగా ఉండి సేవలందించిన కార్మికుల కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. ఆర్టీసీని రాష్ట్రంలోని ప్రతి మూలకు చేర్చేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు. నియోజకవర్గాల వారీగా కొత్త రూట్లు, కొత్త బస్సులు , బస్ స్టేషన్ల అభివృద్ధిపై ప్రజా ప్రతినిధుల నుంచి నివేదికలు తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్‌లో 340 కొత్త రూట్లలో బస్సులను ప్రారంభించామని త్వరలో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని సర్వీసులు అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమంపై స్పందిస్తూ.. జజూ, రాఖీ బకాయిలను తీరుస్తున్నామని, యూనియన్ల ఏర్పాటు, ఆర్టీసీ విలీనం అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని మంత్రి పొన్నం వెల్లడించారు. ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో కొందరు కావాలని తప్పుదోవ పట్టిస్తున్నారని, యూనియన్ల పేరుతో రెచ్చగొట్టే చర్యలను మానుకోవాలని హెచ్చరించారు. తెలంగాణకు ఆర్టీసీయే లైఫ్ లైన్ అని ప్రజల రవాణా అవసరాలను తీర్చడంలో ఆర్టీసీ అగ్రస్థానంలో ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# ట్యాంక్‌బండ్ శివకు తెలంగాణ ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం

- మొదటి పేజి తరువాయి

హోం గార్డు ఉద్యోగం ఇస్తూ అందుకు సంబంధించిన నియామకపత్రాన్ని అందజేశారు. ప్రమాదవశాత్తు, లేదా ఇతరత్రా ఘటనల్లో హైదరాబాద్ హుస్సేన్ సాగర్ (ట్యాంక్ బండ్)లో పడిన ఎంతోమంది ప్రాణాలను శివ కాపాడారు. అయితే, కుటుంబ పోషణ భారమై శివ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలియడంతో ముఖ్యమంత్రి స్పందించారు. శివకు అవసరమైన సహాయం అందించాలని కొద్ది రోజుల కిందట ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారులు పలు చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే శివ కుటుంబం ముఖ్యమంత్రిని కలిశారు. ఉపాధి కోసం ట్యాంక్‌బండ్ సమీపంలో ఒక స్విమ్మింగ్ పూల్ నిర్మించి ఇవ్వాలని ఈ సందర్భంగా శివ కోరడంతో ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే శివ కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని ఆదేశించారు. సహృదయంతో స్పందించడమే కాకుండా ముఖ్యమంత్రి చేతుల మీదుగా సాయం అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ట్యాంక్‌బండ్ శివ కుటుంబ సభ్యులు అన్నారు.

# పసుపు తడిసినా కొనాల్సిందే..

- మొదటి పేజి తరువాయి

మేలురకం ధరకే కొనుగోలు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. తేమ శాతం లేదా కోతల పేరుతో రైతులను ఇబ్బంది పెట్టే మార్కెట్ యార్డు సిబ్బందిపై, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చ రించారు. మరో వైపు నిజామాబాద్ మార్కెట్ యార్డుకు సుమారు 27,400 బస్తాల పసుపు చేరుకుంది. ఇందులో దాదాపు 500 కుప్పలు బహిరంగ ప్రదేశాల్లో రాశులుగా ఉన్నాయి. 2026 మార్చి 30న కురిసిన వర్షానికి 40 మంది రైతులకు చెందిన 80 కుప్పలు తేమకు గురయ్యాయి. బయట ఉన్న పసుపు కుప్పలను కాపాడేందుకు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో 1,500 టార్పాలిన్లను పంపిణీ చేసేందుకు బిడ్డింగ్ ప్రక్రియను పూర్తి చేశారు.

**ఘనంగా రైతు నేస్తం 88వ ఎపిసోడ్**

రాష్ట్రవ్యాప్తంగా రైతులను నూతన సాంకేతికతలు, ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహించేందుకు నిర్వహించిన రైతు నేస్తం 88వ ఎపిసోడ్ ను నిర్వహించారు. దీనిలో భాగంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో నానో యూరియా వినియోగంపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. యూరియా యాప్ ద్వారా సాగు విస్తీర్ణానికి అనుగుణంగా అవసరమైన యూరియా మోతాదును రైతులు సులభంగా తెలుసుకోవచ్చని మంత్రి తెలిపారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తూ, నానో యూరియా, నానో డి.ఏ.పీ వినియోగం మరియు ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని సూచించారు. మే 4 నుండి 9 వరకు నిర్వహించనున్న రైతు ఉత్సవాల్లో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

# అమెరికా సాయం చేయదు.. మీ ఆయిల్ మీరే తెచ్చుకోండి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్రదేశాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరాన్‌పై సైనిక చర్యలో అమెరికాకు సహకరించని దేశాలు, తమకు కావాల్సిన చమురును తామే తెచ్చుకోవాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ట్రూత్ సోషల్’లో ఒక పోస్ట్ పెట్టారు. “ఇరాన్‌ను దెబ్బతీసే చర్యల్లో పాల్గొనడానికి నిరాకరించిన యునైటెడ్ కింగ్‌డమ్ వంటి దేశాలకు నాదొక సూచన. మీకు రెండు మార్గాలున్నాయి. ఒకటి, మా దగ్గర పుష్కలంగా ఉన్న చమురును కొనుగోలు చేయండి. రెండు, కాస్త ధైర్యం తెచ్చుకుని హర్మూజ్ జలసంధికి వెళ్లి, మీకు కావాల్సిన చమురును మీరే తెచ్చుకోండి” అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అంతేగాక మిత్రదేశాలు ఇకపై తమ కోసం తాము పోరాడటం నేర్చుకోవాలని హితవు పలికారు. “అమెరికా మీకు సాయం చేయడానికి రాదు. మాకు అవసరమైనప్పుడు మీరు ఎలాగైతే దూరంగా ఉన్నారో, మేమూ అలాగే ఉంటాం. ఇరాన్‌ను మేము ఇప్పటికే దెబ్బతీశాం. కష్టమైన పని పూర్తయింది. ఇక వెళ్లి మీ చమురును మీరే తెచ్చుకోండి” అని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించి నెల రోజులు దాటినా, ఇరాన్ ఇప్పటికీ హర్మూజ్ జలసంధిపై తన పట్టును కొనసాగిస్తోంది. ప్రపంచంలోని ఐదో వంతు చమురు రవాణా ఈ జలసంధి గుండానే జరుగుతుంది. ఇరాన్ దిగ్బంధనం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇది ప్రపంచ స్టాక్ మార్కెట్లను కుదిపేయడంతో పాటు అనేక నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు కారణమైంది.

# నేటి నుంచి తెలంగాణలో చికెన్ దుకాణాలు బంద్..

తెలంగాణ రాష్ట్రంలో రేపటి నుంచి చికెన్ దుకాణాలు బంద్ కానున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్‌లు పెంచే వరకు నిరవధిక బంద్ పాటిస్తామని చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ హెచ్చరించింది. గతంలో కంటే మార్జిన్ ఇప్పుడు తక్కువగా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పౌల్ట్రీ వాళ్లు రిటైల్ దుకాణాలకు కిలోకు రూ.26 మార్జిన్ ఇచ్చేవారని, గత ఇరవై ఏళ్లుగా ఇదే మార్జిన్ ఇస్తున్నారని, ఇటీవల ఈ మార్జిన్ రూ.16కు తగ్గించారని దుకాణ యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. కేజీ చికెన్ మార్జిన్ రూ.30 ఇవ్వాలని ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అందుకే మార్జిన్ పెంచే వరకు నిరవధిక బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుతం చికెన్ విక్రయాలపై వస్తున్న లాభాలు తక్కువగా ఉండటంతో షాపులు నిర్వహించడం కష్టంగా మారినట్లు అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు. తక్కువ మార్జిన్ వల్ల వ్యాపారుల జీవనోపాధి సవాల్‌గా మారిందని అంటున్నారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరసన కొనసాగుతుందని తెలిపారు.

## మా పంటలు ఎండిపోతుంటే అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తారా?

శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు తగ్గినా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజమెత్తారు. తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ, పాలమూరు జిల్లాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోతుంటే మీరు విద్యుత్ ఉత్పత్తి ఎలా చేస్తారని ఏపీ సర్కారును ప్రశ్నించారు. ఏపీ ప్రభుత్వం కనీసం తాగడానికి కూడా నీళ్లు లేకుండా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జలాశయంలో నీటి మట్టం తక్కువగా ఉన్నప్పుడు విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయాలనే స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని జూపల్లి గుర్తు చేశారు. “ఉమ్మడి రాష్ట్రంలో 2012లో కూడా ఇలాగే అక్రమంగా నీటిని తరలించుకుపోయారు. నాడు మేము ధర్నా చేసి, హైకోర్టును ఆశ్రయిస్తే కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఇప్పుడు మళ్ళీ అదే పంథాను ఏపీ ప్రభుత్వం అనుసరిస్తోంది” అని ఆయన విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్టులో తెలంగాణకు 64 శాతం వాటా ఉందని, రైతుల హక్కులను కాలరాస్తే ఊరుకోబోమని జూపల్లి హెచ్చరించారు. “నీటి కేటాయింపులపై స్పష్టమైన జీవోలు ఉన్నాయి. సమాచారం అందలేదని చెప్పడానికి మీరేమైనా చదువురాని వాళ్లా?” అని ఆయన ఏపీ పాలకులను సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసిందని, ఏపీ కూడా చట్టప్రకారం నడుచుకోవాలని హితవు పలికారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీశైలంలో నీటి దోపిడీని పట్టించుకోకపోవడం వల్లే, ఏపీ ప్రభుత్వం ఇప్పుడు అలుసుగా తీసుకుంటోందని జూపల్లి ధ్వజమెత్తారు. ఇప్పటికైనా అక్రమంగా నీటిని తరలించడం ఆపకపోతే.. రైతాంగం, ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ సమష్టిగా పోరాటం చేసి తమ హక్కులను కాపాడుకుంటామని ఆయన గట్టి వార్నింగ్ ఇచ్చారు. నీటి వాటాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు.

## ఒక్కడు... 27 బైకులు చోరీ చేశాడు!

- మొదటి పేజి తరువాయి

గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

వివరాల్లోకి వెళితే, సోమవారం మధ్యాహ్నం ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు తన సిబ్బందితో కలిసి మామిడిపాలెం సెంటర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, కొత్తపట్నం మండలం పాదర్తి గ్రామానికి చెందిన అద్దేటి ఏడుకొండలు (35) అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని ఆపి తనిఖీ చేయగా, దొంగిలించిన బైక్‌తో పాటు 1.175 కిలోల గంజాయి లభించింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు నిజాలు బయటపడ్డాయి. చెడు వ్యసనాలకు డబ్బు అవసరం కావడంతో బైక్ దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నట్లు ఏడుకొండలు అంగీకరించాడు. ఒంగోలు, మద్దిపాడు, అద్దంకి, వినుకొండ, గుంటూరు, నరసరావుపేట, జి.కొండూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 27 బైకులు దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. అతని సమాచారం మేరకు పోలీసులు ఆయా బైకులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.12 వేలు ఉంటుందని అధికారులు తెలిపారు. నిందితుడిపై గతంలోనూ ఒంగోలు, గుంటూరులో పలు దొంగతనం కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన ఒంగోలు డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, సీఐ నాగరాజుతో పాటు ప్రత్యేక బృందంలోని సిబ్బందిని ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ప్రత్యేకంగా అభినందించారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి, పక్కా ప్రణాళికతో నిందితుడిని పట్టుకున్నట్లు ఆయన తెలిపారు.



ఆ అక్రమ షెడ్డు పక్కనే, ప్రస్తుతం మరో అక్రమ షెడ్డు నిర్మాణ పనులు..

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

- గాగిల్లాపూర్‌లో కలెక్టర్ డి-నోటిఫికేషన్ చేసిన భూదాన్ భూముల్లో అక్రమ షెడ్లు..
- "అదనపు కలెక్టర్-ఆర్డీవోకు" ఫిర్యాదు చేసినా ప్రయోజనం శూన్యం..!
- చర్యలకు ససేమిరా అంటూ..! అదనపు కలెక్టర్ మాట వినని తహశీల్దార్..?
- ప్రజాప్రతినిధి సిఫార్సులతో రెండు..! ఈ సాకుతో మరో అక్రమ షెడ్డు..!
- అక్రమార్కులకే రెవెన్యూ ప్రాధాన్యత.. ప్రభుత్వ భూములకు శఠగోపం..

# భూదాన్ భూమిలో... అక్రమార్కుల పాగా..!

## రెవెన్యూ అధికారుల అండతోనే..? దర్జాగా అక్రమ షెడ్ల నిర్మాణాలు..?

తెలంగాణలో అసలేం జరుగుతోంది..? అధికారమనే ముసుగులో దొరల పెత్తందారీ వ్యవస్థ అనధికారికంగా కొనసాగుతోందా..? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.. కొన్ని ముఖ్య విభాగాల్లో పోస్టింగ్‌లు మొదలుకుని..! తహశీల్దార్ కార్యాలయాల్లో పోస్టింగ్‌ల వరకు ఒక సామాజిక వర్గానికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలుస్తోంది.. వాళ్ళకు సంబంధించిన ప్రభుత్వ భూములు- అందులోని అక్రమ కట్టడాల పరిరక్షణ వ్యవహారాలకు సమర్థవంతంగా సహకరించడమే ధ్యేయంగా విధులు నిర్వర్తిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.. ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూమిలో అదే తంతు..! వట్టినాగుల పల్లిలోనూ ఓ ప్రైవేటు భూమి ఆక్రమణలోనూ అధికారపార్టీ నేతలపై బాధితులు పత్రికా సమావేశంలో బహిరంగంగానే ఆరోపించిన విషయం సోషల్ మీడియాలోనూ వైరల్ అవుతున్న సంగతి తెలిసిందే..! అర్హత కలిగిన ఎందరో తహశీల్దార్‌లు ఉన్నప్పటికీ..! ఏపార్టీ అధికారంలో ఉన్నా, సంబంధిత అధికారపార్టీలో మెజారిటీ సామాజివర్గానికి చెందిన అధికారులను, వివిధ ప్రధాన శాఖల్లో (ఆర్థికంగా బలపడే) పోస్టింగ్‌లు ఇవ్వడం ఆనవాయితీ..! అంటూ విమర్శలు వస్తున్నాయి..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మార్చి 31:**

-4లో



సర్వే నెం.145 భూదాన్ భూమిలో అక్రమ షెడ్ల సామ్రాజ్యానికి.. దర్జాగా గేటు నిర్మాణం.


గత డిసెంబర్ నెలలో భూదాన్ భూమిలో నిర్మించిన అక్రమ షెడ్డు నిర్మాణం..

## ఏ తప్పు చేయకపోయినా కావాలనే వేధిస్తున్నారు

**సీఐడీ నోటీసులపై కౌశిక్ రెడ్డి స్పందన**

- తన కుటుంబ సభ్యులను గొడవల్లోకి లాగొద్దన్న కౌశిక్ రెడ్డి
- తనది ప్రజల కోసం చేస్తున్న పోరాటమని వ్యాఖ్య
- ప్రశ్నించే గొంతును అధికార బలంతో అణచివేయలేరన్న కౌశిక్

-4 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## కరీంనగర్ జిల్లా హత్య కేసులో 15 మందికి జీవిత ఖైదు

- చేపలు పట్టే విషయంలో ఏడేళ్ల క్రితం ఘర్షణ, ఒకరి హత్య
- జీవిత ఖైదుతో పాటు రూ.1,500 చొప్పున జరిమానా విధించిన న్యాయస్థానం
- ఒక నిందితుడు మైనర్ కావడంతో బాలనేరస్థుల న్యాయస్థానంలో విచారణకు అనుమతి

**హైదరాబాద్ పెన్ పవర్:**ఒక వ్యక్తి హత్య కేసులో 15 మంది నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్ తీర్పు వెలువరించారు. మరో నిందితుడు మైనర్ కావడంతో అతడిపై బాలనేరస్థుల న్యాయస్థానంలో విచారణకు అనుమతించింది. చేపలు పట్టే విషయంలో ఏడేళ్ల క్రితం జరిగిన ఘర్షణ హత్యకు దారితీసింది. కరీంనగర్ రూరల్ మండలంలోని చామనపల్లి గ్రామానికి చెందిన బొజ్జ తిరుపతి గ్రామ మత్స్యకార సంఘం అధ్యక్షుడిగా ఉన్న సమయంలో చెరువుల వివాదంలో ప్రత్యర్థి వర్గానికి చెందిన వ్యక్తులు అతడిని హత్య చేశారు. రాళ్లతో దాడి చేసి, కండువాను మెడకు బిగించి హతమార్చారు. ఈ ఘటన 2019 ఏప్రిల్ 19న జరిగింది. ఈ కేసుపై విచారణ జరిపిన న్యాయస్థానం 15 మంది నిందితులకు జీవితఖైదుతో పాటు రూ. 1,500 చొప్పున జరిమానా విధించింది.






## క్షణికావేశంలో దారుణ నిర్ణయం... ఇద్దరు పిల్లల ప్రాణం తీసిన తల్లి

- హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో విషాదకర ఘటన
- ఇద్దరు కుమారులను చంపి ఆత్మహత్య చేసుకున్న తల్లి
- భర్త వివాహేతర సంబంధమే కారణమని ప్రాథమిక నిర్ధారణ

**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కట్టుకున్న భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న మనస్తాపంతో ఓ తల్లి తన ఇద్దరు పిల్లలను చంపి, ఆపై తాను ఆత్మహత్యకు పాల్పడింది. ఈ హృదయ విదారక ఘటన కైతలాపూర్ రాఘవేంద్ర కాలనీలో వెలుగుచూసింది.

**అసలేం జరిగిందంటే..!**

స్థానికంగా స్రవంతి (28) అనే మహిళ తన భర్తతో కలిసి నివాసం ఉంటోంది.

-4 లో

## లిక్కర్ కిక్కు..సర్కార్ కు రూ. 46 వేల 500 కోట్ల ఆదాయం



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ఖజానాకు మద్యం ఆదాయం కాసుల వర్షం కురిపించింది. ఎక్సైజ్ శాఖ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా రికార్డ్ స్థాయి ఆదాయం సమకూరింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను అంచనాలను మించి ఆదాయం వచ్చింది. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ ఎక్సైజ్ శాఖకు మొత్తం 46 వేల 500 కోట్ల రూపాయల భారీ ఆదాయం లభించింది. కేవలం మద్యం అమ్మకాల ద్వారానే కాకుండా, లైసెన్స్‌లు, అప్లికేషన్ల ద్వారా కూడా ప్రభుత్వం భారీగా ఆర్జించింది.

-5 లో


# భూదాన్ భూమిలో.. అక్రమార్కుల పాగా..!


గతేడాది అదే భూదాన్ భూమిలో అక్రమ షెడ్డుపై పాక్షిక చర్యలు.. నేటికీ ఇదే పరిస్థితి..


రెవెన్యూ కూల్చేసిన అక్రమ షెడ్డుకు, విద్యుత్ అధికారుల ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్..

**గండిమైసమ్మ--దుండిగల్ మండలం పరిధిలోని గాగిల్లాపూర్ భూదాన్ భూములుగా నమోదైన పలు సర్వే నెంబర్లపై, గతంలో రెవెన్యూ తప్పిదంతో జారీ చేసిన తప్పుడు "ఎన్‌వోసి"లను రద్దు చేసి, రిజిస్ట్రేషన్‌లు కూడా నిలిపి వేయాలంటూ, అప్పటి జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.. "కమిషనర్ అండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంపుల శాఖకు" 28 జనవరి 2025 తేదీన, అప్పటి కలెక్టర్ లేఖ రాశారు.. ఈ లేఖలో గాగిల్లాపూర్ గ్రామ పరిధిలోని భూదాన్ భూముల "డి-నోటిఫికేషన్" అంశాన్ని స్పష్టంగా వివరించారు.. గాగిల్లాపూర్ సర్వే నెంబర్‌లు 138, 139, 140, 141, 142, 143, 144, 145, 146, 147, 148, 150, 151, 155, 161 మరియు 165 లలో మొత్తం 77-19 ఎకరాల భూదాన్ భూములు నమోదైన్నట్టు రెవెన్యూ పరిశీలన (ఆర్డీవో-తహశీల్దార్ విచారణ)లో తేలిందని కలెక్టర్ పేర్కొన్నారు..**


పెన్ పవర్ PEN POWER
ఆ భూములు మళ్ళీ..! భూదాన్ జాబితాలోకే..!


పెన్ పవర్ PEN POWER
ఆ భూములు మళ్ళీ..! భూదాన్ జాబితాలోకే..!


పెన్ పవర్
కూల్చేసిన అక్రమ షెడ్డుకు..! విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


పెన్ పవర్ PEN POWER పేన పవర
భూదాన్ భూమి పరిరక్షణ.. కాగితాలకే పరిమితమా..?


పెన్ పవర్ PEN POWER పేన పవర
భూదాన్ భూమి పరిరక్షణ.. కాగితాలకే పరిమితమా..?

-3 పేజి తరువాయి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ గండిమైసమ్మ మండలంలో ప్రభుత్వ భూముల కబ్జాలు అధికారుల కనుసన్నల్లోనే కొనసాగుతున్నాయని అనడంలో అతిశయోక్తి కాదు.. పై అధికారులు మొదలుకొని, పాలకులూ తమ వారేననే ధిమాతో, తాము ఏలాంటి పొరపాట్లు చేసినా, ఉద్యోగానికి ఏ డోకాలేదని భావించే కొందరు రెవెన్యూ అధికారుల తీరుకు, వందల కోట్లు విలువైన ప్రభుత్వ భూములు పరాధీనం అవుతున్నాయి.. చివరికి కలెక్టర్ డి-నోటిఫికేషన్ చేసిన భూములు సైతం కబ్జాదారులకు ధారాదత్తం చేస్తున్నారు.. గాగిల్లాపూర్‌లో భూదాన్ భూముల్లో ఈ కబ్జా వ్యవహారం అధికారుల అవినీతిని బట్టబయలు చేస్తోంది.. గతంలో రెవెన్యూ అధికారుల పొరపాట్లను ఆర్డీవో విచారణతో గుర్తించిన అప్పటి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు, 2025 జనవరి- ఫిబ్రవరి నెలల్లో డి-నోటిఫికేషన్ చేసి 22-ఎ నిషేధిత జాబితాలో పెట్టారు.. సంబంధిత భూదాన్ భూములపై కఠినమైన ఆదేశాలు ఉన్నాయి.. అయినప్పటికీ రెవెన్యూ అధికారుల బరితెగింపు విధుల నిర్వహణ, అక్రమార్కులకు అనుకూలంగా ఉండటం బాధాకరం..

## రెవెన్యూ నిర్లక్ష్యమే..! కబ్జాలకు దారితీస్తుంది..!

దుండిగల్ గండిమైసమ్మ మండల పరిధిలోని గాగిల్లాపూర్‌లో భూదాన్ భూముల్లో అక్రమ షెడ్ల నిర్మాణాలు కలెక్టర్ ఆదేశాలను ధిక్కరించి వెస్తుండటం, స్థానిక రెవెన్యూ నిర్లక్ష్యాన్ని వేలెత్తి చూపుతోంది.. ఒకవైపు కలెక్టర్ డి-నోటిఫికేషన్ ద్వారా భూములను రక్షించాలనే ప్రయత్నం చేసినా, మరోవైపు స్థానిక రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యంతో పరిస్థితి పూర్తిగా అదుపు తప్పినట్లు కనిపిస్తోంది.. అధికారుల నిర్లక్ష్యం, కబ్జాదారులకు వరంగా మారింది.. ప్రభుత్వ భూములు కాపాడాల్సిన బాధ్యత గల రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఉన్నతాధికారులు పట్టించుకోక పోవడం, స్థానిక అధికారులు చర్యలు తీసుకోక పోవడంతో కబ్జాదారులు మరింత ధైర్యంగా ముందుకు సాగుతున్నారు.. గాగిల్లాపూర్ సర్వే నెం.145 భూదాన్ భూమిలో, గత డిసెంబర్ నెలలో ఓ వ్యక్తి భారీ అక్రమ షెడ్డును నిర్మిస్తుండగా, ఫొటోల తోపాటు, 'పెన్ పవర్' దినపత్రికలో వచ్చిన వార్తా కథనాలతో స్థానిక దుండిగల్ రెవెన్యూ అధికారులకు, మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్, మల్కాజిగిరి ఆర్డీవో దృష్టికి తీసుకెళ్ళినా చర్యలు శూన్యం.. పైగా సంబంధిత అక్రమ షెడ్డు ఓ ప్రజాప్రతినిధి బంధువుకు చెందినదిగా, పేర్కొంటూ, కలెక్టర్ చర్యలు తీసుకోవద్దని చెప్పినట్లు స్థానిక రెవెన్యూ అధికారి పై అధికారికి సమాధానం ఇచ్చినట్టు సమాచారం..

## చర్యలు లేక మరో అక్రమ షెడ్డు..

భూదాన్ భూముల పట్ల, దుండిగల్ రెవెన్యూ అధికారుల అలసత్వమో..! లేక అక్రమార్కులతో ఒప్పందమో తెలియదు కానీ..! కలెక్టర్ జారీ చేసిన డి-నోటిఫికేషన్ ఆదేశాలను, పక్కనపెట్టినట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు తలెత్తుతున్నాయి.. మరోవైపు "భూములను కాపాడుతున్నారా..? లేక కట్టబెడుతున్నారా..?" అనే ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి.. ప్రజాప్రతినిధి సిఫార్సుల పేరిట, మొదటి అక్రమ షెడ్డుపై నేటికీ చర్యలు లేకపోవడంతో.. కబ్జాదారులు మరో అక్రమ షెడ్డుకు శ్రీకారం చుట్టారు.. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సి రెవెన్యూ అధికారులు, ఓ ప్రజాప్రతినిధి బంధువుకు చెందిన రెండవ అక్రమ షెడ్డుకు సహకరించడంలో భారీగా ముడుపులు స్వీకరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి..

# క్షణికావేశంలో దారుణ నిర్ణయం... ఇద్దరు పిల్లల ప్రాణం తీసిన తల్లి

-3 పేజి తరువాయి

వీరికి కార్తిక్ (12), కౌశిక్ (8) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే, కొంతకాలంగా ఆమె భర్త వేరొకరితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడన్న విషయం తెలిసి స్రవంతి తీవ్ర మనోవేదనకు గురైంది. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తితో దారుణమైన నిర్ణయం తీసుకుంది. ముందుగా తన ఇద్దరు కుమారులను చంపి, అనంతరం తాను కూడా బలవన్మరణానికి పాల్పడింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. భర్త వివాహేతర సంబంధమే ఈ దారుణానికి ప్రధాన కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కన్నతల్లే పిల్లలను కడతేర్చిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# ఏ తప్పు చేయకపోయినా కావాలనే వేధిస్తున్నారు: సీఐడీ నోటీసులపై కౌశిక్ రెడ్డి స్పందన



**హైదరాబాద్ పెన్ పవర్:** తనకు సీఐడీ నోటీసులు అందడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఎక్స్ వేదికగా తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాననే కక్షతోనే తనను ఇబ్బంది పెడుతున్నారని ఆయన ఆరోపించారు. "రేవంత్ రెడ్డి గారు... నన్ను లక్ష్యంగా చేసుకోండి, నాపై ఎన్ని కేసులైనా పెట్టండి, నోటీసులు ఇవ్వండి. కానీ నా కుటుంబాన్ని, మా బీఆర్ఎస్ కుటుంబ సభ్యులను ఈ గొడవల్లోకి లాగి ఇబ్బంది పెట్టడం ఎంతవరకు న్యాయం?" అని ప్రశ్నించారు. ఏ తప్పు చేయకపోయినా కావాలనే వేధిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎన్ని బెదిరింపులకు గురిచేసినా తాను వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. "ఇది నా వ్యక్తిగత పోరాటం కాదు, ప్రజల కోసం చేస్తున్న పోరాటం. మీరు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు మిమ్మల్ని నిలదీస్తూనే ఉంటాను" అని హెచ్చరించారు. ప్రశ్నించే గొంతును అధికార బలంతో అణచివేయలేరని, ప్రజల పక్షాన తన పోరాటం నిరంతరం కొనసాగుతుందని అన్నారు.


జనవరి 29న హుజూరాబాద్ నియోజకవర్గం వీణవంకలో జరిగిన మినీ మేడారం జాతర సందర్భంగా పోలీసులతో కౌశిక్ రెడ్డి వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో, ఆయనపై కేసు నమోదయింది. ఈ క్రమంలో, ఏప్రిల్ 4న విచారణకు హాజరుకావాలని సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు.

# 30 వేల ఎకరాల ల్యాండ్ ఎక్విజేషన్.. అనుకున్నంత ఈజీ కాదా

**హైదరాబాద్ మార్చి 31, పెన్ పవర్:** ముచ్చర్ల కేంద్రంగా సుమారు 30,000 ఎకరాల్లో విస్తరించనున్న భారత్ ఫ్యూచర్ సిటీ ప్రకటనతో స్థానిక రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ఒక రకమైన స్తబ్దత, అదే సమయంలో తీవ్రమైన ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా ఏఐ సిటీ, హెల్త్ సిటీ , నెట్ జీరో సిటీ వంటి భారీ జోన్ల ఏర్పాటు ఖరారు కావడంతో, ముచ్చర్ల చుట్టుపక్కల 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న వ్యవసాయ భూముల అమ్మకాలు దాదాపుగా నిలిచిపోయాయి. అటు రైతులు తమ భూములకు భవిష్యత్తులో మరింత ధర వస్తుందని ఆగుతుండగా, ఇటు ఇన్వెస్టర్లు ప్రభుత్వ ల్యాండ్ పూలింగ్ నిబంధనలు ఎలా ఉంటాయోనని వేచి చూస్తున్నారు.ప్రభుత్వం ఇక్కడ అమరావతి తరహాలో ల్యాండ్ పూలింగ్ విధానాన్ని పరిశీలిస్తుండటం ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశమైంది. ఈ విధానంలో రైతులు లేదా యజమానుల నుంచి భూమిని తీసుకుని, దానిని అభివృద్ధి చేసిన తర్వాత కొంత భాగాన్ని తిరిగి వారికే కేటాయిస్తారు. అయితే, ఇప్పటికే అక్కడ ప్లాట్లు కొన్న ఇన్వెస్టర్లు తమ భూమి ఏ జోన్‌లోకి వెళ్తుంది? ప్రభుత్వం ఇచ్చే లేఅవుట్ ఎక్కడ ఉంటుంది? అనే గందరగోళంలో ఉన్నారు. ఈ స్పష్టత వచ్చే వరకు కొత్త రిజిస్ట్రేషన్లు చేయడం కంటే, ఉన్న భూమిని కాపాడుకోవడం మిన్న అని రియల్టర్లు భావిస్తున్నారు.ఫ్యూచర్ సిటీ ప్రభావం కేవలం ముచ్చర్లకే పరిమితం కాకుండా, కందుకూర్, యాచారం, మహేశ్వరం , ఆమనగల్ వరకు పాకింది. 20 కిలోమీటర్ల రేడియస్‌లో ఎక్కడ చూసినా ఫ్యూచర్ సిటీ కి చేరువలో ఉన్న వెంచర్ల గురించే చర్చ జరుగుతోంది. శ్రీశైలం హైవే , నాగార్జున సాగర్ హైవేలను కలిపేలా ప్రతిపాదించిన 41 కిలోమీటర్ల గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే ఈ ప్రాంతపు రూపురేఖలను మార్చబోతోంది. దీంతో ఎకరం ధర కొన్ని చోట్ల కోట్లకు చేరుకోగా, చిన్న ఇన్వెస్టర్లు మాత్రం ఇప్పుడు అడుగు పెట్టాలా వద్దా అనే సందిగ్ధంలో పడ్డారు.తెలంగాణ ప్రభుత్వం దీనిని కేవలం ఒక సిటీగా కాకుండా, భారతదేశపు మొదటి నెట్ జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది. గ్లోబల్ ఏఐ



సమ్మిట్ తర్వాత అంతర్జాతీయ సంస్థలు ఇక్కడ డేటా సెంటర్లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతుండటంతో భూములు ఉన్న వాళ్లు చాలా జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకుంటున్నారు.




## మానవ హక్కుల సదస్సులో ఐడీ కార్డుల పంపిణీ



**వనపర్తి, మార్చి 31 పెన్ పవర్:** వనపర్తి జిల్లాలో అంతర్జాతీయ మానవ హక్కుల మరియు సామాజిక న్యాయ సంస్థ (ఎఉఖీూఏూ) ఆధ్వర్యంలో మంగళవారం మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక చైతన్యంపై అవగాహన సదస్సు, ఐడి కార్డ్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బి. మహేష్ గౌడ్, పద్మ దేశాయ్ వంటి ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ప్రతినిధుల ఉత్సాహంతో విజయవంతమైంది.

## ఉదండాపూర్ నిర్వాసితులకు మరో రూ. 150 కోట్లు:

**జడ్చర్ల, మార్చి 31 పెన్ పవర్:** ఉదండాపూర్ నిర్వాసితుల పునరావాస ప్యాకేజీ కోసం ప్రభుత్వం తాజాగా రూ. 150 కోట్లు విడుదల చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఇప్పటివరకు మొత్తం రూ. 400 కోట్లు విడుదల చేసినట్లు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలిపారు. ఎక్కువ పరిహారం కోరుతూ కోర్టుకు వెళ్లిన వారితో కూడా మాట్లాడి, వారికి రావాల్సిన మొత్తాన్ని అందజేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరినట్లు ఆయన పేర్కొన్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితుల తరహాలోనే, ఉదండాపూర్ నిర్వాసితులకు కేటాయించిన ప్లాట్లను రిజిస్టర్ చేసి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కలెక్టర్‌ను కోరారు.

## లారీ క్యాబిన్‌లోనే కుప్పకూలిన డ్రైవర్

**షాద్‌నగర్, మార్చి 31 పెన్ పవర్:** ఇసుక లోడు కోసం వచ్చిన ఓ లారీ డ్రైవర్ హఠాన్మరణం చెందినట్లు పోలీసులు తెలిపారు. సీఐ శ్రీలత కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం బిల్డింగ్ తండా అమాజిపురంనకు చెందిన రాత్లవత్ పీర్యానాయక్ (38) కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఊటూర్‌లోని ఇసుక క్వారీకి ఆదివారం సాయంత్రం వచ్చారు. ఇసుక లోడింగ్ కోసం లారీని వరుసలో నిలిపిన ఆయన ఉదయం లారీ ముందుకు తీయకపోవడంతో వెనుకాల ఉన్న లారీ డ్రైవర్ వచ్చి చూడగా క్యాబిన్‌లో ముందుకు పడి మృతి చెందడం గుర్తించారు. భోజనానికి కూర్చున్నట్లు ఉన్న పీర్యానాయక్ తల పళ్లెంలో ఉండటంతో గుండెపోటు వచ్చినట్లు అనుమానిస్తున్నారు. మృతుడి సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడు మృతి

**సూర్యాపేట, మార్చి 31 పెన్ పవర్:** సూర్యాపేట మండలం యాండ్ల ల్లి గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు జ్యోతుల రామకృష్ణ, మంగళవారం ద్విచక్ర వాహనంపై సూర్యాపేట నుండి పాఠశాలకు వెళుతుండగా, ట్రాక్టర్ ఢీకొని మృతి చెందారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. రామకృష్ణ మృతి పట్ల పలు ఉపాధ్యాయ సంఘాలు సంతాపం వ్యక్తం చేశాయి.

## కనీస సామర్థ్యాల సాధన కు కృషి చేయాలి

**కోదాడ, మార్చి 31 పెన్ పవర్:** మంగళవారం, సూర్యాపేట జిల్లా ప్యానల్ తనిఖీ బృందం కోదాడ మండల పరిధిలోని తొగర్రాయి హరిజనవాడ ప్రాథమిక పాఠశాలను సందర్శించింది. ప్రార్థన సమయానికే హాజరైన బృందం ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించి, తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో తెలుగు, ఆంగ్ల పదాలను చదివించింది. మెరుగైన బోధన కోసం సూచనలు చేసింది. ఈ కార్యక్రమంలో బృందం లీడర్ మధుసూదన్ రెడ్డి, హెచ్ఎం భాస్కర్, ఉపాధ్యాయులు అంకులయ్య పాల్గొన్నారు.

## బిజెపి కార్యవర్గ సభ్యునిగా రుక్మారావు

**తుంగతుర్తి, మార్చి 31 పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యునిగా రంగరాజు రుక్మారావు ఎన్నికయ్యారు. ఈ మేరకు తెలంగాణ బిజెపి అధిష్టానం ఒక ప్రకటన విడుదల చేసింది. సూర్యాపేట జిల్లాలో బిజెపి పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని రుక్మా రావు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించినందుకు బిజెపి అధిష్టానానికి మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

## లిక్కర్ కిక్కు..సర్కార్ కు రూ. 46 వేల 500 కోట్ల ఆదాయం

-3 పేజి తరువాయి

మద్యం దుకాణాల అప్లికేషన్ల రూపంలోనే సుమారు 3 వేల కోట్ల రూపాయలు రాగా.. ఇతర లైసెన్స్ ఫీజుల ద్వారా మరో 2,500 కోట్ల రూపాయల ఆదాయం సమకూరింది.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 2,620 వైన్ షాపులు, 1,129 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. వీటికి ఉన్న విపరీతమైన డిమాండ్ కారణంగా అప్లికేషన్ల ఫీజులు, వార్షిక లైసెన్స్ ఫీజుల రూపంలో ప్రభుత్వానికి కాసుల పంట పండింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి మద్యం విక్రయాలు గణనీయంగా పెరగడమే ఈ రికార్డ్ స్థాయి ఆదాయానికి ప్రధాన కారణమని తెలుస్తోంది.

# రేవంత్ రెడ్డి మైండ్ బ్లోయింగ్ గ్రాఫ్!

**హైదరాబాద్ మార్చి 31, పెన్ పవర్:**
భారతదేశంలో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల జాబితాలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాధించిన స్థానం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రధాని నరేంద్ర మోదీ అగ్రస్థానంలో నిలవడం సహజమే అయినా, కేవలం కొన్ని ఏళ్లలోనే ప్రాంతీయ స్థాయి నుంచి జాతీయ స్థాయి గుర్తింపు పొందడంలో రేవంత్ రెడ్డి సక్సెస్ గ్రాఫ్ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఈ జాబితాలో ఆయనకు లభించిన 25వ స్థానం కేవలం ఒక అంకె మాత్రమే కాదు, అది ఆయన రాజకీయ చతురతకు, వ్యూహరచనకు నిదర్శనం.ఢిల్లీ రాజకీయాల్లో దశాబ్దాల అనుభవం ఉన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే (43వ స్థానం), గాంధీ కుటుంబ వారసురాలు ప్రియాంక గాంధీ (35వ స్థానం) వంటి ఉద్ధండుల కంటే రేవంత్ రెడ్డి ముందు వరుసలో నిలవడం చిన్న విషయం కాదు. తన రాజకీయ గురువు, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు 13వ స్థానంలో ఉండగా, ఆయన శిష్యుడిగా రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన రేవంత్, అనతి కాలంలోనే 25వ స్థానానికి చేరుకోవడం విశేషం. తెలంగాణ కాంగ్రెస్‌లో హేమాహేమీల వంటి సీనియర్లు ఉన్నప్పటికీ, అధిష్టానం రేవంత్ రెడ్డికే పగ్గాలు అప్పగించడం వెనుక ఉన్న నమ్మకాన్ని ఆయన వంద శాతం నిలబెట్టుకున్నారురేవంత్ రెడ్డి కేవలం ఒక ముఖ్యమంత్రిగానే కాకుండా, పార్టీని నడిపించే ఒక శక్తివంతమైన సైన్యాధ్యక్షుడిగా ఎదిగారు. కాంగ్రెస్ వంటి అంతర్గత ప్రజాస్వామ్యం, అసమ్మతి ఎక్కువ ఉన్న పార్టీలో, అందరినీ కలుపుకుపోతూ గ్రూపు రాజకీయాలకు తావులేకుండా చేయడంలో ఆయన సఫలమయ్యారు. క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను ఉత్సాహపరచడం, ప్రత్యర్థుల ఎత్తుగడలను చిత్తు చేయడంలో రేవంత్ స్టైల్ ప్రత్యేకం. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా, రాష్ట్ర అభివృద్ధిపై స్పష్టమైన విజన్‌తో ముందుకు సాగుతున్నారు. దూకుడుగా ఉండే ప్రసంగాలు, తడబడని నడక ఆయనను యువతలో తిరుగులేని నాయకుడిగా నిలబెట్టాయి.సాధారణంగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో నిరంతరం ఘర్షణ వైఖరిని అవలంబిస్తుంటారు. కానీ, రేవంత్ రెడ్డి ఇక్కడ విలక్షణమైన



పంథాను అనుసరిస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో సఖ్యతగా ఉంటూనే, రాజకీయంగా ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో ఆయనకు బాగా తెలుసు. మోదీ సర్కార్ కూడా తెలంగాణ ప్రభుత్వానికి సానుకూలంగా స్పందిస్తుండటం రేవంత్ రెడ్డి దౌత్యనీతికి నిదర్శనం. వివాదాల కంటే అభివృద్ధి ముఖ్యం అనే ధోరణితో ఆయన కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు రాబట్టుకోవడంలో సక్సెస్ అవుతున్నారు.ఈ పవర్ ఫుల్ పర్సన్స్ జాబితా ఒక సంకేతాన్ని స్పష్టం చేస్తోంది. భవిష్యత్తులో జాతీయ రాజకీయాల్లో, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించబోతున్నారు. దక్షిణాదిలో పార్టీని బలోపేతం చేయడమే కాకుండా, జాతీయ
స్థాయిలో మోదీ వంటి బలమైన నాయకుడిని ఎదుర్కోవడంలో రేవంత్ వ్యూహాలు పార్టీకి కీలకం కానున్నాయి. ఒక సామాన్య కార్యకర్త స్థాయి నుంచి దేశంలోనే 25వ అత్యంత శక్తివంతమైన వ్యక్తిగా ఎదిగిన రేవంత్ రెడ్డి ప్రస్థానం, రాజకీయాల్లో పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమని నిరూపిస్తోంది.

# పొంగులేటీ టార్గెట్ వెనుక... ఏం జరుగుతోంది



**హైదరాబాద్ మార్చి 31, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయ క్షేత్రంలో ప్రస్తుతం బిఆర్ఎస్ వర్సెస్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మధ్య జరుగుతున్న యుద్ధం అత్యంత ఆసక్తికరంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంటే ఎక్కువగా పొంగులేటిని టార్గెట్ చేయడం వెనుక బలమైన రాజకీయ కనిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఒక కీలక విషయాన్ని లేవనెత్తారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన కొన్ని అక్రమ వ్యవహారాలు, కొత్త ప్రాజెక్టుల విషయంలో బిఆర్ఎస్ నేతలు చేస్తున్న పైరవీలకు పొంగులేటి అడ్డుపడుతున్నారని, అందుకే ఆయనను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారు.గతంలో తమకు అనుకూలంగా ఉన్న వ్యవస్థలను పొంగులేటి ఇప్పుడు ప్రక్షాళన చేస్తుండటంతో, తమ పనులు కావడం లేదన్న కోపంతోనే బిఆర్ఎస్ పెద్దలు పొంగులేటి అక్రమ మైనింగ్ పై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తున్నారని అధికార పక్షం వాదన. పొంగులేటిని ఒత్తిడిలోకి నెట్టడం ద్వారా తమ పాత పనులను చక్కబెట్టుకోవాలనే వ్యూహం ఇందులో ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, బిఆర్ఎస్ నేతలు మాత్రం పొంగులేటిపై అక్రమ మైనింగ్ అనే అస్త్రాన్ని బలంగా ప్రయోగిస్తున్నారు. కేవలం అసెంబ్లీకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయడం, గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం ద్వారా దీనిని ఒక పెద్ద స్కామ్‌గా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు.పొంగులేటి వ్యాపార సామ్రాజ్యాన్ని దెబ్బతీయడం ద్వారా ఆయన రాజకీయ ప్రభావాన్ని తగ్గించవచ్చని బిఆర్ఎస్ భావిస్తున్నట్లుగా చెబుతున్నారు. గతంలో తమ పార్టీలో ఉన్న వ్యక్తి కావడంతో, ఆయన బలహీనతలు తమకు తెలుసని, అందుకే పకడ్బందీగా ఆధారాలతో దాడి చేస్తున్నామని బిఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. అయితే, ఇది నిజంగా అవినీతిపై పోరాటమా లేక రాజకీయ
కక్షసాధింపా అన్నది ప్రజల్లో చర్చనీయాంశమైంది.రాజకీయంగా చూస్తే, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ తీశారు. గత ఎన్నికల్లో అక్కడ బిఆర్ఎస్ క్లీన్ స్వీప్ అవ్వడానికి ఆయనే ప్రధాన కారకుడు. భవిష్యత్తులో కూడా ఆయన తన పట్టును పెంచుకుంటే బిఆర్ఎస్ ఆ జిల్లాలో కోలుకోవడం అసాధ్యం. అందుకే, ఆయనపై అవినీతి ముద్ర వేయడం ద్వారా ప్రజల్లో ఆయన ఇమేజ్‌ను దెబ్బతీయాలనేది బిఆర్ఎస్ వ్యూహంగా కనిపిస్తోంది. రేవంత్ రెడ్డి కంటే పొంగులేటిని టార్గెట్ చేయడం వల్ల అటు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టవచ్చు, ఇటు తమ బద్ధశత్రువుపై పగ తీర్చుకోవచ్చు అనే వ్యూహం అమలు చేస్తున్నారని భావిస్తున్నారు.

# భారీగా తగ్గిన ఇంజనీరింగ్ అప్లికేషన్స్

**హైదరాబాద్ మార్చి 31, పెన్ పవర్:**
రాష్ట్రంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఈఏపీసెట్ 2026 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ఆలస్య రుసుములేకుండా ఏప్రిల్ 4తో ముగియనున్నాయి. ఈ క్రమంలో ఈసారి ఈఏపీసెట్ దరఖాస్తుల సంఖ్య తగ్గే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మార్చి 28 నాటికి ఇంజినీరింగ్‌కు 1,78,442 మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగానికి 73,782 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తు చేసుకునే గడువు ఏప్రిల్ 4తో ముగుస్తుంది. అంటే మరో 6 రోజులే సమయం ఉంది. ఆ తర్వాత ఆలస్య రుసుంతో మే 2 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అయినప్పటికీ గత కొన్నేళ్ల గణాంకాలను పరిశీలిస్తే ఆ సంఖ్య 6 వేలకు మించదని తెలుస్తుంది. గత ఏడాది ఇంజినీరింగ్ విభాగానికి ఏకంగా 2.20 లక్షల దరఖాస్తులు అందాయి. ఇక అగ్రికల్చర్‌కు దాదాపు 87 వేలు వస్తాయి. మొత్తం కలిపి 3.07 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈసారి ఇంజినీరింగ్‌కు 2 లక్షలు, అగ్రికల్చర్‌కు 80 వేల మంది లోపే దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో దాదాపు 30 వేల వరకు దరఖాస్తులు తక్కువగా వచ్చే అవకాశం ఉందని ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ కె విజయకుమార్‌రెడ్డి తెలిపారు.గత ఏడాది ఏపీ విద్యార్థులు భారీగా దరఖాస్తు చేసుకోవడం వల్ల దరఖాస్తుల సంఖ్య పెరిగింది. ఈఏపీసెట్ ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు మే 9 నుంచి 11 వరకు జరుగుతాయి. ఇక ఆ మరుసటి రోజు నుంచే అంటే మే 12 నుంచి ఏపీ ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు మొదలవుతాయి. దీంతో ఈసారి ఏపీ విద్యార్థుల సంఖ్య తగ్గింది. గత ఏడాది ఇంజినీరింగ్‌కు 17,834 మంది, అగ్రికల్చర్‌కు 2,877 మంది ఇతర రాష్ట్రాల విద్యార్థులు దరఖాస్తు చేశారు. ఈసారి ఇప్పటివరకు ఇంజినీరింగ్‌కు 8 వేలు, అగ్రికల్చర్‌కు 1400 మంది మాత్రమే దరఖాస్తు చేశారు.

ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 4, 2026.

రూ.250 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 10, 2026.

రూ.500 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 15, 2026.

రూ.2,500 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 20, 2026.

రూ.5,000 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 24, 2026.

రూ.10,000 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ: మే 2, 2026 వరకు

దరఖాస్తు సవరణ: ఏప్రిల్ 6 నుంచి 8 వరకు.అగ్రికల్చర్, ఫార్మసీ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేదీ: ఏప్రిల్ 23, 2026.ఇంజినీరింగ్ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేదీ: ఏప్రిల్ 27, 2026.అగ్రికల్చర్ ఒ ఫార్మసీ పరీక్ష తేదీలు: మే 4, 5 తేదీల్లోఇంజినీరింగ్ పరీక్ష తేదీలు: మే 9 నుంచి మే 11 వరకు.

# డిజిటల్ ప్రపంచంలో ప్రతి క్షణం ఫూల్స్..

**హైదరాబాద్ పెన్ పవర్:** "తాజా సమాచారం ప్రకారం, అమెరికా అధ్యక్షుడు తాను ఇటీవల తీసుకున్న నిర్ణయాలన్నింటినీ వెనక్కి తీసుకున్నారనే వార్త ప్రపంచ మానవాళిని ఆనంద డోళికల్లో ముంచేస్తున్నది. అదే విధంగా ప్రపంచ ప్రజలు స్మార్ట్‌ఫోన్‌పై విరక్తి చెంది నేటి నుంచి వాడడం మానేశారనే వార్త కూడా సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తున్నది". ఈ వార్తలను మీరు నమ్మడం లేదు కదా ! మీరు నమ్మినట్లైతే మీరు పప్పులో కాలేయినట్లే, ఏప్రిల్ ఫూల్ అయినట్లే. అనాదిగా ప్రపంచ దేశాలు 01 ఏప్రిల్ రోజున "ఏప్రిల్ ఫూల్స్ డే" లేదా "ఆల్ ఫూల్స్ డే" నిర్వహించుకోవడం చూస్తేనే ఉన్నాం. ఆత్మీయులను సరదాగా ఆట పట్టించడం, క్షణ కాలం పాటు అబద్ధాలతో సహచరులు లేదా బంధువులను ఆశ్చర్యచకితులను లేదా ఫూల్ చేయడం, లేని దానిని ఉన్నట్లు లేదా ఉన్న దానిని లేనట్లుగా భ్రమింపజేయడం, జోక్స్ వేసుకొని నవ్వుకోవడం, చిలిపిగా ఒకరినొకరు మోసం చేసుకోవడం, అబద్ధపై వార్తలను సామాజిక మాద్యమాల్లో పోస్ట్ చేయడం లాంటి పలు ప్రవర్తనలతో ఏప్రిల్ ఫూల్ అంటూ సంతోషంగా గడపడం "ఆల్ ఫూల్స్ డే"కు మాత్రమే సొంతం.చారిత్రక నేపథ్యాలను తవ్వి చూస్తే ఏప్రిల్ ఫూల్స్ డే జననం 1582కు చెందుతుంది. ఫ్రాన్స్‌లో 01 ఏప్రిల్ రోజున ప్రారంభం అయ్యే జూలియన్ క్యాలెండర్ నుంచి 01 జనవరిన ప్రారంభమయ్యే గ్రిగోరియన్ క్యాలండర్‌కు మారిన సందర్భంలో ప్రజల కొంత అసౌకర్యానికి లోనుకావడం, ఈ మార్పును అర్థం చేసుకోలేదని వారిని ఏప్రిల్ ఫూల్‌గా గేలి చేయడం ఆచారంగా మారి, కాల క్రమంలో అన్ని దేశాలకు విస్తరించడంతో ఏప్రిల్ ఫూల్ డే బహుళ ప్రచారంలోకి వచ్చింది. మరో వివరణ ప్రకారం హిలారీ అనే పురాతన రోమ్ పండుగలో రుతువులు మారుతూ వాతావరణ మార్పులు అసంబద్ధంగా ఉండడంతో ఏప్రిల్ ఫూల్ అంటూ ఒకరినొకరు ఆట పట్టించుకోవడం జరిగేదని కూడా తెలుపబడింది. బైబిల్ ఆచారం ప్రకారం 'నోహ్' అనే పాత్ర తొలి ఏప్రిల్ ఫూల్ అయ్యాడని తెలుపుతున్నది. వ్యాపార సామ్రాజ్యాలు, క్రీడలు, రెస్టారెంట్లు లాంటి అనేక స్థలాల్లో కూడా 01 ఏప్రిల్ రోజున ఆల్ ఫూల్స్ డేను సరదాగా ప్రదర్శించడం జరుగుతూ వస్తున్నది. హానికరం కాని, మరొకరి మనసు నొప్పించని జోక్స్, అవమానకరం కాని అవాస్తవ

సమాచారాలు, ఆట పట్టించే సందర్భాలతో కొనసాగుతున్న ఆల్ ఫూల్స్ డే ప్రపంచ మానవాళిని సంతోష సాగరంలో ముంచేయడంతో పాటు మానసిక సాంత్వన చేకూర్చడం జరుగుతున్నది. నేటి ఏప్రిల్ ఫూల్ డే సరదాగా గడపాలని, మన వల్ల మరొకరి మనసు నొచ్చుకోకూడదని అర్థం చేసుకుంటూ ఆనందంగా ఆల్ ఫూల్స్ డేను జరుపుకుందాం. దైనందిన వేగవంతమైన జీవన విధానం లోంచి కొంత సమయాన్ని కేటాయించి ఏప్రిల్ ఫూల్ అంటూ మానసిక ఒత్తిడిని తగ్గించుకుంటూ ఈ రోజైనా ఉల్లాసంగా గడుపుదాం.

# ఇవాళ్టి నుంచి దేశవ్యాప్తంగా జనగణన... 33 ప్రశ్నలు అడగనున్న అధికారులు

**హైదరాబాద్, మార్చి 31, పెన్ పవర్:**
జనాభా గణన దిశగా కీలక అడుగు పడింది. ఏప్రిల్ 1న ప్రారంభం కానున్న గృహాల జాబితా ప్రక్రియ కోసం కేంద్ర ప్రభుత్వం 33 ప్రశ్నలతో కూడిన ఒక కొత్త ప్రశ్నావళిని విడుదల చేసింది. ఇంటర్నెట్ సదుపాయం, ఎల్‌పిజి, నీరు, పారిశుధ్యం వంటి ప్రాథమిక సౌకర్యాలతో పాటు మారుతున్న సామాజిక స్వరూపాన్ని అర్థం చేసుకోవడంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది.




**ఇంటర్నెట్ సౌకర్యాల లభ్యత..**
2011లో నిర్వహించిన గత జనాభా గణన తర్వాత భారత సమాజంలో వచ్చిన మార్పులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రశ్నావళిని రూపొందించడం జరిగింది. గృహాల రకం, ప్రదేశం, నిర్మాణం గురించిన ప్రశ్నలతో పాటు ఇంటర్నెట్ సౌకర్యాల లభ్యతకు సంబంధించిన ఒక కొత్త ప్రశ్నను కూడా చేర్చడం జరిగింది. అంతేకాకుండా ఎల్‌పిజి, తాగునీరు, ఇతర ప్రాథమిక సౌకర్యాల లభ్యతకు సంబంధించిన సమాచారం కూడా సేకరిస్తారు.

**ఆహార భద్రత, ప్రాంతీయ ఆహారపు అలవాట్లు..**
ఈ ప్రశ్నావళి పారిశుధ్యం, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెడుతుంది. ఇందులో మరుగుదొడ్ల లభ్యత, మురుగునీటి పారుదల వ్యవస్థలు, స్నానపు సౌకర్యాలకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. అదనంగా, కుటుంబాలలో వినియోగించే ప్రధాన ధాన్యాల గురించి కూడా సమాచారం సేకరించబడుతుంది. ఇది ఆహార భద్రత గతిశీలతను, ప్రాంతీయ ఆహారపు అలవాట్లను అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది.

**ఫిబ్రవరి 1, 2027న రెండో దశ ప్రారంభం..**
2027 జనాభా లెక్కలు రెండు దశల్లో నిర్వహిస్తారు. మొదటి దశలో ఇళ్ల జాబితా ప్రక్రియ ఉంటుంది. రెండో దశలో అసలైన జనాభా గణన ఫిబ్రవరి 1, 2027న ప్రారంభమవుతుంది. ఇది భారతదేశానికి మొత్తం మీద 16వ జనాభా లెక్కలు. స్వాతంత్ర్యం తర్వాత ఇది ఎనిమిదవది. ఇది దేశవ్యాప్తంగా విధాన రూపకల్పన, అభివృద్ధి ప్రణాళికకు అవసరమైన కీలకమైన సమాచారాన్ని అందిస్తుంది.

2027 జనాభా లెక్కలలో అడిగే 33 ప్రశ్నలు ఇవే..
భవన సంఖ్య (పురపాలక లేదా స్థానిక అధికార సంస్థ లేదా జనాభా లెక్కల సంఖ్య)
ఇంటి సంఖ్య
ఇంటి నేల కోసం ప్రధానంగా ఉపయోగించిన పదార్థం
ఇంటి గోడల కోసం ప్రధానంగా ఉపయోగించిన పదార్థం
ఇంటి పైకప్పు కోసం ప్రధానంగా ఉపయోగించిన పదార్థం
ఇంటి ఉపయోగం
ఇంటి పరిస్థితి
కుటుంబ సంఖ్య
కుటుంబ సభ్యుల సంఖ్య
కుటుంబ పెద్ద పేరు
కుటుంబ పెద్ద లింగం
షెడ్యూల్డ్ కులం / షెడ్యూల్డ్ తెగ / ఇతర
ఇంటి యాజమాన్య స్థితి
ఇంటిలోని గదుల సంఖ్య
కుటుంబంలోని వివాహిత జంటల సంఖ్య
తాగునీటి ప్రధాన వనరు
తాగునీటి వనరు లభ్యత
ప్రధాన లైటింగ్ వనరు
టాయిలెట్ సౌకర్యం లభ్యత
టాయిలెట్ రకం
మురుగునీటి పారుదల సౌకర్యం
స్నానపు సౌకర్యం లభ్యత
వంటగది, ఎల్‌పిజి / పిఎన్‌జి కనెక్షన్
వంటకు ఉపయోగించే ప్రధాన ఇంధనం
రేడియో / ట్రాన్సిస్టర్
టెలివిజన్
ఇంటర్నెట్ సౌకర్యం
ల్యాప్‌టాప్ / కంప్యూటర్
టెలిఫోన్ / మొబైల్ ఫోన్ / స్మార్ట్‌ఫోన్
సైకిల్ / స్కూటర్ / మోటార్‌సైకిల్ / మోపెడ్
కారు / జీప్ / వ్యాన్
ప్రధానంగా తినే ధాన్యం
మొబైల్ నంబర్

2011లో నిర్వహించిన గత జనాభా గణన తర్వాత సమాజంలో సంభవించిన మార్పులను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రశ్నావళిని రూపొందించారు.

# లివ్ ఇన్ రిలేషన్ షిప్ లో ఉంటే కుటుంబ హోదా...

**హైదరాబాద్, మార్చి31, పెన్ పవర్:** లివ్ ఇన్ రిలేషన్ షిప్‌లో ఉండే వారి పట్ల కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం సెన్సస్ నిబంధనల్లో కీలక మార్పులు చేసింది. దేశవ్యాప్తంగా జనగణన -- 2027 ప్రక్రియ ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభవుతుంది. అయితే, ఈ జనగణనలో సహజీవన జంటలకు సైతం కుటంబ హోదా ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది. చాలాకాలంగా కలిసి ఉంటున్న వారిని ఇకపై ఒకే కుటుంబంగా గుర్తించాలని నిర్ణయం తీసుకున్నట్లు తాజాగా కేంద్రం వెల్లడించింది.మన దేశంలో సాధారణంగా పదేళ్లకోసారి జనగణన నిర్వహిస్తారు. ఆఖరిగా 2011లో జనాభా లెక్కలు సేకరించారు. కొవిడ్ కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనగణనకు ఆటంకం ఏర్పడింది. ప్రస్తుతం జనాభా గణన ప్రక్రియ ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమవుతుంది. రెండు దశల్లో నిర్వహిస్తారు. మొదటి దశలో భాగంగా గృహ గణన చేపట్టనున్నారు. మొబైల్ యాప్ ద్వారా అధికారులు ఇంటింటికీ వెళ్లి ఇళ్ల వివరాలు సేకరించనున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలలో రెండో దశలో జనాభా లెక్కల సేకరణ ఉంటుంది. జనగణన కోసం 33 ప్రశ్నలతో ఓ ప్రశ్నావళిని రూపొందించారు. రెండో దశలో లడఖ్ కేంద్ర పాలిత, జమ్మూకాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతాల్లోని మంచుతో కప్పబడిన ప్రాంతాలు, అలాగే హించల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు మినహా భారతదేశం వ్యార్తంగా జనాభా గణన ప్రారంభమవుతుంది. ఈ రెండు రాష్ట్రాల్లో ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో నిర్వహిస్తారురెండవ దశలో కుటుంబంలో వ్యక్తుల సంఖ్య, వారి పేర్లు, వయస్సు, లింగం, వైవాహిక స్థితి, కులం, మతం, విద్య, భాష, వైకల్యం, వలస, వృత్తి, సంతానోత్పత్తి (వివాహిత మహిళల విషయంలో) వివరాలు సేకరిస్తారు. అదేవిధంగా ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు, గృహోపకరణాలు వంటి వివరాలను అడుగుతారు. తృణ ధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, మరుగుదొడ్లు వాడకం, వంటగది సౌకర్యాలు, పంటకు వినియోగించే ఇంధనం వివరాలు సేకరిస్తారు.

# కమలంలో కాసుల లొల్లి

**హైదరాబాద్ మార్చి 31, పెన్ పవర్:**
రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల కోసం అధిష్టానం పంపిన నిధులు దుర్వినియోగమైనట్లు బీజేపీ నాయకత్వం ఒక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. పార్టీ పంపిన ఫండ్స్ పూర్తిస్థాయిలో అభ్యర్థులకు చేరలేదని, మధ్యలో ఆయా జిల్లాల బాధ్యులు సగానికి పైగా 'స్వాహా' చేశారని గుర్తించినట్లు సమాచారం. పలు రకాల సమీక్షల అనంతరం అగ్రనేతలు ఈ అంచనాకు వచ్చినట్లు చర్చ జరుగుతున్నది. ముందుగా చెప్పిన ఓట్లు, సీట్లకు, ఫలితాలకు ఏ మాత్రం పొంతన కుదరకపోవడంతో.. అభ్యర్థుల ఓటమికి వీరే కారణమని భావిస్తున్నట్టు టాక్. ఈ నేపథ్యంలో ఫండ్స్ స్వాహా చేసిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పార్టీ పదవుల నుంచి తొలగించాలని నిర్ణయానికి వచ్చినట్లు చర్చ జరుగుతున్నది.లోక్ సభ ఎన్నికల్లో 36 శాతం ఓట్లతో బీజేపీ ఎనిమిది స్థానాలను గెలుపొందింది. అంతేకాకుండా పార్టీకి ఎమ్మెల్యేలతోపాటు ఎమ్మెల్సీలు సైతం ఉన్నారు. పట్టణాల ప్రాంతాల్లో బీజేపీకి పట్టు ఉన్నదని సర్వేల ద్వారా గుర్తించగా.. మున్సిపల్ ఎన్నికలపై ఆ పార్టీ భారీ ఆశలు పెట్టుకున్నది. గతంలో కంటే స్థానాలు పెరుగుతాయని, కొన్ని మేయర్, చైర్మన్లయినా కైవసం చేసుకుంటామని భావించింది. మహారాష్ట్ర మంత్రి ఆశీష్ షెలార్ కు కీలక బాధ్యతలు అప్పగించింది. అనంతరం ఎన్నికల కోసం భారీగా నిధులు సమకూర్చినట్లు తెలిసింది. అయితే ఫలితాలను చూసి నాయకులు తీవ్ర నిరాశకు గురైనట్లు సమాచారం. దీంతో మున్సిపాలిటీలు, జిల్లాల వారీగా ఫలితాలపై పార్టీ సమీక్షించింది. కనీస స్థాయిలో కౌన్సిలర్లు, కార్పొరేటర్ స్థానాల్లో విజయం సాధించకపోవడం, చైర్మన్, మేయర్ స్థానాలను సైతం కైవసం చేసుకోవడంలో విఫలం కావడం పట్ల రాష్ట్ర నాయకత్వంపై అధిష్ఠానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లుగా పార్టీ నాయకుల ద్వారా తెలిసింది.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వార్డులు, డివిజన్లను బీజేపీ ఏ, బీ, సీ, డీ గా విభజించింది. విజయావకాశాలు ఏ మాత్రం లేని వాటిని డీ కేటగిరిలో చేర్చింది. ఆ తర్వాత ఏ, బీ, సీ కేటగిరీల వార్డులకు కొంత మొత్తాన్ని నిర్ణయించి పార్టీ జిల్లా అధ్యక్షులకు నిధులు పంపించినట్లు నేతల ద్వారా తెలిసింది. అయితే ఆ నిధుల్లో వారు అత్యధిక శాతం నొక్కేసినట్లు చర్చ జరుగుతున్నది. అంతేకాకుండా ఏ కేటగిరి డివిజన్లకు బీ, సీ కేటగిరిలకు నిర్ణయించిన మొత్తాన్ని అభ్యర్థులకు ఇచ్చినట్లు పార్టీ నాయకత్వం గుర్తించినట్లు తెలిసింది. ఇలా పది మంది జిల్లా అధ్యక్షులు పెద్ద ఎత్తున నిధులు స్వాహా చేసినట్లు అంచనాకు వచ్చిన రాష్ట్ర నాయకత్వం.. వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.ఉత్తర తెలంగాణలోని ఒక జిల్లాకు చెందిన మహిళా నాయకురాలిపై అక్కడి బీజేపీ నాయకులు రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేసినట్లుగా పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. పార్టీ పంపించిన నిధులను అభ్యర్థులకు ఇవ్వకుండా స్వాహా చేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే ఆమెకు అక్కడి ముఖ్య ప్రజాప్రతినిధి మద్దతు ఉన్నట్లు తెలిసింది. ఉత్తర తెలంగాణలో ఉద్యమాల జిల్లాగా గుర్తింపు ఉన్న మరో జిల్లాలో రెండంకెల ఓట్లు రాని వార్డులను సైతం ఏ గ్రేడ్ గా చూపించి నిధులను మెక్కేసినట్లు పార్టీ గుర్తించింది. అక్కడ పార్టీకి అంత పట్టులేదని ఆ తర్వాత జరిగిన సమీక్షలో పార్టీ ముఖ్యనేత చెప్పినట్లు సమాచారం. దీంతో సంబంధిత బాధ్యుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కీలక నేతలు.. మొత్తం డబ్బులు కక్కాల్సిందేనని చెప్పినట్లు తెలిసింది. దీంతోపాటు మరికొన్ని జిల్లాల్లోనూ ఇదే తరహాలో నిధులు స్వాహా చేశారని పార్టీ నాయకత్వం గుర్తించినట్లు సమాచారం.గతంలో బీజేపీలో ఉన్న క్రమశిక్షణ, నిబద్ధత ఇప్పుడు కరువయ్యాయని పాత కేడర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నది. అయితే డబ్బులు ఇచ్చి పదవులు తెచ్చుకున్నామని అంతర్గతంగా తమ అనుచరులకు చెబుతున్న నేతలు.. వచ్చే ఎన్నికల వరకు తమకు ఖర్చులకు డబ్బులు కావాలి కదా అనే రీతిలో మాట్లాడుతున్నట్లు చర్చ జరుగుతున్నది. అయితే నిధుల స్వాహాలో ముఖ్యంగా పది జిల్లాల బాధ్యులను గుర్తించగా.. వారిని తొలగించడం ఎంత వరకు సాధ్యమనే కోణంలో రాష్ట్ర నాయకత్వం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. దాని కంటే ముందు వారికి నోటీసులు ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఇలాగే నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించగా.. మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇది రిపీట్ కావడంతో.. గట్టి చర్యలు తీసుకుంటేనే ఇలాంటివి పునరావృతం కావని అధిష్ఠానం ఒక నిర్ణయానికి వచ్చినట్లు చర్చ జరుగుతున్నది.

## కారును డికోట్టిన లారీ

**అశ్వారావుపేట, మార్చి 31 పెన్ పవర్:** మంగళవారం పినపాక మండలంలోని గొట్టల్ల సమీపంలో కారును లారీ ఢీకొన్న ఘటనలో కారు ముందు భాగం ధ్వంసమైంది. మణుగూరు నుంచి ఎటూరునాగారం వైపు వెళ్తున్న లారీ, ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

## తొలగని గ్యాస్ కష్టాలు... ఏజెన్సీ వద్ద పడిగాపులు

**ఇల్లందు, మార్చి 31 పెన్ పవర్:** గ్యాస్ సిలిండర్ల సరఫరాలో కంపెనీల వైఫల్యం కారణంగా వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూసుమంచి సమీపంలోని ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఉదయం నుంచే వినియోగదారులు సిలిండర్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఏజెన్సీ నిర్వాహకులు సమయానికి గేట్లు తెరవకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేశారు. సకాలంలో గ్యాస్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వినియోగదారులు వాపోయారు.

## కలెక్టరేట్ ముందు రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా

**మహబూబాబాద్, మార్చి 31 పెన్ పవర్:** మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయం ముందు మంగళవారం రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు తమ పెన్షన్ డబ్బులు వెంటనే చెల్లించాలని నల్ల బ్యాడ్జిలు ధరించి ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం నుండి రావాల్సిన పెన్షన్ మొత్తాలను తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

## కరెంట్ షాక్ తో యువకుడు మృతి:
## విద్యుత్ భవన్ ముందు కుటుంబ సభ్యుల ఆందోళన



**వరంగల్ వెస్ట్, మార్చి 31 పెన్ పవర్:** గ్రేటర్ వరంగల్ ఎన్పీడీసీఎల్ పరిధిలోని హనుమకొండ యాదవ నగర్ యూనిట్లో క్యాజువల్ కట్టర్ గా పనిచేస్తున్న గాదె పున్నంచందర్, హనుమకొండ గుండ్లసింగారం బీసీ కాలనీ వద్ద మరమ్మతుల పేరుతో విద్యుత్ సరఫరా అవుతున్న పోల్ ఎక్కడంతో కరెంట్ షాక్ తో మృతి చెందాడు. విద్యుత్ భవన్ ముందు పున్నం మృతదేహంతో కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. అధికారులు మరమ్మతుల పేరుతో విద్యుత్ సరఫరా అవుతున్న పోల్ ఎక్కించి, కరెంట్ షాక్ వల్ల కిందపడి తలకు తీవ్ర గాయాలైన యువకుడిని ఆసుపత్రిలో చేర్పించి చేతులు దులుపుకున్నారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. న్యాయం చేయాలని వారు ధర్నా చేస్తున్నారు.

## జనగామ మున్సిపల్ కార్యాలయంలో బడ్జెట్ సమావేశం రసబస

**జనగామ, మార్చి 31 పెన్ పవర్:** జనగామ జిల్లా మున్సిపాలిటీలో మంగళవారం జరిగిన బడ్జెట్ సమావేశంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పర్వతాలును వేదికపైకి పిలవాలని డిమాండ్ చేశారు. అయితే, మున్సిపల్ మిషనర్, చైర్ పర్సన్ నిరాకరించడంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. గత ప్రభుత్వంలో కొనసాగిన ఆనవాయితీని పాటించాలని వారు కోరారు.

## ఏడునూతుల గ్రామంలో సెల్ ఫోన్ సిగ్నల్స్ లేక ప్రజల ఇక్కట్లు

**పాలకుర్తి, మార్చి 31 పెన్ పవర్:** జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామంలో గత వారం రోజులుగా సెల్ ఫోన్ సిగ్నల్స్ పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు ఇంటర్నెట్ సేవలు అందక ఆందోళన చెందుతున్నారు. మార్చి 25న వావిలాల గ్రామంలో జరిగిన దుర్గామాత ఉత్సవాల సమయంలో అధిక సంఖ్యలో మొబైల్ వినియోగం వల్ల సిగ్నలింగ్ వ్యవస్థలో సాంకేతిక సమస్య ఏర్పడి ఉండవచ్చని, రెండు రోజుల్లో పరిష్కారం అవుతుందని టెలికాం ప్రతినిధి తెలిపారు. గ్రామస్థులు వెంటనే సమస్య పరిష్కారం చేయాలని కోరుతున్నారు.

## నర్సంపేట మున్సిపల్ బడ్జెట్ సమావేశం ప్రారంభం




**నర్సంపేట, మార్చి 31 పెన్ పవర్:** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట మున్సిపల్ కార్యాలయంలో 2026–2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొదటి సాధారణ బడ్జెట్ సమావేశం మంగళవారం ప్రారంభమైంది. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీలక్ష్మీరామానంద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ వైవి గణేష్, మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్, వైస్ చైర్మన్ గంధం నరేందర్, పాలకవర్గం, అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశం నర్సంపేట మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించడానికి ఉద్దేశించబడింది.

## రోడ్డు ప్రమాదం..
## క్షతగాత్రులకు ఎస్పీ చేయూత



**సంగారెడ్డి, మార్చి 31 పెన్ పవర్:** గంగాపూర్ చెరువు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మానవత్వం చాటుకున్నారు. డీసీఎం, ఆటో ఢీకొన్న ఘటనను గమనించిన ఆయన వెంటనే వాహనం ఆపి సహాయక చర్యలు చేపట్టారు. క్యూఆర్టీ సిబ్బందితో కలిసి ఆటోలో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీయించారు. కాలు విరిగిన ఓ మహిళను కానిస్టేబుల్ యాదగిరి స్వయంగా ఎత్తుకుని అంబులెన్సులో చేర్చారు. ఎస్పీ, సిబ్బంది సమయస్ఫూర్తిని స్థానికులు అభినందించారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



**చెన్నూరు, మార్చి 31 పెన్ పవర్:** రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. జైపూర్ మండలంలో మాట్లాడుతూ, ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి పోలీస్ శాఖ ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సులు, కంటి వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఆయన వివరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి సారించాలని సూచించారు.

## ఓసీపీలో విద్యుత్ కేబుల్ చోరీ

**బెల్లంపల్లి, మార్చి 31 పెన్ పవర్:** శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో సుమారు 40 మీటర్ల కాపర్ విద్యుత్ కేబుల్ చోరీకి గురైంది. విద్యుత్ సరఫరా ఉండగానే పదునైన ఆయుధాలతో కేబుల్‌ను కట్ చేసి దొంగలు తీసుకెళ్లారు. కరెంటు పోవడంతో అనుమానం వచ్చిన అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది గనిని పరిశీలించగా, దొంగలు అప్పటికే పరారయ్యారు. ఓబి బెంచ్‌ల పై నుంచి వచ్చి దొంగతనం చేసి, అటు నుంచి తిరిగి పరారైనట్లు ఆనవాళ్లున్నాయని ఓసిపి అధికారులు తెలిపారు. ఈ చోరీ విలువ సుమారు మూడు లక్షల రూపాయల వరకు ఉంటుందని అంచనా వేయబడింది.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

**మంచిర్యాల, మార్చి 31 పెన్ పవర్:** లక్షెటిపేట మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నెన్నెల మండలానికి చెందిన అల్లంపల్లి సంతోష్ గాయపడ్డారు. హనుమాన్ దీక్ష విరమణ కోసం కొండగట్టుకు కాలినడకన వెళ్తుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు సంతోష్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పెళ్లి కావడం లేదని యువకుడి బలవన్మరణం !

**ఆసిఫాబాద్, మార్చి 31 పెన్ పవర్:** కాగజ్‌నగర్ పట్టణంలో పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో సురేష్ (37) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు. సురేష్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. పెళ్లి సంబంధాలు చూస్తున్నా నిశ్చయం కాకపోవడంతో మానసికంగా బాధపడేవాడని, ఆదివారం రాత్రి తండ్రితో కలిసి భోజనం చేసి నిద్రించిన తర్వాత ఉదయం ఇంట్లో ఉరేసుకుని కనిపించాడని ఎస్సై వివరించారు.

## వెంకట్రావుపేట్ న్యూ కాలనీలో మట్టి రోడ్డు దుస్థితి, గ్రామస్తుల ఆవేదన

**సిర్పూర్, మార్చి 31 పెన్ పవర్:** కొమరంభీం జిల్లా సిర్పూర్(టి) మండలం వెంకట్రావుపేట్ న్యూ కాలనీలో మట్టి రోడ్డు వర్షానికి బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తోంది. వృద్ధులు, పిల్లలు, అత్యవసర సేవలకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని, వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## అకాల వర్షానికి నేల వాలిన మొక్కజొన్న

**జగిత్యాల, మార్చి 31 పెన్ పవర్:** జిల్లాలో అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షం కారణంగా గణనీయమైన నష్టం జరిగింది. జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లోని అనేక గ్రామాలలో మొక్కజొన్న పంట నేలకొరిగిపోగా, మామిడి కాయలు రాలిపోయాయి. జిల్లాలోని ఇతర మండలాల్లో కూడా అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. అధికారులు నష్టాన్ని అంచనా వేసే పనిలో నిమగ్నమై ఉన్నారు.

## కన్నీటి వీడ్కోలుకు కదిలిన గుండెలు

**ధర్మపురి, మార్చి 31 పెన్ పవర్:** జగిత్యాల జిల్లా రాయికల్ గ్రామానికి చెందిన నిరుపేద శేఖర్ రాజు రోడ్డు ప్రమాదంలో గాయపడి, ఓఉఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. చేతిలో డబ్బులు లేక, సొంత ఊరు కాని చోట మృతదేహానికి అంత్యక్రియలు చేయలేక అతని తల్లి కన్నీరుమున్నీరైంది. ఇది చూసి చలించిన వైద్యనాథ్, రమణా రెడ్డి, ప్రదీప్ తదితరులు రూ.10 వేల ఆర్థిక సాయం చేసి, కొత్తవాడ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు.

### ధర్మారం గ్రామంలో ఈదురు గాలుల బీభత్సం:

## రహదారిపై కూలిన వృక్షాలు

**కోరుట్ల, మార్చి 31 పెన్ పవర్:** జగిత్యాల రూరల్ మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున ఈదురు గాలుల బీభత్సం సృష్టించాయి. భారీ వృక్షాలు రోడ్డుపై కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. గ్రామ సర్పంచ్ పరమల సుమలత మల్లేష్ సంఘటనా స్థలానికి చేరుకుని, సిబ్బందితో కలిసి రోడ్డుపై పడి ఉన్న చెట్లను తొలగించి, రాకపోకలకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టారు. సర్పంచ్ సత్వర స్పందనపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సమన్వయంతో అండర్ గ్రౌండ్ కేబుల్ పనులు:

**రామగుండం, మార్చి 31 పెన్ పవర్:** జిల్లాలో బిఎస్ఎన్ఎల్ అండర్ గ్రౌండ్ కేబుల్ పనులను వివిధ శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మంగళవారం పెద్దపల్లి సమీకృత కలెక్టరేట్ లో అధికారులతో జరిగిన సమీక్షలో, రామగుండం పరిధిలో డ్యామేజైన కేబుల్ ను పునరుద్ధరించడం జరుగుతుందని, ఆర్అండ్‌బీ, మిషన్ భగీరథ, ఎన్ పిడిసిఎల్, లోకల్ బాడీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

### చికిత్స పొందుతూ మృతి

**పినపాక, మార్చి 31 పెన్ పవర్:** మణుగూరులో కుటుంబ తగాదాల నేపథ్యంలో భర్త పురుగుల మందు తాగి, కుమారుడికి తాగించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. చికిత్స పొందుతున్న తండ్రి నాగేశ్వరరావు మృతి చెందగా, కుమారుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 4వ తరగతి ప్రవేశాల కోసం ఎంపికలు

**కొత్తగూడెం, మార్చి 31 పెన్ పవర్:** కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో మంగళవారం జిల్లా స్థాయి క్రీడా పాఠశాల 4వ తరగతి ప్రవేశాల కోసం ఎంపిక పోటీలు మొదలయ్యాయి. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పీడీ పరంధామరెడ్డి తెలిపారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాల ప్రవేశాలకు ఎంపిక చేస్తారు.

## కన్న తల్లి పై కలెక్టర్ కు ఫిర్యాదు



**పెద్దపల్లి, మార్చి 31 పెన్ పవర్:** జగిత్యాల జిల్లా ఆరపేటలో అన్నాచెల్లెళ్లు తమ కన్నతల్లైన వందనపై కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. తండ్రి మరణానంతరం ఆయన సంపాదించిన భూమి మొత్తాన్ని తల్లి దొంగ విరాసత్ చేయించుకుందని, తాము మైనర్లు కావడంతో తమకు తెలియకుండానే కోటి నాలుగు లక్షల రూపాయలకు అమ్మేసిందని ఆరోపించారు. తమకు న్యాయమైన వారసత్వ వాటా ఇప్పించాలని కోరారు. భూమి అమ్మకానికి సంబంధించిన కోటి రూపాయల లావాదేవీ నగదు రూపంలో జరిగిందని, అది బ్లాక్ మనీ అని, ఈ విషయంలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు విన్నవించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ. వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# సర్వేంద్రియానాం నయనం ప్రధానం

**హైదరాబాద్ పెన్ పవర్:** పంచేంద్రియాల్లోకి నేత్రాలు ప్రధానమైనవి మనకు తెలుసు. చూపు మందగిస్తే బతుకు చీకటిమయం అవుతుంది. చూపు కలిగిన వారికి దృష్టి ప్రాధాన్యం పెద్దగా అర్థం కాదు. ప్రపంచవ్యాప్తంగా 2.2 బిలియన్ల ప్రజలు దృష్టి సమస్యలతో బాధపడుతున్నారు. వీరిలో 10 మిలియన్లకు పైగా భారతీయులు కూడా ఉండడం విచారకరం. రాజస్థాన్, ఎంపీ రాష్ట్రాల్లో అంధత్వ సమస్య ఎక్కువగా ఉన్నది. అంధత్వ నివారణకు తగు జాగ్రత్తలు పాటించడంతో పాటు నేత్ర సంబంధ వ్యాధుల పట్ల అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 01 - 07 ఏప్రిల్ వరకు దేశవ్యాప్తంగా "అంధత్వ నివారణ వారోత్సవాలు (ప్రివెన్షన్ ఆఫ్ బ్లైండ్‌నెస్ వీక్)" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. అంధత్వ నివారణ, అంధ పాఠశాలల నిర్వహణ, హక్కుల పరిరక్షణ, నేత్రదాన ఉద్యమాలు, అంధులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కల్పన లాంటి చర్యలు తీసుకోవడం నేటి ప్రభుత్వాల, పౌర సమాజ కనీస బాధ్యత అని తెలపడానికి ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. నేత్ర ఆరోగ్య ప్రాధాన్యతను గుర్తించిన పౌర సమాజం ప్రతి ఏట 08 అక్టోబర్ రోజున "ప్రపంచ దృష్టి దినం", మార్చి 07 నుంచి 13 వరకు "ప్రపంచ గ్లకోమా వారం", అక్టోబర్ నెలను "అంధత్వ అవగాహన మాసం"గా పాటించడం జరుగుతున్నది. అంధత్వం మూడు రకాలుగా కనిపిస్తుంది. వీటిలో ట్రకోమా, కాటరాక్ట్, విటమిన్-ఏ లోపం కారణాలతో అంధత్వ సమస్య ఉత్పన్నం అవుతున్నది. డబ్ల్యూహెచ్ఓ చేపట్టిన "రైట్ టు సైట్ (దృష్టి హక్కు)" నినాదంతో అంధత్వ నివారణ చర్యలు కొనసాగుతున్నాయి. విటమిన్-ఏ లోపం కారణంగా వచ్చే అంధత్వం నివారించదగినదని ప్రభుత్వాలు, ప్రజలు గుర్తించాలి. నేత్ర ఆరోగ్య పరిరక్షణ, నేత్ర రుగ్మతల చికిత్స, దృష్టి దోషం ఉన్న మేధావుల విజయగాథలు, నేత్ర ఈరోగ్య పరిరక్షణ పరిశోధనలు, స్వచ్ఛంద సంస్థల సహకారం లాంటి అంశాల్లో శ్రద్ధ వహించడం వల్ల సత్ఫలితాలు కనిపిస్తాయని తెలుసుకోవాలి. గ్లకోమా, కంటి శుక్లాలు, కండ్ల కలకలకు వైద్యం సకాలంలో అందితే అంధత్వం రాకుండా కాపాడుకోవచ్చు. కంప్యూటర్, ల్యాబ్‌టాప్, స్మార్ట్‌ఫోన్, ట్యాబ్ లాంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలను గంటల తరబడి వాడడంతో నేత్ర సమస్యలు ఉత్పన్నమవుతాయి. అంధత్వ సమస్యలు 80 శాతం వరకు నివారించదగినవే. వయస్సు 50 ఏండ్లు దాటిన వారికి నేత్ర సమస్యలు అధికంగా కనిపిస్తాయి. నేత్ర గాయాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం, కంటి గాయాలకు సత్వరమే చికిత్స తీసుకోవడం, తరుచుగా నేత్ర పరీక్షలు చేయించుకోవడం, విటమిన్ ఏ కలిగిన పోషకాహారం తీసుకోవడం, కాటరాక్ట్ చికిత్సలు చేయించుకోవడం, నేత్రాలను కళ్ల అద్దాలతో పరిరక్షించుకోవడం, నేత్ర శుభ్రతను పాటించడం, ముందస్తు లాంటి చర్యలు, పొగాకు వంటి దురలవాట్లకు దూరంగా ఉండడం లాంటి చర్యలు అంధత్వాలను నివారిస్తాయి. విధిగా మరణానంతరం నేత్ర దానం చేయడం తప్పనిసరి అని తెలుసుకోవాలి. మనం మరణించిన తర్వాత కూడా నేత్ర దానంతో మరో జన్మకు అర్థాన్ని, దృష్టిని ఇవ్వవచ్చు. సర్వేంద్రియానాం నయనం ప్రధానం. కంటి చూపు లేని జీవితం చీకటిమయం. చూపును పరిరక్షించుకోవడం మన చేతుల్లోనే ఉన్నది. తగు జాగ్రత్తలు పాటిస్తే జీవితం రంగుల హరివిల్లు అవుతుంది.

# ఆర్‌బిఐ అప్రతిహత జైత్రయాత్ర

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశ ఆర్థిక చరిత్రను నిశితంగా పరిశీలిస్తే, ఒక దేశం యొక్క సార్వభౌమాధికారం కేవలం దాని రాజకీయ సరిహద్దుల్లోనే కాకుండా, ఆ దేశ కరెన్సీ స్థిరత్వం మరియు ఆర్థిక క్రమశిక్షణలోనూ దాగి ఉంటుందని స్పష్టమవుతుంది. ఈ దిశగా భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా, దిక్సూచిగా నిలిచిన అత్యున్నత సంస్థ 'భారతీయ రిజర్వు బ్యాంకు' (ఆర్బీఐ). ఒక చారిత్రక అనివార్యతగా ప్రారంభమై, నేడు ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన కేంద్రీయ బ్యాంకులలో ఒకటిగా ఎదిగిన ఆర్బీఐ ప్రస్థానం అనన్య సామాన్యం. మొదటి ప్రపంచ యుద్ధం (1914- 1918) సృష్టించిన ఆర్థిక విధ్వంసం ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల ఆర్థిక పునాదులను కదిలించి వేసింది. యుద్ధం కారణంగా ఏర్పడిన సరఫరా గొలుసు అంతరాయాలు, విపరీతమైన రక్షణ వ్యయం, మరియు కరెన్సీ విలువలలో సంభవించిన అస్థిరత అప్పట్లో బ్రిటిష్ వలస పాలనలో ఉన్న భారతదేశంపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. యుద్ధ కాలంలో బ్రిటన్ తన అవసరాల కోసం విపరీతంగా కరెన్సీని ముద్రించడంతో ద్రవ్యోల్బణం ఆకాశాన్ని తాకింది. 1920వ దశకంలో భారతీయ రూపాయి విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో, ముఖ్యంగా పౌండ్ స్టెర్లింగ్‌తో పోల్చినప్పుడు తీవ్రమైన ఒడిదుడుకులకు లోనైంది. రూపాయి విలువ ఒక పౌండ్ స్టెర్లింగ్‌కు 15 రూపాయల వరకు పెరగడం, మళ్ళీ అతి తక్కువ కాలంలోనే 13 రూపాయలకు పడిపోవడం వంటి పరిణామాలు భారతీయ వ్యాపారవేత్తలను, సామాన్య రైతాంగాన్ని కోలుకోలేని దెబ్బ తీశాయి. కరెన్సీ మరియు పరపతి నియంత్రణను కేవలం ప్రభుత్వ విభాగంగా కాకుండా ఒక స్వతంత్ర కేంద్రీయ సంస్థ ద్వారా నిర్వహించాల్సిన అవసరం ఆ కాలంలోనే బలంగా వినిపించింది. ఈ నేపథ్యంలో, భారత కరెన్సీ మరియు ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు సూచించేందుకు 1926లో బ్రిటిష్ ప్రభుత్వం 'రాయల్ కమిషన్ ఆన్ ఇండియన్ కరెన్సీ అండ్ ఫైనాన్స్'ను నియమించింది. దీనినే మనం 'హిల్టన్ యంగ్ కమిషన్' అని పిలుస్తాము. అయితే, ఈ బ్యాంకు ఏర్పాటు వెనుక ఉన్న మేధోపరమైన పునాదిని ప్రస్తావించకుండా ఆర్బీఐ చరిత్ర అసంపూర్ణ మవుతుంది. ఆధునిక భారతదేశ నిర్మాతలలో ఒకరైన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాసిన "ది ప్రాబ్లం ఆఫ్ ది రూపాయి - ఇట్స్ ఆరిజిన్ అండ్ ఇట్స్ సొల్యూషన్" అనే పరిశోధనా గ్రంథం ఈ కమిషన్ ముందు ఒక దిక్సూచిలా నిలిచింది. అంబేద్కర్ గారు కరెన్సీ స్థిరత్వంపై అందించిన లోతైన విశ్లేషణలు, ఒక కేంద్రీయ బ్యాంకుకు ఉండాల్సిన స్వయం ప్రతిపత్తిపై ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు హిల్టన్ యంగ్ కమిషన్ సభ్యులను ఎంతగానో ప్రభావితం చేశాయి. ఫలితంగా, భారతదేశానికి ఒక స్వతంత్ర కేంద్రీయ బ్యాంకు ఉండాలనే బలమైన సిఫారసు వెలువడింది. ఈ సిఫారసుల ఆధారంగానే 'భారతీయ రిజర్వు బ్యాంకు చట్టం, 1934' ఆమోదించ బడింది. ఆ చట్టం ప్రకారం 1935 ఏప్రిల్ 1న ఆర్బీఐ తన కార్యకలాపాలను అధికారికంగా ప్రారంభించింది. ఆరంభంలో ఇది ఒక ప్రైవేట్ షేర్ హోల్డర్ల సంస్థగా, 5 కోట్ల రూపాయల ప్రాథమిక మూలధనంతో ఏర్పాటైంది. ఆ రోజుల్లో ఇది ఒక అసాధారణ పెట్టుబడిగా పరిగణించ బడేది. మొదట కోల్‌కతాలో ఉన్న దీని ప్రధాన కార్యాలయాన్ని, దేశ వాణిజ్య కార్యకలాపాల కేంద్ర బిందువుగా ఎదుగుతున్న ముంబైకి 1937లో మార్చడం జరిగింది. భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత, దేశాభివృద్ధిలో కేంద్రీయ బ్యాంకు పాత్ర మరింత కీలకమని ప్రభుత్వం గుర్తించింది. ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉన్న ఆర్థిక అధికారం ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగపడాలనే ఉద్దేశంతో 1949 జనవరి 1న ఆర్బీఐని జాతీయాకరించారు. దీంతో ఇది పూర్తిగా భారత ప్రభుత్వ పర్యవేక్షణలోకి రావడమే కాకుండా, దేశ సామాజిక-ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసే ఒక ప్రజాస్వామ్య సంస్థగా రూపాంతరం చెందింది. ఆర్బీఐ యొక్క ప్రాథమిక మరియు అత్యంత ముఖ్యమైన విధి 'కరెన్సీ జారీ'. ఒక రూపాయి నోటు మరియు చిల్లర నాణేలు మినహా, భారతదేశంలో చలామణిలో ఉన్న ప్రతి కరెన్సీ నోటు వెనుక ఆర్బీఐ గవర్నర్ సంతకం చేసిన 'భరోసా' ఉంటుంది. 1950వ దశకంలో కేవలం 1,200 కోట్లుగా ఉన్న కరెన్సీ చలామణి, నేడు 35 లక్షల కోట్లకు పైగా పెరగడం అనేది కేవలం అంకెల్లో పెరుగుదల మాత్రమే కాదు, అది భారత ఆర్థిక వ్యవస్థ విస్తరణకు, పారిశ్రామిక వృద్ధికి మరియు ప్రజల కొనుగోలు శక్తికి అద్దం పడుతోంది. అయితే, కేవలం డబ్బును ముద్రించడం మాత్రమే కాకుండా, మార్కెట్‌లో డబ్బు సరఫరాను నియంత్రించడం ద్వారా ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడం ఆర్బీఐ యొక్క అసలైన నైపుణ్యం. దీనినే మనం 'ద్రవ్య విధానం' అంటాము. రెపో రేటు (బ్యాంకులకు ఆర్బీఐ ఇచ్చే అప్పుపై వడ్డీ), రివర్స్ రెపో రేటు, నగదు నిల్వల నిష్పత్తి వంటి సంక్లిష్టమైన సాధనాల ద్వారా మార్కెట్‌లో నగదు లభ్యతను ఆర్బీఐ సర్దుబాటు చేస్తుంది. ఉదాహరణకు, కరోనా మహమ్మారి సమయంలో ఆర్థిక వ్యవస్థ స్తంభించకుండా ఉండేందుకు రెపో రేటును 4 శాతానికి తగ్గించి, మార్కెట్లోకి నిధులు ప్రవహించేలా చేయడం ద్వారా సామాన్యులకు తక్కువ వడ్డీకే రుణాలు అందేలా చేసిన ఘనత ఆర్బీఐదే. కేంద్రీయ బ్యాంకుగా ఆర్బీఐ పోషిస్తున్న మరో కీలక పాత్ర 'బ్యాంకర్లకు బ్యాంకర్'గా వ్యవహరించడం. దేశంలోని వాణిజ్య బ్యాంకులన్నీ తమ నిధులలో కొంత భాగాన్ని భద్రత కోసం ఆర్బీఐ వద్ద ఉంచాలి. ఇది బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకాన్ని కలిగిస్తుంది. అలాగే, ప్రభుత్వానికి కూడా ఇది ఆర్థిక సలహాదారుగా పనిచేస్తుంది. ప్రభుత్వం తరపున బాండ్లు జారీ చేయడం, రుణాలు సేకరించడం వంటి బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తోంది. భారత ఆర్థిక చరిత్రలో 1991వ సంవత్సరం ఒక పెద్ద మలుపు. అప్పట్లో దేశం తీవ్రమైన విదేశీ మారక ద్రవ్య సంక్షోభాన్ని ఎదుర్కొంది. మన వద్ద ఉన్న నిల్వలు కేవలం రెండు వారాల దిగుమతులకు సరిపడేలా, అంటే కేవలం 1 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. అటువంటి క్లిష్ట సమయంలో ఆర్బీఐ మరియు ప్రభుత్వం కలిసి చేపట్టిన సాహసోపేతమైన ఆర్థిక సంస్కరణలు మనల్ని గట్టెక్కించాయి. ఆ సంక్షోభం నుండి పాఠాలు నేర్చుకున్న ఫలితంగా, నేడు మన విదేశీ మారక నిల్వలు 650 బిలియన్ డాలర్ల మైలురాయిని అధిగమించాయి. ఇది ప్రపంచ వేదికపై భారత ఆర్థిక పటిమను చాటి చెబుతోంది. మారుతున్న కాలంతో పాటు ఆర్బీఐ తనను తాను ఆధునీకరించుకుంటూ వస్తోంది. నేడు మనం ఉపయోగిస్తున్న యూపీఐ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది. నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక పారదర్శకతను పెంచడంలో ఆర్బీఐ కీలక పాత్ర పోషించింది. 2024-25 నాటికి నెలకు సగటున 12 బిలియన్లకు పైగా యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయంటే, అది ఆర్బీఐ కల్పించిన డిజిటల్ మౌలిక సదుపాయాల విజయం. అంతేకాకుండా, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 'సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ' లేదా డిజిటల్ రూపాయిని ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టింది. ఇది కరెన్సీ నిర్వహణ వ్యయాన్ని తగ్గించడమే కాకుండా, లావాదేవీల వేగాన్ని పెంచుతుంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మరియు ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ, ఆర్బీఐ తన సమతుల్య విధానాలతో దేశాన్ని సురక్షిత తీరాలకు చేరుస్తోంది. 2022-2024 మధ్య కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు, ఆర్బీఐ అప్రమత్తంగా వ్యవహరించి వడ్డీ రేట్లను సవరించడం ద్వారా దేశీయ మార్కెట్‌లో ధరల స్థిరత్వాన్ని కాపాడింది. ముగింపుగా చెప్పాలంటే, భారతీయ రిజర్వు బ్యాంకు అనేది కేవలం ఒక నియంత్రణ సంస్థ మాత్రమే కాదు, అది దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక సురక్షితమైన కవచం. హిల్టన్ యంగ్ కమిషన్ సిఫార్సుల నుండి డాక్టర్ అంబేద్కర్ మేధో పునాది వరకు, 1935 నాటి ప్రైవేట్ సంస్థ నుండి నేటి డిజిటల్ ఆర్థిక చోదక శక్తి వరకు ఆర్బీఐ ప్రయాణం స్ఫూర్తిదాయకం. దేశంలోని పేద ప్రజల పొదుపు మొత్తానికి భద్రతనిస్తూ, పారిశ్రామిక వేత్తల పెట్టుబడులకు దిశానిర్దేశం చేస్తూ, అంతర్జాతీయ స్థాయిలో రూపాయి గౌరవాన్ని నిలబెడుతూ ఆర్బీఐ చేస్తున్న కృషి అమోఘం. రాబోయే దశాబ్దాల్లో భారతదేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగే క్రమంలో, ఆర్బీఐ తన అనుభవం మరియు ఆధునిక సాంకేతికతతో దేశాభివృద్ధికి మరింత పటిష్టమైన పునాది వేస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఆర్థిక స్థిరత్వం, పారదర్శకత మరియు సమ్మిళిత వృద్ధి అనే మూడు సూత్రాలే పరమావధిగా సాగుతున్న ఆర్బీఐ ప్రస్థానం భారత ప్రగతి పథంలో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచి పోతుంది.

## తాగిన మైకంలో కత్తితో దాడి.. భార్య, కుమారుడి మృతి

**మహేశ్వరం, మార్చి 31 పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ఆమనగల్లు మండలం పులిగోనిపల్లి తండాలో బాణావత్ రాందాస్ నాయక్ అనే వ్యక్తి తాగిన మైకంలో భార్య, పిల్లలపై కత్తితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాందాస్ నాయక్ స్థానికంగా ఉన్న కాటన్ మిల్లులో పనిచేస్తున్నాడు. రాందాస్ గత కొంతకాలంగా మద్యానికి బానిసై తరచూ భార్య కవిత (28)తో గొడవపడేవాడు. మద్యం మత్తులో రాందాస్ నాయక్.. మంగళవారం తెల్లవారుజామున నిద్రిస్తున్న భార్య కవిత, కుమారుడు హర్షవర్ధన్ (10), కుమార్తె ప్రణీతపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో కవిత, హర్షవర్ధన్ మృతిచెందగా.. ప్రణీతకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ప్రణీత పరిస్థితి విషమంగా ఉంది. ఘటనాస్థలాన్ని ఏసీపీ జానకిరెడ్డి పరిశీలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## కొకైన్ తరలిస్తున్న రైల్వే సూపరింటెండెంట్ సహా ముగ్గురి అరెస్టు


**కూకట్‌పల్లి, మార్చి 31 పెన్ పవర్:** మత్తు పదార్థాలు తరలిస్తున్న ముగ్గురిని అరెస్టుచేసిన ఘటన మోకిల ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వీరబాబు వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్ నిలయంలోని ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేసే పొన్నాల సిద్ధార్థ, నిజాంపేట్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చదలవాడ హేమంత్ కృష్ణవంశీ, నాచారానికి చెందిన రొయ్యల వ్యాపారి అవధూత విష్ణుతేజ ముగ్గురూ స్నేహితులు. వీరు తక్కువసమయంలో ఎక్కువ మొత్తంలో డబ్బు సంపాదించాలని పథకం వేశారు. నిషేధిత మాదకద్రవ్యాలను గోవా,బెంగళూరు, ముంబయి తదితర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి నగరంలోని పబ్‌లు, క్లబ్‌లలో విక్రయిస్తున్నారు. ఇందులో భాగంగానే సిద్ధార్థ తన కారులో ఇంద్రారెడ్డినగర్ అవుటర్ సర్వీసు రోడ్డులో ఇద్దరు స్నేహితులతో కలిసి 39.72 గ్రాముల కొకైన్, 3గ్రాముల గంజాయి విక్రయించేందుకు నగరానికి వెళుతున్నారు. పోలీసులు తనిఖీ చేసి వారిని పట్టుకున్నారు.

# వైఎస్ ఫ్యామిలీలో కలహాల కాపురం

**కడప, మార్చి 31, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం వైఎస్సార్ కుటుంబ అంతర్గత కలహాలు పెను దుమారం రేపుతున్నాయి. ఒకప్పుడు అభేద్యమైన కోటలా కనిపించిన ఈ కుటుంబంలో ఆస్తి పంపకాలు, వ్యక్తిగత విభేదాలు వీధిన పడటం చర్చనీయాంశంగా మారింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైఎస్ షర్మిల మధ్య సాగుతున్న ఈ పోరు కేవలం కుటుంబ వ్యవహారంగా మిగిలిపోకుండా రాజకీయ రంగు పులుముకోవడం వల్ల అనేక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రాజకీయాల్లో అత్యున్నత పదవుల్లో ఉన్న నాయకులకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో కీలకం. జగన్ తన సోదరి షర్మిల లేవనెత్తుతున్న ఆస్తి వాటాల అంశాన్ని ప్రతిపక్షాల కుట్రగా భావించడం, చంద్రబాబు నాయుడు ట్రాప్‌లో ఆమె పడ్డారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆరోపించడం గమనార్హం. వ్యక్తిగత సమస్యలను రాజకీయ కోణంలో ఎదుర్కోవడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉంది. తమిళనాడులో కరుణానిధి వారసుల మధ్య జరిగిన ఘర్షణలు, ఉత్తరప్రదేశ్‌లో ములాయం సింగ్ యాదవ్ కుటుంబ సభ్యుల మధ్య తలెత్తిన విభేదాలు ఆయా పార్టీల ప్రతిష్టను భారీగా దెబ్బతీశాయి. ఇప్పుడు ఏపీలో కూడా జగన్ తన తల్లి విజయమ్మ, సోదరి షర్మిలపై పార్టీ నేతలతో విమర్శలు చేయించడం సొంత కేడర్‌ను సైతం విస్మయానికి గురిచేస్తోంది. రక్తసంబంధీకులపై ఇలాంటి ఆరోపణలు చేయడం వల్ల ప్రజల్లో జగన్ పట్ల ఒక రకమైన ప్రతికూల భావన ఏర్పడే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. అమ్మ, చెల్లి ఇద్దరూ ప్రత్యర్థుల చేతిలో పావులుగా మారారనే ప్రచారం సామాన్య ఓటర్లలో ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు. తన సొంత కుటుంబ సభ్యులనే ఒప్పించలేని, మెప్పించలేని నాయకత్వం రాష్ట్ర ప్రజల సమస్యలను ఎలా పరిష్కరిస్తుందనే ప్రశ్నలు తలెత్తుతాయి. షర్మిల ఒక జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షురాలిగా రాజకీయ విమర్శలు చేస్తున్నప్పుడు వాటిని రాజకీయంగానే తిప్పికొట్టాలి. అలా కాకుండా ఆస్తుల గొడవను తెరపైకి తెచ్చి ఆమెను వ్యక్తిగతంగా దూషించడం వల్ల వైఎస్సార్‌సీపీ ఇమేజ్ డ్యామేజ్ అవుతోంది తప్ప ప్రత్యర్థులకు ఆయుధాలు ఇచ్చినట్లు అవుతోందన్న అభిప్రాయం వినిపిస్తోంది. కుటుంబ సమస్యలను నాలుగు గోడల మధ్య పరిష్కరించుకోకపోవడం వల్ల రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఒకప్పుడు జగన్ వెనుక కొండంత అండగా నిలిచిన విజయమ్మ, షర్మిల నేడు ఆయనకు దూరంగా జరగడం అనేది భావోద్వేగపూరితమైన ఆంధ్ర ఓటర్ల మనోభావాలను దెబ్బతీస్తుంది. రాజకీయాల్లో ప్రత్యర్థులతో మైండ్ గేమ్స్ ఆడటం సహజం కానీ, అది కన్నతల్లి, కన్నచెల్లితో సాగితే ప్రజల నుంచి వచ్చే స్పందన మరోలా ఉంటుంది. ఈ వివాదం ఎంత కాలం సాగితే అంతగా వైఎస్సార్ వారసత్వంపై ప్రజలకున్న నమ్మకం సడలిపోయే ప్రమాదం పొంచి ఉంది. వ్యక్తిగత ఆస్తుల వివాదాలు రాజకీయాల్లోకి చొచ్చుకురావడం వల్ల ప్రతిపక్ష పార్టీగా ఎలా పని చేస్తున్నారు అనే దానికన్నా.. ఈ వివాదమే హైలెట్ అవుతుంది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు గానీ, సంబంధిత రాజకీయ పార్టీకి గానీ అంత మంచిది కాదు. జగన్ ఈ అంశాన్ని కేవలం ఒక రాజకీయ నాయకుడిలా కాకుండా ఒక అన్నగా కుటుంబ పరిధిలోనే ముగించుకుంటేనే ఆయన వ్యక్తిగత ఇమేజ్‌కు మేలు జరుగుతుంది. లేకపోతే ఈ అంతర్గత కలహాలే భవిష్యత్తులో వైఎస్సార్‌సీపీకి తీరని నష్టం చేకూర్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.



# ఏపీ కోచింగ్ సంస్థలపై కొరడా



**విజయవాడ మార్చి 31, పెన్ పవర్:** ఏపీలో 'కస్టడీ' కోచింగ్ సెంటర్లను కట్టడి చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై కోచింగ్ పేరుతో విద్యార్థులను వేధిస్తే కఠిన చర్యలుంటాయి. AP Coaching Institutions Rules 2026 పేరుతో కఠిన నిబంధనలు అమల్లోకి వచ్చాయి. రాష్ట్రంలోని ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల 'ఇష్టారాజ్యానికి' అడ్డుకట్ట వేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల మానసిక ఆరోగ్యం, భద్రత, ఫీజుల పారదర్శకతను మెరుగుపరిచే లక్ష్యంతో ఉన్నత విద్యాశాఖ సరికొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలతో పాటు రిజిస్ట్రేషన్ రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది .కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా అనేక కొత్త నిబంధనలను జీవోలో పొందుపరిచారు.

**ఏపీ కోచింగ్ ఇనిస్టిట్యూషన్ రూల్స్:**

రోజుకు గరిష్టంగా 5 గంటలు మాత్రమే కోచింగ్ ఇవ్వాలి. పాఠశాల, కళాశాల పనివేళల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ కోచింగ్ క్లాసులు నిర్వహించకూడదు.

ఆదివారాలు, ప్రభుత్వం ప్రకటించిన సాధారణ సెలవు దినాల్లో తరగతులు నిర్వహించడం నిషేధం. ఏదైనా కారణంతో విద్యార్థి కోర్సు మధ్యలో వదిలేస్తే.. మిగిలిన కాలానికి సంబంధించిన ఫీజును 10 రోజుల్లోపు తిరిగి చెల్లించాలి. 'ఫీజు వెనక్కి ఇవ్వబడదు' అనే నిబంధనలు ఇకపై చెల్లవు.

ఫీజుల పేరుతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను తమ వద్ద ఉంచుకోవడం చట్టవిరుద్ధం.

విద్యార్థుల మార్కులు , ర్యాంకులను బహిరంగంగా హోర్డింగ్స్‌పై, వెబ్‌సైట్లలో గానీ ప్రదర్శించకూడదు. ఫలితాలను వ్యక్తిగతంగా తల్లిదండ్రులకు మాత్రమే తెలపాలి.

50 లేదా అంతకంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న ప్రతి సంస్థ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**గీత దాటితే వేటే:**

నిబంధనలు రూపొందించడం మాత్రమే కాకుండా వాటి పర్యవేక్షణకు కమిటీలు కూడా వేశారు. ఈ నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన 'జిల్లా స్థాయి పర్యవేక్షక కమిటీ' ఏర్పాటవుతుంది.దీనికి సివిల్ కోర్టుకు ఉండే అధికారాలు ఉంటాయి.మొదటిసారి ఉల్లంఘిస్తే 50,000 జరిమానా, రెండవసారి అదే తప్పు చేస్తే..1,00,000 జరిమానా విధిస్తారు. ఆ తర్వాత కూడా అలాగే జరిగితే కోచింగ్ సెంటర్ అనుమతి రద్దు అవుతుంది. పునరావృతమైతే కోచింగ్ సెంటర్ రిజిస్ట్రేషన్ రద్దు చేసి శాశ్వతంగా మూత వేస్తారు. ప్రతి కోచింగ్ సెంటర్ తప్పనిసరిగా ఒక 'వెల్‌నెస్ సెల్' ఏర్పాటు చేయాలి. ఇందులో శిక్షణ పొందిన కౌన్సెలర్లు ఉండాలి. విద్యార్థులు చేరిన 30 రోజుల్లోపు వారి మానసిక స్థితిని అంచనా వేసి, అవసరమైన వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలి. ఆత్మహత్యల నివారణకు హాస్టళ్లలో 'యాంటీ-సూసైడ్' స్ప్రింగ్ ఫ్యాన్ల ఏర్పాటును కూడా ప్రభుత్వం సూచించింది.ముఖ్యంగా రాష్ట్రంలో ర్యాంకుల రేస్, అనారోగ్యకరమైన పోటీని నివారించేందుకు ఈ రూల్స్ తెచ్చారు. (మెడికల్), (ఇంజనీరింగ్),బ్యాంకింగ్ , క్లాట్ వంటి పోటీ పరీక్షలకు లక్షలాది మంది విద్యార్థులు పోటీ పడుతున్నారు. ర్యాంకుల గోలలో కోచింగ్ సెంటర్లు విద్యార్థులపై పడుతున్న ఒత్తిడిని పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా కార్పొరేట్ కాలేజీలు ఇంటర్మీడియట్ విద్యార్థులను బందీలుగా మారుస్తున్నాయి. రోజుకు 18గంటల పాటు కోచింగ్ పేరుతో వాళ్లని వేధిస్తున్నాయి.

**ఏమిటీ కేసు..?**

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఓ సంఘటన కారణంగానే ఇప్పుడు ఈ రూల్స్ వచ్చాయి. విశాఖలో నీట్ కోచింగ్ తీసుకుంటున్న 17 ఏళ్ల విద్యార్థిని అనుమానాస్పదంగా మరణించిన ఘటనతో ఈ కేసు ప్రారంభమైంది. కుటుంబం జడీ× విచారణ కోరగా... సుప్రీంకోర్టు కేసును సీరియస్‌గా తీసుకుంది.. సుకేదేబ్ సాహా, ఆంధ్రప్రదేశ్ అనే ఈ కేసుతో కోచింగ్ సెంటర్ల పనితీరుపై పెద్ద ఎత్తున ప్రశ్నలు తలెత్తాయి. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. అన్ని రాష్ట్రాలు వాటిని అమలు చేయాలని సూచించింది.

**దీంతో కోచింగ్ సెంటర్లకు షాక్ ఇచ్చేలా కొన్ని గైడ్‌లైన్స్ జారీ చేసింది:**

టాప్-బాటమ్ బ్యాచ్‌లుగా విభజించడం వద్దు

పబ్లిక్‌గా విద్యార్థులను అవమానించడం నిషేధం

ఒత్తిడికి మించిన టార్గెట్స్ ఇవ్వకూడదు

ప్రతి ఇన్‌స్టిట్యూషన్‌లో కౌన్సెలింగ్ తప్పనిసరి

హాస్టళ్లలో హెల్ప్‌లైన్ నంబర్లు డిస్‌ప్లే చేయాలి

టీచర్లకు మెంటల్ హెల్త్ ట్రైనింగ్ కంపల్సరీ

రూఫ్‌టాప్, బాల్కనీలు వంటి హై రిస్క్ ఏరియాలకు యాక్సెస్ కంట్రోల్ వంటి ఆదేశాలిచ్చింది.

దానికి అనుగుణంగా.. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం రూల్స్ విధించింది.

# యనమల రిటైర్మెంటేనా..

**కాకినాడ మార్చి 31,పెన్ పవర్:**

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో అత్యంత కీలకమైన నేతగా, మేధావిగా, వ్యూహకర్తగా వెలుగొందిన యనమల రామకృష్ణుడు రాజకీయ ప్రస్థానం ఇప్పుడు ఒక కీలక మలుపులో ఉన్నట్లు కనిపిస్తోంది. నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగిన ఆయన, తాజాగా కాకినాడలో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను చర్చకు దారితీశాయి. "పదవుల కోసం నేను ఎవరినీ సాయం కోరలేదు.. భగవంతుడు అనుకున్నదే మన జీవితంలో జరుగుతుంది" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు, ఆయన రాజకీయ విశ్రాంతికి సంకేతాలా అనే అనుమానాలను బలపరుస్తున్నాయి.టీడీపీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు యనమల రామకృష్ణుడు పార్టీలో అగ్రస్థానంలో ఉంటూ వచ్చారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, అసెంబ్లీ స్పీకర్‌గా ఆయన రికార్డు సృష్టించారు. చంద్రబాబుకు నమ్మినబంటుగా, పార్టీకి ఆర్థిక, రాజ్యాంగ పరమైన అంశాల్లో దిశానిర్దేశం చేస్తూ వచ్చారు. ఇటీవల ఎమ్మెల్సీగా ఆయన పదవీ కాలం ముగిసే వరకు ఏదో ఒక పదవిలో ఉంటానే ఉన్నారు. అయితే, ఎమ్మెల్సీ గడువు ముగిసిన తర్వాత పార్టీ అధిష్టానం ఆయనకు తదుపరి ఏ బాధ్యత అప్పగించలేదు.యనమల రామకృష్ణుడు రాజ్యసభకు వెళ్లాలని ఆకాంక్షిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. ఢిల్లీ స్థాయిలో పార్టీ వాణిని వినిపించేందుకు తనకున్న అనుభవం ఉపయోగపడుతుందని ఆయన భావించారు. కానీ, ప్రస్తుత రాజకీయ సమీకరణాల దృష్ట్యా అధిష్టానం ఆ దిశగా ఆలోచించడం లేదని స్పష్టమవుతోంది. "రాజ్యసభ అడిగితే వచ్చేది కాదు.. మనం అనుకున్నది భగవంతుడు చేయడు" అని యనమల అనడం వెనుక, తనకు పదవి దక్కదని ఆయన ముందే గ్రహించారా అనే చర్చ మొదలైంది. "ఇంకా నాకు పదవి ఇవ్వండి.. నేను పరిగెడతాను అని అడగలేను" అని చెప్పడం ద్వారా ఆయన తన అసహనాన్ని లేదా వైరాగ్యాన్ని ప్రదర్శించినట్లు కనిపిస్తోంది.యనమల రాజకీయ గ్రాఫ్ తగ్గడానికి ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలు కూడా కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. కాకినాడ సెజ్ భూముల్లో ఆయన చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీని ఇరకాటంలో పెట్టాయి. ఇది అధిష్టానానికి కొంత అసంతృప్తి కలిగించిందని సమాచారం. ఇటీవల హైదరాబాద్‌లో ఆయన అల్లుడు ఒక డ్రగ్స్ కేసులో పట్టుబడటం యనమల ప్రతిష్టను దెబ్బతీసింది. రాజకీయంగా క్లీన్ ఇమేజ్ ఉన్న ఆయనకు, ఈ ఘటన వ్యక్తిగతంగా, రాజకీయంగా పెద్ద ఎదురుదెబ్బగా మారింది."పార్టీ మనుగడ కోసం శత్రువులకు కూడా సాయం చేశాను" అని యనమల అనడం ద్వారా పార్టీ పట్ల తనకున్న నిబద్ధతను చాటుకుంటూనే, తన సేవలకు తగిన గుర్తింపు లభించలేదనే ఆవేదనను వెలిబుచ్చినట్లు అనిపిస్తోంది. 44 ఏళ్లుగా పార్టీ తనను పోషించిందని చెప్పడం ద్వారా కృతజ్ఞత చాటుకున్నప్పటికీ, భవిష్యత్తులో తనకు ప్రత్యక్ష రాజకీయ పదవులు ఉండకపోవచ్చనే వాస్తవాన్ని ఆయన జీర్ణించుకున్నట్లు తెలుస్తోంది.పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. టీడీపీ ఇప్పుడు యువ రక్తాన్ని ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తోంది. సీనియర్లకు గౌరవప్రదమైన స్థానం కల్పిస్తూనే, క్రియాశీలక పదవుల నుంచి వారిని తప్పించి కొత్త వారికి అవకాశం ఇవ్వాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే యనమలకు ఇక 'రాజకీయ విశ్రాంతి' తప్పదని ఆయన సన్నిహితులు సైతం గుసగుసలాడుకుంటున్నారు.

## చట్టబద్ధత అడుగులు

**విజయవాడ, మార్చి 31, పెన్ పవర్:** చట్టబద్ధత దిశగా అడుగులు పడుతున్నాయి. ఏపీ అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమై అమరావతి ఏకైక రాజధానిగా గుర్తించాలని కేంద్రానికి ప్రతిపాదిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. 2014 విభజన చట్టాన్ని సవరిస్తూ.. అమరావతిని కదిలించలేని స్థితిలో చట్టబద్ధత తేవాలన్న ప్రయత్నంలో చంద్రబాబు సర్కారు ఉంది. అందుకే తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. కేంద్ర ప్రభుత్వం సైతం వీలైనంత త్వరగా ఈ తీర్మానాన్ని పార్లమెంట్లో ప్రవేశపెట్టి.. ఓకే చేయించే ప్రయత్నంలో ఉంది. అయితే ఇప్పుడు ఈ ప్రక్రియను ఢిల్లీ స్థాయిలో కీలక నేత ఒకరు పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయనే మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు. ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వం తో ప్రత్యుత్తరాలు జరుపుతూ.. వీలైనంత త్వరగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఏప్రిల్ 1న కేంద్ర క్యాబినెట్ ఆమోదం.. ఆ వెంటనే పార్లమెంట్లో ప్రవేశపెట్టి ఆమోదించేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. అయితే ఇప్పుడు వెంకయ్య నాయుడు సేవలను దీనికోసం ఉపయోగిస్తుండటం మాత్రం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ రాష్ట్ర రాజధాని కి లేని చట్టబద్ధత అమరావతికి అత్యంత అవశ్యం అని కేంద్రానికి చెప్పడంలో వెంకయ్య నాయుడు కీలకపాత్ర పోషించినట్లు సమాచారం.బిజెపిలో కీలక పాత్ర పోషించారు వెంకయ్య నాయుడు కానీ రెండోసారి బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తరువాత అనూహ్య నిర్ణయాలు వచ్చాయి. అందులో భాగంగా వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతి పదవికి ఎంపిక చేశారు. దీంతో రాజ్యాంగబద్ధ పదవిలోకి వెళ్లిపోయారు వెంకయ్య నాయుడు. అప్పటినుంచి రాజకీయాలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. కానీ ఒకానొక దశలో ఆయన పేరు రాష్ట్రపతి పదవికి వినిపించింది. ఉపరాష్ట్రపతులు రాష్ట్రపతి పదవులను అలంకరించిన దాఖలా సందర్భాల్లో చూసాం. అదే మాదిరిగా వెంకయ్య నాయుడుకు అవకాశం వస్తుందని అంతా భావించారు. కానీ కేంద్ర పెద్దలు మాత్రం అనూహ్యంగా ద్రౌపది ముర్ముకు ఆ అవకాశం ఇచ్చారు. గిరిజన మహిళ కావడంతో జాతీయస్థాయిలో కలిసివస్తే అంశంగా పరిగణించి అప్పట్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉపరాష్ట్రపతి పదవిని అలంకరించిన వెంకయ్యనాయుడు కార్యక్రమంలో రాజకీయాలు చేయలేకపోయారు. తెర వెనుక రాజకీయాలకు మాత్రమే పరిమితం అయ్యారు. అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులు ప్రారంభించిన తర్వాత కూడా వైఎస్సార్ కాంగ్రెస్ చాలా రకాలుగా ఇబ్బందులు పెడుతోంది. అమరావతికి వ్యతిరేక ప్రచారం అధికమైంది. ఈ నేపథ్యంలో చట్టబద్ధత అనే అంశం తెరపైకి వచ్చింది. కానీ సాంకేతికంగా ఈ రాష్ట్ర రాజధానికి కూడా చట్టబద్ధత కల్పించలేని విషయాన్ని కేంద్రం స్పష్టం చేసింది. ఈ తరుణంలో చంద్రబాబు నాయుడు సీనియారిటీ కలిగిన వెంకయ్య నాయుడుకు ఈ పని అప్పగించారు. ఏపీలో నెలకొన్న పరిస్థితులు, గత అనుభవాలను వెంకయ్య నాయుడు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు వివరించారు. ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత అత్యంత అవశ్యం అని.. అందుకు మార్గాలను సైతం సూచించారు వెంకయ్య నాయుడు. దీంతో కేంద్ర ప్రభుత్వం సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏప్రిల్ 1న కేంద్ర క్యాబినెట్లో చర్చించి ఆ మరుసటి రోజు పార్లమెంట్లో బిల్లు పెట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. మొత్తానికైతే అమరావతి రాజధాని విషయంలో ఆది నుంచి అనుకూలంగా ఉంటూ వచ్చారు వెంకయ్య నాయుడు. ఇప్పుడు ఆయనే స్వయంగా అమరావతికి చట్టబద్ధత కల్పించడంలో పాలుపంచుకుంటున్నారు. ఇది నిజంగా శుభ పరిణామం.

## సంక్షోభం నుంచి బయటపడదేలా...

**నెల్లూరు మార్చి 31,పెన్ పవర్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఏపీలో రెండు సంక్షోభాలు తప్పేలా లేవు. ఒకటి అమరావతి. రెండోది అన్యమత అపవాదు. ఇటీవల అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఏపీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో తీర్మానించారు. కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు. ఈ విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తన వైఖరి చెప్పలేదు. మరోవైపు ఆకివీడులో రఘురామకృష్ణం రాజు పై అన్యమతస్తుల పేరుతో దాడి ప్రయత్నం జరిగింది. శ్రీరామనవమి నాడు శ్రీరాముడి విగ్రహానికి పూలమాలలు వేస్తుండగా కొందరు అడ్డుకున్నారు. ఆ విషయంలో సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తన వైఖరి చెప్పలేదు. ఈ రెండు ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంక్షోభాలుగా ఎదురయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారుఅమరావతి రాజధాని విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై విమర్శలే కాదు అనేక రకాల అనుమానాలు ఉన్నాయి. అమరావతి విషయంలో ఎటువంటి వ్యతిరేక ప్రచారం జరిగినా దాని వెనుక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉంటుందన్నది బహిరంగ రహస్యం.. ఆది నుంచి అమరావతి విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైఖరి అలానే ఉంది. అమరావతి రాజధానికి ఏకాభిప్రాయం పేరుతో సమర్థించింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానుల పేరుతో అమరావతిని నిర్వీర్యం చేసింది. అలాగని మూడు రాజధానుల ను నిర్మించలేకపోయింది. అయితే ఇప్పుడు అధికారం కోల్పోయాక కూడా అమరావతికి తాము వ్యతిరేకం కాదన్న మాట పరోక్షంగా చెప్పుకొచ్చింది. కానీ అదే విషయాన్ని సభకు వచ్చి చెప్పే అవకాశాన్ని కూడా చేజేతులా కోల్పోయింది.తాజాగా ఆకివీడు వ్యవహారం పొలిటికల్ సర్కిల్లో హాట్ రేపుతోంది. ఒక రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న రఘురామకృష్ణం రాజు శ్రీరామనవమి నాడు శ్రీరాముడి విగ్రహానికి పూలమాలలు వేసేందుకు ప్రయత్నించగా కొంతమంది అడ్డుకున్నారు. దీనిపై ఇంతవరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్పందించలేదు. అదే ముస్లిం, క్రిస్టియన్ విషయంలో వేగంగా స్పందించే ఆ పార్టీ... హిందూ మతానికి సంబంధించిన విషయాలపై పెద్దగా స్పందించడం లేదనే విమర్శ మూటగట్టుకుంది. ఇంతవరకు ఈ ఘటనపై స్పందించకపోవడం రాజకీయంగా విమర్శలకు దారితీస్తోంది. మున్ముందు ఈ పరిణామం కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంక్షోభంగా మిగలనుంది.

## వివాదాల్లో హ్యాట్రిక్ ఎమ్మెల్యే

**శ్రీకాకుళం, మార్చి 31,పెన్ పవర్:** శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గానికి గేట్ వే ఆఫ్ ఏపీ అని పేరు. నేతలు ఎవరైనా.. పార్టీ ఏదైనా.. పాదయాత్రలు అంటే ఇక్కడ నుంచే మొదలు పెట్టాల్సిందే. టీడీపీకి తిరుగులేని ఆధిపత్యం ఉన్న నియోజకవర్గం అది. ఇక్కడి నుంచి సైకిల్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ కొట్టారు బెందాళం అశోక్. ప్రస్తుతం ప్రభుత్వ విప్ పదవిలో కూడా ఉన్నారు. 2019లో జగన్ హవాను తట్టుకొని సైతం ఆయన గెలిచారు. కూల్ అండ్ సైలెంట్ రాజకీయాలు చేస్తారని ఆయనకు పేరు. ఎక్కువగా తన నియోజకవర్గానికే పరిమితం అవుతూ.. పాలిటిక్స్ నడిపిస్తూ ఉంటారు. సైలెన్స్‌కు కేరాఫ్‌గా ఉండే బెందాళం అశోక్.. ఒక్కసారి వయలెంట్‌గా మారడం.. ఇప్పుడు ఉమ్మడి సిక్కోలు జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది.గిరిజనులు, బెంతొరియాల మధ్య సాగుతున్న ఎస్టీ సర్టిఫికెట్ల వివాదంలో ఎంటర్ కావడంతో.. బెందాళం అశోక్ కాంట్రవర్సీకి కేరాఫ్‌గా మారిపోయారు. తన నియోజకవర్గంలో 20వేలకు పైగా బెంతొరియా కులాలకు చెందిన వాళ్లు ఉన్నారని.. వారిని ఎస్టీల్లో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు అశోక్. ఐతే దీన్ని వ్యతిరేకిస్తున్న గిరిజన సంఘాలు.. ఈ మధ్య అశోక్‌ను కలిశాయ్. ఐతే ఆ సమయంలో గిరిజన సంఘాల నేతలపై అశోక్ నోరు పారేసుకున్నారు. బూతు పురాణం అందుకున్నారు. దీంతో ఆయన తీరుపై గిరిజన సంఘాల నేతలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ప్రవర్తనపై వ్యతిరేకిస్తూ పోరాటాలకు సిద్ధం అవుతున్నారని తెలుస్తోంది.బెంతొరియాలను ఎస్టీల్లో చేర్చాలనే వ్యవహారం చుట్టూ శ్రీకాకుళం జిల్లాలో కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. దీనిపై అనేక ప్రభుత్వాలు కమిటీలు వేశాయని.. అసలు బెంతొరియాలు లేరని అవి తేల్చి చెప్పాయని.. దీంతో అప్పటి కలెక్టర్ గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేశారని గిరిజన సంఘాల నేతలు అంటున్నారు. ఐతే ఎమ్మెల్యే అశోక్ మాత్రం ఓటు రాజకీయాలు చేస్తూ.. నకిలీ బెంతొరియాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శిస్తున్నారు. ఎమ్మెల్యే తీరుపై గిరిజన సంఘాల నేతల తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఇక అటు సొంత పార్టీ నేతలు కూడా అశోక్ తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన నేతలతో ఆయన అలా వ్యవహరించి ఉండాల్సింది కాదని అంటున్నారు.అశోక్ తీరు.. ఇప్పుడు జిల్లా పార్టీలో కొత్త చర్చకు కారణం అవుతోంది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో రెండు లక్షలకు పైగా గిరిజనులు ఉన్నారని.. వారి మనోభావాలు దెబ్బతింటే పార్టీకి తీరని నష్టం అంటున్నారు తెలుగు తమ్ముళ్లు. ఇక అటు గిరిజన సంఘాలు మాత్రం తగ్గేదే లే అంటున్నాయ్. ఎమ్మెల్యే ప్రవర్తనపై ఎంతవరకైనా పోరాటానికి సిద్ధం అంటున్నాయ్. స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న సమయంలో ఇలాంటి వివాదాలు ఏంటి.. కుల సమస్యలు ఏంటి? అని పార్టీ సీనియర్లు పెదవి విరుస్తున్నారు. ఏమైనా మిస్టర్ కూల్ ఎమ్మెల్యే.. ఇప్పుడు జిల్లాలో మిస్టర్ హాట్‌టాపిక్‌గా మారిపోయారని జనం గుసగుసలాడుకుంటున్నారు

## రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**నల్గొండ:పెన్ పవర్:** నల్గొండ పట్టణంలో "అరైవ్ అలైవ్" కార్యక్రమం భాగంగా రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని జిల్లా పోలీసు శాఖ ఘనంగా నిర్వహించింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ,... రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం, అతివేగం మరియు ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వల్లనే జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి వాహనదారు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాల్సిన బాధ్యత కలిగి ఉండాలి అన్నారు.హెల్మెట్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పోలీస్ కళాబృందం ప్రత్యేక ప్రదర్శన నిర్వహించింది. యమధర్మరాజు వేషధారణలో కళాకారులు హెల్మెట్ ప్రాముఖ్యతను తెలియజేస్తూ సందేశాన్ని ప్రజలకు చేరవేశారు.యువత అధిక వేగంతో వాహనాలు నడపడం ప్రమాదాలకు దారితీస్తుందని ఎస్పీ హెచ్చరించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా శిక్షార్హమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని, వాహన పత్రాలు సక్రమంగా కలిగి ఉండాలని సూచించారు. రాబోయే రోజుల్లో పాఠశాలలు, కళాశాలలు, గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## ఇరాన్ ఓడిపోయే వరకు యుద్ధం కొనసాగించండి..!

ఇరాన్ ఓడిపోయేవరకు యుద్ధం కొనసాగించాలని గల్ఫ్ దేశాలు కోరుకుంటున్నాయట. ప్రస్తుత పాలనాయంత్రాంగం పూర్తిగా కూలిపోయేవరకు యుద్ధం ముగించవద్దని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ప్రైవేట్‌గా కోరాయట. అలా కోరిన దేశాల జాబితాలో సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, బహ్రెయిన్ ఉన్నాయని అసోసియేటెడ్ ప్రెస్ సంచలన కథనం వెల్లడించింది. "నెల రోజులుగా జరుగుతోన్న యుద్ధంలో ఇరాన్ చెప్పుకోదగ్గ స్థాయిలో బలహీనపడలేదు. ఇరాన్ నాయకత్వంలో గణనీయమైన మార్పు రావాలి. అప్పటివరకు సైనికచర్య ముగియకూడదు" అని ఆ దేశాల అధికారులు ప్రైవేటు సంభాషణలో భాగంగా ట్రంప్‌ను కోరారని ఆ వార్తా ఏజెన్సీ కథనం వెల్లడించింది. ఈ మేరకు అమెరికా, ఇజ్రాయెల్, గల్ఫ్ అధికారులను ఉటంకించింది. ఇరాన్‌పై దాడి గురించి ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంపై, యుద్ధం కారణంగా సంభవించే హెచ్చరికలను పట్టించుకోకపోవడంపై ఈ చర్చల సందర్భంగా ఆయా దేశాలు అసంతృప్తి వ్యక్తంచేశాయట. ఈ ఘర్షణలు ఎలాగూ కొనసాగుతున్నాయి గనక.. టెహ్రాన్‌లోని మతపెద్దల పాలనను పూర్తిగా కూలదోయడానికి ఇదొక చరిత్రాత్మక అవకాశమని కొన్ని దేశాలు అభిప్రాయం వ్యక్తం చేశాయని పేర్కొంది.

## పాలస్తీనీయులు ఉగ్ర దాడి చేస్తే.. మరణ శిక్షే: ఇజ్రాయెల్



దేశంలో ఉగ్ర దాడులకు పాల్పడిన పాలస్తీనీయులకు మరణశిక్ష విధించేలా కొత్త చట్టాన్ని ఇజ్రాయెల్ పార్లమెంట్ (క్నెసెట్) అమల్లోకి తెచ్చింది. దాదాపు పన్నెండు గంటల చర్చ తర్వాత దీనిని ఆమోదించారు. దీని ప్రకారం.. ఉగ్ర దాడులకు పాల్పడిన వారందరికీ మరణశిక్ష విధించే అధికారం అక్కడి కోర్టులకు ఉంటుంది. శిక్ష విధించిన 90 రోజుల లోపు దానిని అమలుచేయాలి. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రం న్యాయస్థానం నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తుంది. ఉగ్రవాదాన్ని అంతం చేయాలనే స్పష్టమైన లక్ష్యంతో ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చినట్లు ఇజ్రాయెల్ అధికారులు పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌లోని ఓ ప్రాంతంపై హమాస్ చేసిన ఉగ్రదాడులకు వ్యతిరేకంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అయితే ఆ దాడులకు పాల్పడిన నిందితులకు ఈ చట్టం వర్తించదన్నారు. ఇజ్రాయెల్ పౌరులు, నివాసితులను ఈ చట్టం నుంచి మినహాయించినప్పటికీ.. ప్రత్యేక నిబంధన ప్రకారం ఉగ్ర కార్యకలాపాలతో ఒక వ్యక్తి మరణానికి కారణమైన ఇజ్రాయెలీలకు సైతం ఈ చట్టం వర్తిస్తుందని అధికారులు వెల్లడించారు. ఇజ్రాయెల్ పార్లమెంట్ నిర్ణయాన్ని అమెరికా స్వాగతించింది. సొంత చట్టాలను ప్రవేశపెట్టుకొనే హక్కు ఇజ్రాయెల్ పార్లమెంట్‌కు ఉందని పేర్కొంది.

## కువైట్ చమురు ట్యాంకర్‌పై ఇరాన్ దాడి..!

గల్ఫ్ దేశాలపై ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేసింది. తాజాగా కువైట్‌కు చెందిన ఓ చమురు ట్యాంకర్‌పై భీకర దాడి చేసింది. ఈ ఘటనలో భారీగా మంటలు చెలరేగాయి. కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ఓ ప్రకటనలో ఈ ఘటనను ధ్రువీకరించింది. కువైట్‌కు చెందిన 'అల్ సల్మీ' అనే భారీ ముడిచమురు నౌక దుబాయ్ పోర్టు వద్ద ఉంది. దీనిపై ఇరాన్ డ్రోన్‌తో దాడి చేయగా.. పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. వీటిని అదుపులోకి తీసుకొచ్చేందుకు రెస్క్యూ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. ఘటన తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ.. 24 మంది సిబ్బంది సురక్షితంగానే ఉన్నారని, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు ధ్రువీకరించారు. అయితే, దాడి సమయంలో ట్యాంకర్ నిండా చమురు ఉన్నట్లు తెలుస్తోంది. సముద్ర జలాల్లో చమురు ఒలికే ప్రమాదం ఉందని కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ఆందోళన వ్యక్తంచేసింది. ఈ ఘటనను దుబాయ్ అధికారులు కూడా ధ్రువీకరించారు. రెస్క్యూ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చినట్లు వెల్లడించారు.

## క్యూబాకు రష్యా చమురుపై అభ్యంతరం లేదు


చమురు రవాణా విషయంలో క్యూబాకు విధించిన ఆంక్షలను అమెరికా సడలించింది. ఆ దేశానికి రష్యా చమురు సహాయాన్ని అందించడంపై తనకు ఎటువంటి అభ్యంతరం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. 7.3 లక్షల బ్యారెళ్ల ముడిచమురుతో 'అనటోలీ కొలోడ్కిన్' అనే నౌక ఈ నెల 8న రష్యా నుంచి బయల్దేరింది. ఇంగ్లిష్ ఛానల్ మీదుగా అట్లాంటిక్ చేరుకుంది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఈ నౌక క్యూబాను చేరుతుందా లేదా అనే సందిగ్ధత నెలకొన్న తరుణంలో ట్రంప్ దీనిపై స్పందించారు. "ఇప్పటికిప్పుడు క్యూబాకు చమురు చేరవేయాలని ఏ దేశం అనుకున్నా దాంతో నాకు ఎటువంటి సమస్యా లేదు. అది రష్యా అయినా, కాకపోయినా నాకేం ఇబ్బంది లేదు. త్వరలోనే క్యూబా ప్రభుత్వం కుప్పకూలుతుంది" అని ట్రంప్ పేర్కొన్నారు. అనంతరం రష్యా చమురు నౌకకు అనుమతినిస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. ఈ నౌక మంగళవారం క్యూబాకు చేరుకునే అవకాశం ఉంది. వెనెజువెలా మాజీ అధ్యక్షుడు మదురో నిర్బంధం తర్వాత క్యూబాకు చమురు రవాణా నిలిచిపోయింది. వారికి చమురు చేరవేసే దేశాలపై అధిక సుంకాలు విధిస్తామంటూ గతంలో హెచ్చరించిన సంగతి గమనార్హం.

## హార్మూజ్ జలసంధిలో ఆగిన నౌకాయానం



ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా యుద్ధం మోదలై నెలరోజుకుపైనే అయినా.. ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన ఇంధన రవాణా మార్గాలలో ఒకటైన హార్మూజ్ జలసంధి గుండా నౌకా రవాణా గణనీయంగా పడిపోయింది. బ్లూమ్‌బెర్గ్ తాజాగా విడుదల చేసిన డేటాలో వెల్లడైంది. నివేదిక ప్రకారం.. సంక్షోభానికి ముందు స్థాయిలతో పోలిస్తే ఈ జలసంధి గుండా ప్రయాణించే నౌకల సంఖ్య 95 శాతం వరకు తగ్గింది. కేవలం కొన్ని నౌకలు మాత్రమే నడుస్తున్నవి. వాటిలో చాలా వరకు ఇరాన్ జెండా ఉన్నవి లేదా ఇరాన్‌తో సంబంధం ఉన్న దేశాలకు చెందిన నౌకలు మాత్రం ప్రయాణించగలుగుతున్నాయి. గతంలో ప్రతిరోజూ సుమారు 150 నౌకలు ఈ కీలకమైన మార్గాన్ని ఉపయోగించేవి. సముద్ర రవాణాలో ఈ తీవ్రమైన క్షీణత, ప్రపంచంలోని కీలకమైన చమురు , గ్యాస్ కారిడార్లలో ఒకదాని గుండా వాణిజ్య రవాణా దాదాపు పూర్తిగా నిలిచిపోయిందని సూచిస్తుంది. ఈ ధోరణి ప్రపంచ ఇంధన మార్కెట్లపై ప్రభావం చూపుతోంది.

# రోజుకు 12 గంటలు.. వారానికి 6 రోజులు పని చేస్తేనే దేశం బాగుపడుతుంది: రష్యా పారిశ్రామికవేత్త పిలుపు



నాలుగేళ్లుగా ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా రష్యా ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిపోయింది. రెండు రోజుల కిందట రష్యా తన వద్ద ఉన్న బంగారం కూడా అమ్ముకుంటోందనే వార్త కూడా బయటకు వచ్చింది. ఈ తరుణంలో ఆ దేశ ప్రముఖ పారిశ్రామికవేత్త అల్యూమినియం దిగ్గజం 'రుసల్' వ్యవస్థాపకుడు ఒలేగ్ డెరిపాస్కా కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యా ఎదుర్కొంటున్న ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు కేవలం తాత్కాలిక మందగమనం కావని, ఇది ఒక ప్రాథమిక మార్పని పేర్కొన్నారు. ఈ గడ్డు కాలాన్ని అధిగమించాలంటే రష్యా ఉద్యోగులు తమ పని గంటలను భారీగా పెంచుకోవాలని, వారానికి 6 రోజులు కష్టపడాలని అన్నారు. రష్యా అంతర్జాతీయ అవకాశాల నుంచి ప్రాంతీయ పరిమితుల వైపు మళు ్లతున్న వేళ.. కష్టపడి పనిచేయటం ఒక్కటే మిగిలిన ఉన్న మార్గమని స్పష్టం చేశారు. రష్యా ఎంత త్వరగా ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల పని వేళలకు అది కూడా సోమవారం నుంచి శనివారం వరకూ పద్దతిలోకి మారితే అంత వేగంగా ఆర్థిక వ్యవస్థ కోలుకుంటుందంటూ డెరిపాస్కా తన టెలిగ్రామ్ పోస్టులో పేర్కొన్నారు. కష్టకాలంలో రష్యన్లు తమ శక్తియుక్తులతో మరింత కష్టపడి పనిచేయడం జాతీయ లక్షణమని గుర్తు చేశారు. ప్రస్తుతం రష్యాపై ఉన్న అంతర్జాతీయ ఆంక్షలు, మారుతున్న వాణిజ్య మార్గాల వల్ల దేశ ఆర్థిక వృద్ధి నెమ్మదించిందని, దీనిని చక్కదిద్దాలంటే ప్రొడక్టివిటీని పెంచక తప్పదంటూ పేర్కొన్నారు. రష్యా ఆర్థిక గణాంకాలను పరిశీలిస్తే పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది. 2024లో 4.3 శాతంగా ఉన్న ఆర్థిక వృద్ధి రేటు, 2025 నాటికి కేవలం 1 శాతానికి పడిపోయింది. రష్యా బడ్జెట్‌లో మూడో వంతు ఆదాయం చమురు, గ్యాస్ ఎగుమతుల నుంచే వస్తుంది. అయితే భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, హార్మూజ్ జలసంధి వంటి కీలక వాణిజ్య మార్గాల్లో అడ్డంకుల వల్ల చమురు సరఫరాకు ఆటంకం కలుగుతోంది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కును దాటి, ఏడాదిలో 70 శాతానికి పైగా పెరగడం రష్యాకు కొంత ఊరటనిచ్చే అంశంగా మారింది. అమెరికా ఆంక్షలతో చానాళ్లుగా తక్కువ రేట్లకు క్రూడ్ అమ్ముకుంటున్న రష్యాకు ప్రస్తుతం పెరిగిన రేట్లు కలిసొస్తున్నాయి. గల్ఫ్ యుద్ధం వేళ అమెరికా కొన్ని రష్యా షిప్‌మెంట్లపై పరిమిత ఆంక్షల మినహాయింపులు ఇవ్వడం వల్ల మార్పులు వస్తున్నాయి. ఇటువంటి అస్థిర పరిస్థితుల్లో రష్యా తన ఆర్థిక పునాదులను పటిష్టం చేసుకోవాలంటే.. ప్రజలు తమ విలాసాలను పక్కనపెట్టి ఎక్కువ పని గంటలకు సిద్ధపడాలని

డెరిపాస్కా సూచిస్తున్నారు. ఈ 12 గంటల షిఫ్ట్ ప్రతిపాదన ఇప్పుడు రష్యా కార్మిక వర్గంలో మరీ ముఖ్యంగా సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఆర్థిక పరివర్తన కోసం ప్రజల వ్యక్తిగత సమయాన్ని త్యాగం చేయాలన్న ఈ పిలుపు ఎంతవరకు సక్సెస్ అవుతుందనేది వేచి చూడాల్సిన విషయమే.

# ఎఫ్‌సిఆర్‌ఎతో మైనారిటీల్లో తీవ్ర భయాందోళనలు !



తిరువనంతపురం : విదేశీ విరాళాల (క్రమబద్ధీకరణ) చట్టానికి తీసుకువచ్చిన ప్రతిపాదిత సవరణల పట్ల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ప్రధాని మోడీకి ఒక లేఖ రాశారు. ఈ చట్టం వల్ల మైనారిటీ కమ్యూనిటీల్లో, మత సంస్థల్లో కేంద్రం భయాందోళనలు సృష్టించిందన్నారు. తక్షణమే కేంద్రం తన వైఖరిని పున: పరిశీలించుకోవాలని, ప్రతిపాదిత సవరణను ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రతిపాదిత సవరణతో కేరళలో తీవ్ర దుమారం రేగింది. కొత్త సవరణల ద్వారా ఎన్‌జిఓలపై, మత సంస్థలపై పూర్తిగా నియంత్రణ

సాధించడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని సిపిఎం తీవ్రంగా విమర్శించింది. అటు కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ కూడా విమర్శలు చేసింది. కేరళలో అనేక చర్చిలు, విద్యా సంస్థలు, చారిటబుల్ ఆస్పత్రులు విదేశీ విరాళాలు అందకుంటూ వుంటాయి. ప్రతిపాదిత సవరణల వల్ల ఆసంస్థల్లో భయం నెలకొంది. చర్చిలు ద్వారా నిర్వహించే తమ ఆస్తులను ప్రభుత్వం లాక్కుంటుందనే ఆందోళన మొదలైంది. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఏదైనా జరిగితే వాటిపై చర్యలు తీసుకునేందుకు అవసరమైన నిబంధనలు ఒరిజినల్ ఎఫ్‌సిఆర్‌ఎలో వున్నాయని విజయన్ ఆ లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా వివిధ మైనారిటీ సంస్థలపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో ఈ మైనారిటీ సంస్థలు, సంఘాలు వ్యక్తం చేసే ఆందోళనలు హేతుబద్ధమైనవేనని, పైగా తీవ్రమైనవని విజయన్ ఆ లేఖలో పేర్కొన్నారు.

## మహిళలకు భద్రత కరువు

న్యూఢిల్లీ : దేశంలో మహిళల భద్రతకు రక్షణ కరువైంది. వారిపై దాడులు, హింస వంటి నేరాలు పెరిగిపోతున్నాయి. ఇందులో అధికంగా వారి భర్తలు, భర్తల కుటుంబ సభ్యుల నుంచే అధికంగా ఉంటున్నాయి. ఈ మేరకు 2024-25 ఏడాదికి సంబంధించి కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ (ఎంహెచ్‌ఎ) శాఖ ఒక నివేదికను విడుదల చేసింది. ఇందులో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఎంహెచ్‌ఎ నివేదిక సమాచారం ప్రకారం.. దేశంలో 2024-25లో మహిళలపై నేరాలు క్రమంగా పెరిగాయి. మహిళలపై 2020లో 3,71,503 ఘటనలు, 2021లో 4,28,278, 2022లో 4,45,278 నేరాలు నమోదయ్యాయి. ఇందులో మెజారిటీ నేరాలు భర్తలు, వారి కుటుంబ సభ్యుల నుంచి జరిగే హింస (31.4 శాతం)కు సంబంధించినవే కావడం గమనార్హం. ఆ తర్వాత స్థానంలో మహిళల కిడ్నాప్, అపహరణ (19.2శాతం), స్త్రీ మర్యాదకు భంగం కలిగించే ఉద్దేశంతో ఆమెపై దాడి (18.7 శాతం), లైంగికదాడులు (7.1 శాతం) వంటి నేరాలు ఉన్నాయి. చాలా మంది మహిళలు హత్య, దొంగతనం, మోసాలకు బాధితులుగా ఉన్నారు. 2020 నుంచి 2021 వరకు మహిళలపై నేరాలు 15 శాతం పెరగగా.. 2021 నుంచి 2022కు నాలుగు శాతం పెరుగుదలను నమోదు చేసింది. 2022 నాటికి ఒక లక్ష మంది మహిళా జనాభాకు గానూ మొత్తం నేరాల రేటు 66.4 శాతంగా ఉంది. అయితే ఇటువంటి నేరాలకు సంబంధించి ఎఫ్‌ఐఆర్‌లను నమోదు చేయడాన్ని పోలీసులకు తప్పనిసరి చేయడం, పోలీసు సిబ్బందిలో అవగాహన పెంపు, విస్తృత అవగాహన కార్యక్రమాలు వంటి చర్యల కారణంగానే ఈ నేరాల నమోదులో పెరుగుదల ధోరణి ప్రధానంగా కనిపిస్తోందని ఎంహెచ్‌ఎ వివరించింది. ఇక చిన్నారులపై నేరాల విషయంలోనూ ఇదే ధోరణి కనిపిస్తోంది. 2020 నుంచి 2022 మధ్య పిల్లలపై నేరాలు పెరిగాయి. 2020లో వీటి సంఖ్య 1,28,531 కాగా.. అది 2021 నాటికి 1,49,404గా, 2022 నాటికి 1,62,449గా నమోదయ్యాయి. వీటిలో అత్యధిక నేరాల వాటా కిడ్నాప్, అపహరణ (45.7 శాతం)లది కావటం గమనార్హం. పోక్సో చట్టం కింద 39 శాతం కేసులు నమోదయ్యాయి. 'జువైనల్ ఇన్ కాన్‌ఫ్లిక్ట్ విత్ లా' కింద 30,555 కేసులలో 37,780 మంది మైనర్లను అదుపులోకి తీసుకున్నట్టు ఎంహెచ్‌ఏ వివరించింది.

## తమిళనాడులో నామినేషన్ల ప్రక్రియ షూరు



చెన్నై : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు రెండో దశకు చేరుకున్నాయి. రాష్ట్రంలో నామినేషన్ల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమయింది. ఏప్రిల్ 23న జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం ఎలక్షన్ కమిషన్ సోమవారం అధికారిక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అర్చన పట్నాయక్ తమిళనాడు ప్రభుత్వ గెజిట్‌లో వెల్లడించారు. ఈ నోటిఫికేషన్ విడుదల కావడంతో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సోమవారం ఉదయం 11 గంటల నుంచే తమ నామినేషన్లను దాఖలు చేసుకోవడానికి అవకాశం లభించింది. సోమవారం ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, టివికె వ్యవస్థాపకులు, నటులు సి జోసెఫ్ విజరు తమ నామినేషన్లను సమర్పించారు. కొలతూర్ నియోజకవర్గం నుంచి స్టాలిన్ నామినేషన్ వేశారు. ఇందుకోసం సోమవార ఉదయం ముందుగా పేపర్ మిల్స్ రోడ్డులో ఉన్న గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్‌కు స్టాలిన్ చేరుకున్నారు. తన అఫిడవిట్‌ను రిటర్నింగ్ ఆఫీసర్ శాంతికి సమర్పించారు. స్టాలిన్ వెంట పార్టీ సీనియర్ నాయకులు

పికె శేకర్ బాబు, కొంతమంది కార్యకర్తలు ఉన్నారు. అనంతరం స్టాలిన్ మీడియాతో మాట్లాడుతూ కొలతూర్ నియోజకవర్గ ప్రజలు తనను నాలుగోసారి కూడా అసెంబ్లీకి పంపుతారనే విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే మరోవైపు సోమవారం విజరు కూడా తన నామినేషన్ సమర్పించారు. పెరంబూర్ నియోజకవర్గం నుంచి విజరు సోమవారం నామినేషన్ వేశారు.

## మోడీ ఆరోపణలు అవాస్తవం

కేరళ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేస్తున్న 'దోపిడీ' ఆరోపణలు అవాస్తవమని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు టి ఎం థామస్ ఐజాక్ అన్నారు. కేరళలోని పతనంతిట్టలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ కేంద్ర పథకాలను అమలు చేయడంలో కేరళ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని అన్నారు. కేరళ పట్ల కేంద్రం చూపుతున్న వివక్షను దాచిపెట్టేందుకు ప్రధానమంత్రి నిస్సిగ్గుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. దేశ ఆర్థిక సంక్షోభానికి మోడీయే కారణమన్న నిజాన్ని ప్రజల నుంచి దాచిపెట్టడానికే ఈ అబద్ధాలని ఆయన విమర్శించారు. జాతీయ రహదారుల అభివృద్ధి, సర్వ శిక్షా అభియాన్, విద్య, ఆరోగ్యం వంటి అనేక రంగాలలో కేరళ కనబరిచిన ప్రతిభకు కేంద్ర ప్రభుత్వమే స్వయంగా అవార్డులు ఇచ్చిందన్నారు. ఒకవైపు గుర్తింపునిస్తూ, మరోవైపు దోపిడీ ఆరోపణలు చేయడం మోడీ ద్వంద్వ వైఖరికి నిదర్శనం అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయడంలో కేరళ దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది. సర్వ శిక్షా అభియాన్ ద్వారా అనేక పాఠశాలలు కేంద్ర అవార్డులను అందుకున్నాయి. ఇందులో దోపిడీ ఎక్కడ జరిగిందో చెప్పాలని ఐజక్ ప్రశ్నించారు. ఇరాన్‌లోని యుద్ధ పరిస్థితిపై భారత్ తీసుకున్న వైఖరి అత్యంత బలహీనంగా ఉంది. మోడీ ప్రభుత్వం విదేశాంగ విధానంలో పూర్తిగా విఫలమైంది. ఎఫ్‌సిఆర్‌ఏ చట్టాన్ని దుర్వినియోగం చేసి కేంద్రం క్రైస్తవ చర్చిలను బెదిరించేందుకు ప్రయత్నిస్తోంది. ఇది రాజ్యాంగ విరుద్ధం, నిరంకుశం.

# సిమ్ బైండింగ్ గడువును పొడిగించే యోచనలో కేంద్రం




కేంద్రం ప్రభుత్వం వాట్సాప్, అరట్టై, టెలిగ్రాం లాంటి మెసేజింగ్ ప్లాట్‌ఫామ్‌లకు తప్పనిసరి సిమ్ బైండింగ్ గడువును పొడిగించే అవకాశం ఉంది. ఈ నిబంధనను పాటించడానికి కంపెనీలకు టెలికమ్యూనికేషన్స్ విభాగం (డీఓటీ) ఈ ఏడాది డిసెంబర్ వరకు గడువు ఇవ్వాలని అధికారులు వెల్లడించినట్టు జాతీయ మీడియా పేర్కొంది. ప్రధానంగా కంపెనీల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించిన ప్రభుత్వం, ఈ మేరకు గడువు పెంపునకు సానుకూలంగా ఉన్నట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించి అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. 2025, నవంబర్‌లో కేంద్రం ఈ నిబంధనలు ప్రకటించింది. వీటి అమలు కోసం కంపెనీలకు మూడు నెలలు(90 రోజుల) గడువు ఇచ్చింది. అయితే, ఈ నిబంధనలు అమలులో సాంకేతికంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, టెస్టింగ్, ఓఎస్ అప్‌డేట్ లాంటి సవాళ్లు ఉన్నాయని కంపెనీలు స్పష్టం చేశాయి. వీటిని పరిష్కరించి నిబంధనల అమలుకు ఇంకా సమయం కావాలని కేంద్రానికి వివరించాయి.

సిమ్ బైండింగ్ అనేది సిమ్ కార్డు ఉంటేనే వాట్సాప్, టెలిగ్రాం లాంటి యాప్స్ మొబైల్‌ఫోన్లలో పని చేసే విధానం. అంటే యూజర్ తాను వాడే ఫోన్‌లో రిజిస్టర్ చేసిన సిమ్ కార్డు ఉంటేనే ఆయా యాప్‌ల అకౌంట్లను యాక్సెస్ చేసే వీలుంటుంది. మరోవైపు, దేశంలో పెరుగుతున్న డిజిటల్ అరెస్టులు, పెట్టుబడి మోసాలకు చెక్ పెడుతూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ(ఎంహెచ్‌ఏ) 2025 ప్రారంభం నుంచి ఇప్పటివరకు 3,962 స్కైప్ ఐడీలను, 83,867 వాట్సాప్ ఖాతాలను బ్లాక్ చేసింది. అలాగే, మొబైల్, నెట్‌వర్క్ భద్రతను పెంచుతూ నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ) వ్యవస్థ ద్వారా గుర్తించిన 8.45 లక్షల సిమ్ కార్డులను, 2.39 లక్షల మొబైల్ ఐఎంఈఐ నంబర్లను అధికారులు బ్లాక్ చేశారు.

# అత్యంత అధ్వాన స్థితిలోకి రూపాయి

ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో రూపాయి పతనం రోజుకో నూతన రికార్డు కనిష్టాన్ని సృష్టిస్తుంది. అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి మారకం విలువ భారత చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా డాలర్‌తో పోల్చితే 95 మార్క్‌ను దాటి అత్యంత అధ్వానస్థితికి పడిపోయింది. సోమవారం ఫారెక్స్ మార్కెట్‌లో 93.62 వద్ద రూపాయి విలువ తెరుచుకుంది. ఆ తర్వాత 165 పైసలు పతనమై 95.20 కనిష్టం వద్ద నమోదయ్యింది. తుదకు 94.78 వద్ద ముగిసింది. ఆర్థిక సంవత్సరం 2025-26లో రూపాయి విలువ ఏకంగా 10 శాతం పైగా పడిపోయింది. ఫిబ్రవరిలో 90.98 వద్ద ఉన్న రూపాయి.. ప్రస్తుతం 95 స్థాయిని తాకి నూతన కనిష్టానికి పడిపోయింది.దీంతో రూపాయి పతనాన్ని అడ్డుకోవడంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బీజేపీ సర్కార్ విఫలమయ్యాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.భారత కరెన్సీ ఇదే స్థాయిలో పడిపోతుంటే త్వరలోనే 100 మార్కుకు చేరొచ్చని అంచనాలు పెరుగుతున్నాయి. ముడి చమురు ధర బ్యారెల్‌కు 120 డాలర్లు దాటితే రూపాయిపై మరింత ఒత్తిడి పెరుగుతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. భారత దిగుమతి బిల్లులు పెరగడంతో పాటుగా భారత మార్కెట్ల నుండి విదేశీ పెట్టుబడిదారులు తమ నిధులను వెనక్కి తీసుకోవడం రూపాయిని బలహీనపరుస్తోంది. భారత కరెన్సీ పతనం ఇలాగే కొనసాగితే పెట్టుబడిదారులలో అభద్రతా భావం పెరిగి మార్కెట్లలో మరింత అస్థిరత ఏర్పడే ప్రమాదం ఉంది. 2025-26 ఆర్థికసంవత్సరపు చివరిరోజైన సోమవారం నాడు కూడా మార్కెట్‌ను యుద్ధభయం వెంటాడింది.



ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందన్న వార్తలతో పాటు, అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలు మార్కెట్ సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. దీంతో సెన్సెక్స్ 1600 పాయింట్లకు పైగా నష్టపోగా, నిఫ్టీ 22,350 పాయింట్లకు దిగువన నష్టపోయింది. మొత్తంమీద 9లక్షల కోట్ల ముదుపర్ల సంపద ఒక్కరోజులోనే ఆవిరైంది.

# దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ డౌన్ : అన్ని నగరాల్లోనూ తగ్గిన ఇళ్ల అమ్మకాలు





భారత రియల్ ఎస్టేట్ రంగంలో గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న జోరుకు బ్రేకులు పడ్డాయి. గడిచిన 18 త్రైమాసికాల్లో ఎప్పుడూ లేని విధంగా.. 2026 జనవరి-మార్చి కాలంలో దేశంలోని టాప్-9 నగరాల్లో ఇళ్ల అమ్మకాలు లక్ష యూనిట్ల కంటే దిగువకు పడిపోయాయి. ఇళ్ల అమ్మకాలు గతేడాదితో పోలిస్తే 13 శాతం క్షీణించి 98,761 యూనిట్లకు పరిమితమయ్యాయని ప్రముఖ రియల్ ఎస్టేట్ అనలిటిక్స్ ప్లాట్‌ఫామ్ ప్రాప్‌ఈక్విటీ డేటా వెల్లడించింది.

**రియల్ ఎస్టేట్ మార్కెట్ మందగమనానికి కారణాలేంటి?**

ఈ తగ్గుదల కేవలం డిమాండ్ లేకపోవడం వల్ల కాదంటున్నారు విశ్లేషకులు. ప్రధానంగా సప్లై కొరత అమ్మకాలు తగ్గటానికి కారణమని రిపోర్ట్ చెబుతోంది. కొత్త ప్రాజెక్టుల లాంచ్‌లు గతేడాదితో పోలిస్తే 19 శాతం తగ్గి 92,411 యూనిట్లకు పడిపోయాయి. అంటే కొనేవారు ఉన్నా.. మార్కెట్లోకి కొత్త ఇళ్ల ప్రాజెక్టులు రాకపోవటం వల్ల అమ్మకాలు తగ్గాయి. అయితే ఈ గందరగోళంలోనూ బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్ నగరాలు మాత్రం పాజిటివ్ గ్రోత్‌తో దూసుకుపోతున్నాయి. బెంగళూరు 17,991 యూనిట్లతో దేశంలోనే టాప్ సేల్లింగ్ మార్కెట్‌గా నిలిచింది.

**హైదరాబాద్ రియల్టీ పరిస్థితి ఏమిటి?**

భాగ్యనగరంలో రియల్ ఎస్టేట్ పరిస్థితి ప్రస్తుతం ఆందోళనకరంగా ఉంది. హైదరాబాద్‌లో ఇళ్ల విక్రయాలు గతేడాది ఇదే సమయంతో పోలిస్తే 16 శాతం తగ్గాయి. కొత్త లాంచ్‌ల విషయంలోనూ హైదరాబాద్ రెండంకెల వృద్ధి పతనాన్ని నమోదు చేసి రియల్టర్లకు ఆందోళన కలిగిస్తోంది. ప్రధానంగా హైదరాబాద్‌లో ప్లాట్లు, ఫ్లాట్ల ధరలు విపరీతంగా పెరగడం వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలు కొనుగోలుకు వెనుకాడుతున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత హెచ్‌ఎండీఏ అనుమతుల్లో వేగం పెరిగినప్పటికీ.. పాత స్టాక్ ఇంకా క్లియర్ కాకపోవడంతో బిల్డర్లు కొత్త ప్రాజెక్టులను ప్రారంభించడానికి వెనుకాడుతున్నారట. దీనికి తోడు ఐటీ కంపెనీల్లో హైరింగ్ తగ్గడం, లేఆఫ్స్ భయాలు హైదరాబాద్ వంటి ఐటీ హబ్‌లో ఇన్వెస్ట్ చేసేవారిని ఆలోచనలో పడేశాయి.

**భవిష్యత్తు ఎలా ఉండబోతోంది?**

ముంబై, పూణె, థానే వంటి నగరాల్లో అమ్మకాలు భారీగా పడిపోయాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో మాత్రం సప్లై 89 శాతం పెరిగింది. మొత్తం మీద భారత రియల్ ఎస్టేట్ మార్కెట్ ఇప్పుడు కన్సాలిడేషన్ దశలోకి ఎంటర్ అయ్యిందని అనలిస్టులు చెబుతున్నారు. అంటే ధరలు స్థిరపడి, కొత్త ప్రాజెక్టులు మార్కెట్లోకి వస్తే తప్ప మళ్లీ అమ్మకాలు పెరగవని వారు అంటున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్న డబ్బు ఇన్వెస్ట్ చేయాలనుకునే వారు ఇప్పుడు ఆచితూచి అడుగు వేయడం అవసరమని హెచ్చరిస్తున్నారు.

# ఇరాక్‌కు కృతజ్ఞతలు: మొజ్తాబా ఖమేనీ

ఇరాన్‌పై జరిగిన దాడులకు వ్యతిరేకంగా మద్దతు ఇచ్చినందుకు ఇరాక్ ప్రజలకు, మత నాయకత్వానికి ఇరాన్ సర్వోన్నత నాయకుడు మొజ్తాబా ఖమేనీ కృతజ్ఞతలు తెలుపుతూ ఒక సందేశం పంపారు. ఈ వార్తను ఇరాన్ ప్రభుత్వ మీడియా నివేదించింది, కానీ ఆ సందేశం ఏ రూపంలో పంపబడిందో స్పష్టంగా పేర్కొనలేదు. మాజీ సర్వోన్నత నాయకుడు అయతోల్లా అలీ ఖమేనీ హత్య తర్వాత అధికారం చేపట్టిన మొజ్తబా హత్యకు గురయ్యారని అమెరికా ఆరోపిస్తున్న నేపథ్యంలో ఈ కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. బాగ్దాద్‌లోని ఇరాన్ రాయబారికి, ఇరాక్‌లోని ఇస్లామిక్ సుప్రీం కౌన్సిల్‌కు మధ్య జరిగిన సమావేశం అనంతరం ఈ సందేశం విడుదలైంది.ఇదిలా ఉండగా, మొజ్తబా ఖమేనీ ఆరోగ్యం, ఆయన బతికే ఉన్నారా లేదా అనే దానిపై ప్రపంచవ్యాప్తంగా చర్చలు తీవ్రమవుతున్నాయి. దాడులు జరిగినప్పటి నుండి మొజ్తబా ఇంకా బహిరంగంగా కనిపించకపోవడం అనుమానాలను మరింత పెంచుతోంది. కొత్త సర్వోన్నత నాయకుడు హత్యకు గురయ్యారని లేదా విషమ పరిస్థితిలో ఉన్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొన్న ఆరోపించారు. ప్రస్తుతం ప్రభుత్వ మీడియా ద్వారా కేవలం లిఖితపూర్వక

ప్రకటనలు మాత్రమే విడుదలవుతున్నాయి. ఫిబ్రవరి 28న జరిగిన సైనిక చర్యలో అలీ ఖమేనీ హతమయ్యారు. దేశం ఒక పెద్ద రాజకీయ సంక్షోభంలో ఉన్న సమయంలో ఆయన కుమారుడు ఆయన వారసుడిగా బాధ్యతలు స్వీకరించారు. మార్చి 9న మొజ్తబా సుప్రీం లీడర్‌గా ఆమోదం పొందారు. మార్చి 11న జరిగిన దాడిలో ఆయన హతమయ్యారని అమెరికా వాదిస్తోంది.

## నా రాజీనామాతో బ్యాంక్ విలువ తగ్గలేదు!



తాను రాజీనామా చేసి బ్యాంక్ నుంచి బయటకు రావడంతోనే, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ విలువ క్షీణించిందనే వాదనను ఖండిస్తున్నానని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తాజా మాజీ ఛైర్మన్ అతాను చక్రవర్తి వెల్లడించారు. నైతిక విలువలు, సూత్రాల విషయంలో ఏకాభిప్రాయం లేకపోవడంతోనే రాజీనామా చేశానని తెలిపారు. 'నేను బహిరంగంగా అందుబాటులో ఉన్న విషయాలను మాత్రమే ప్రస్తావించాను. ఎవరైనా నా లేఖకు సంబంధించి 'అపవాదు' అనే పదాన్ని వాడుతుంటే, వారు నిఘంటువు చదవాల'ని వెల్లడించారు. స్వతంత్ర డైరెక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎలాంటి పరోక్ష ఆరోపణలు చేయకూడదని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఛైర్మన్ తుహిన్‌కాంత పాండే చెప్పిన కొద్దిరోజులకే చక్రవర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఈఓ శశిధర్ జగదీశన్‌తో ఉన్న 'అధికార పోరాటం' వల్లే తాను రాజీనామా చేశానన్న వార్త గురించీ చక్రవర్తి మాట్లాడారు. జగదీశన్ పదవీకాలాన్ని పొడిగించడాన్ని చక్రవర్తి వ్యతిరేకించినా, బోర్డులోని మెజార్టీ సభ్యులు దానికి అనుకూలంగా ఉండటం చక్రవర్తికి నచ్చలేదని ఆ వార్తలో ప్రస్తావించారు. జగదీశన్ పునఃనియామక విషయం, ఆయన పనితీరును గానీ లేదా ఏవైనా సమస్యలను గానీ పరిశీలించడానికి బోర్డు ముందుకు రాలేదని, అసలు చర్చ కూడా జరగని విషయంపై విభేదాలు ఎలా ఉంటాయని ప్రశ్నించారు.

## ఏటీఎం వినియోగంపై పరిమితులు



కొత్త ఆర్థిక సంవత్సరం (2026-27) బుధవారం నుంచి ప్రారంభం కాబోతోంది. ఈ నేపథ్యంలో బ్యాంకింగ్ నిబంధనల్లో మార్పులు చోటు చేసుకోనున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)తో పాటు, పలు బ్యాంకులు తమ ఖాతాదారుల లావాదేవీల నియమాలను సవరిస్తున్నాయి.యూపీఐతో తీసుకున్నా: ఇప్పటివరకూ ఏటీఎంలలో కార్డు లేకుండా, యూపీఐ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి నగదు ఉపసంహరించుకునే వెసులుబాటును వినియోగదారులు ఉచితంగా లేదా అదనపు లావాదేవీగా వాడుకునే వారు. ఏప్రిల్ 1 నుంచి దీనికి అడ్డుకట్ట పడనుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహా పలు బ్యాంకులు ఇకపై ఏటీఎంలలో చేసే యూపీఐ ఆధారిత నగదు ఉపసంహరణలనూ, నెలవారీ ఉచిత ఏటీఎం లావాదేవీలుగానే పరిగణించనున్నాయి. ఉచిత లావాదేవీల పరిమితి ముగిశాక.. యూపీఐ ద్వారా చేసే ప్రతి ఉపసంహరణపైనా రూ.23తో పాటు అదనంగా పన్నులు చెల్లించాల్సిందే. ఎంపిక చేసిన డెబిట్ కార్డులపై రోజువారీ ఏటీఎం నగదు ఉపసంహరణ పరిమితులను పంజాబ్ నేషనల్ బ్యాంక్ సగానికి తగ్గించింది. చాలా కార్డులకు రోజువారీ పరిమితిని రూ.1,00,000 నుంచి రూ.50,000 చేసింది. బంధన్ బ్యాంక్ ఖాతాదారులు తమ సొంత ఏటీఎంలలో నెలకు 5 సార్లు ఉచిత ఆర్థిక లావాదేవీలు చేసుకోవచ్చు. ఇతర బ్యాంకుల ఏటీఎంలను వాడితే మెట్రో నగరాల్లో 3 లావాదేవీలు మాత్రమే ఉచితం. పరిమితి దాటితే, ప్రతి లావాదేవీకి రూ.10 రుసుము పడుతుంది.

## భెల్‌కు రూ.13,500 కోట్ల భారీ ప్రాజెక్ట్




విద్యుత్ ఉత్పత్తి ఉపకరణాల సంస్థ భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్)కు తెలంగాణలో భారీ ప్రాజెక్టు దక్కింది. పెద్దపల్లి జిల్లాలో ఏర్పాటు చేయనున్న 3ఇ800 మెగావాట్ల సామర్థ్యం గల స్టేజ్2 సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ అభివృద్ధి కోసం ఎన్‌టిపిసి లిమిటెడ్ నుండి సుమారు రూ.13,500 కోట్ల భారీ ఆర్డర్‌ను పొందింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నోటిఫికేషన్ ఆఫ్ అవార్డ్ (ఎఒఎ)ను మార్చి 29న అందుకుంది. ఈ వివరాలను సోమవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించారు. ఈ కాంట్రాక్టులో భాగంగా బాయిలర్, టర్బైన్, జనరేటర్ (బిటిజి)ల రూపకల్పన, తయారీ, సరఫరా, స్థాపనతో పాటు సివిల్, స్ట్రక్చరల్ పనులను కూడా భెల్ చేపట్టనుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును అవార్డు అందిన తేదీ నుండి 62 నెలల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది.

## మెరిసిన పసిడి.. వెలవెలబోయిన వెండి




పసిడి ప్రియులు, కొనుగోలుదారులకు బంగారం ధర షాకిచ్చింది. మంగళవారం ఉదయం బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1030 పెరిగి రూ.1,49,290కి చేరింది. అలాగే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.950 పెరిగి రూ.1,36,850కి చేరింది. మున్ముందు పెళ్లిళ్లు చేసుకునే జంటలు బంగారం కొనుగోలు చేయాలంటే కాస్త ఎక్కువ ఖర్చు చేయాల్సిన పరిస్థితే నెలకొంది. కాగా.. వెండి ధర మాత్రం కాస్త రిలీఫ్ ఇచ్చింది. కిలో వెండిపై రూ.5000 తగ్గింది. ప్రస్తుతం వెండి ధర రూ.2,50,000గా ఉంది. సాధారణంగా డాలర్ పెరిగితే బంగారం తగ్గాలి, కానీ ఈరోజు (మార్చి 31, 2026) పరిస్థితి వేరుగా ఉంది. నిన్న డాలర్ విలువ 95 రూపాయలకు పైగానే ట్రేడ్ అయిన విషయం తెలిసిందే. ఈరోజు బంగారం ధర తగ్గుతుందని భావించిన వారికి షాక్ తగిలినట్లైంది. ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో (ముఖ్యంగా అమెరికా-ఇరాన్ మధ్య) నెలకొన్న యుద్ధ వాతావరణం, ఉద్రిక్తతలు పెట్టుబడిదారులను భయపెడుతున్నాయి. ఇటువంటి అస్థిర పరిస్థితుల్లో షేర్లు, కరెన్సీల కంటే బంగారం సురక్షితమైనది (రాజీటవ ఊజీలవని) అని భావిస్తారు. అందుకే డాలర్ పెరిగినా, ప్రపంచవ్యాప్తంగా అందరూ బంగారాన్ని కొనడం వల్ల డిమాండ్ పెరిగి ధర పెరిగింది.

## క్యాన్సర్ రోగికి ఇమ్యునోథెరపీ దివ్యౌషధం



ఈనాటికీ, క్యాన్సర్ అనే మాట వినగానే జనం భయానికి గురవుతారు. చికిత్స, కోలుకోవడం రెండింటిపైనా ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇటీవలి సంవత్సరాలలో, క్యాన్సర్ చికిత్స కోసం ఇమ్యునోథెరపీని ఉపయోగిస్తున్నారు. దీని ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయంటున్నారు వైద్యులు. ఈ విధానంలో క్యాన్సర్ కణాలతో పోరాడటానికి శరీరం రోగనిరోధక వ్యవస్థను సిద్ధం చేస్తారు. రోగనిరోధక వ్యవస్థ క్యాన్సర్ కణాలను గుర్తించి నాశనం చేస్తుంది. ఈ చికిత్స అనేది శరీరం రోగనిరోధక వ్యవస్థను ఉపయోగించి క్యాన్సర్‌తో పోరాడే ఒక పద్ధతి. రోగనిరోధక వ్యవస్థ మనల్ని రక్షించడానికి పనిచేస్తుంది. కానీ క్యాన్సర్ కణాలు తరచుగా ఈ వ్యవస్థ నుండి తప్పించుకుని క్రమంగా వ్యాపించడం ప్రారంభిస్తాయి. ఇక్కడే ఇమ్యునోథెరపీ పాత్ర మొదలవుతుంది. న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌కు చెందిన మెడికల్ ఆంకాలజీ విభాగం ఎండి డాక్టర్ అరవింద్ కుమార్, ఇమ్యునోథెరపీ అనేది క్యాన్సర్ కణాలను గుర్తిస్తుంది. వాటిని నాశనం చేయడానికి శరీరం రోగనిరోధక కణాలకు శిక్షణ ఇస్తుందని వివరిస్తున్నారు. గతంలో కీమోథెరపీ, రేడియేషన్ అనేవి క్యాన్సర్ చికిత్సకు ప్రధాన పద్ధతులుగా ఉండేవి. ఈ పద్ధతులు నేటికీ ముఖ్యమైనవే, కానీ వాటికి అనేక దుష్ప్రభావాలు కూడా ఉన్నాయి. ఇవి రోగులకు చాలా ఇబ్బందికరంగా ఉంటాయంటున్నారు డాక్టర్ అరవింద్. సాధారణ కీమోథెరపీ క్యాన్సర్ కణాలపై మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన కణాలపై కూడా దాడి చేస్తుంది., దీనివల్ల జుట్టు రాలడం, అలసట, నీరసం వంటి అనేక దుష్ప్రభావాలు కలుగుతాయి. అయితే, ఇమ్యునోథెరపీ కేవలం క్యాన్సర్ కణాలపై మాత్రమే దాడి చేస్తుంది. దీనికి తీవ్రమైన దుష్ప్రభావాలు ఉండవు. గతంలో చికిత్స చేయడం కష్టంగా ఉన్న ఊపిరితిత్తుల క్యాన్సర్, మూత్రపిండాల క్యాన్సర్, మెలనోమా వంటి కేసులలో ఇమ్యునోథెరపీ చాలా ప్రయోజనకరంగా నిరూపించబడిందంటున్నారు వైద్య నిపుణులు. ఈ చికిత్స ప్రతి క్యాన్సర్ రోగికి సమానంగా ప్రభావవంతంగా ఉండదని డాక్టర్ అరవింద్ వివరిస్తున్నారు. కొంతమంది రోగులు అత్యంత సానుకూల ఫలితాలను పొందుతుండగా, మరికొందరు పరిమిత ప్రభావాన్ని మాత్రమే అనుభవించవచ్చు. అందువల్ల, వైద్యులు రోగి పరిస్థితి, క్యాన్సర్ రకం, దశ ఆధారంగా తగిన నిర్ణయాలు తీసుకుంటారు. ఇమ్యునోథెరపీ కేవలం ఒక చికిత్స మాత్రమే కాదు, ఇది భవిష్యత్ అవకాశాలను కూడా సూచిస్తుంది. పరిశోధన కొనసాగుతోంది. శాస్త్రవేత్తలు కొత్త మందులు, పద్ధతులను అభివృద్ధి చేస్తున్నారు.

## వాకింగ్ చేయకుండానే బరువు తగ్గాలా!



డైటింగ్, వాకింగ్ అవసరం లేకుండానే బరువు తగ్గాలనుకునే వారికి సామల గంజి చక్కటి పరిష్కారం. ప్రోటీన్లతో నిండిన ఈ చిరుధాన్యం, రాత్రిపూట తీసుకోవడం ద్వారా ఆకలిని నియంత్రించి, కేవలం పది రోజుల్లోనే బరువు తగ్గడంలో సహాయపడుతుంది. సామలను నానబెట్టి, ఉప్పు, జీలకర్ర, కొత్తిమీర, మిరియాల పొడితో వండుకుని రుచికరంగా తీసుకోవచ్చు. బరువు తగ్గాలనుకునే చాలామందికి డైటింగ్ నియమాలు, శారీరక శ్రమ లేకుండానే ఫలితాలు సాధించాలనే కోరిక ఉంటుంది. అలాంటి వారి కోసం సామల గంజి ఒక సమర్థవంతమైన, సులభమైన పరిష్కారంగా నిలుస్తుంది. ఇది కేవలం బరువు తగ్గడానికి మాత్రమే కాకుండా, శరీరానికి అవసరమైన ప్రోటీన్లను అందించడానికి కూడా దోహదపడుతుంది. సామలు, చిరుధాన్యాల కోవకు చెందినవి, బరువు తగ్గడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ చిరుధాన్యాన్ని వ్యక్తిగతంగా 45 రోజులు తీసుకోవడం ద్వారా గణనీయమైన బరువు తగ్గిన అనుభవం ఉందని నిపుణులు చెబుతున్నారు. సామల గంజి తయారీ, వినియోగ పద్ధతి ఇక్కడ తెలుసుకోండి. నానబెట్టడం: ఒక పెద్ద గ్లాసు సామలను శుభ్రంగా కడిగి, రెండు గ్లాసుల నీటిలో కనీసం మూడు నుండి గరిష్టంగా ఎనిమిది గంటల పాటు నానబెట్టాలి. చిరుధాన్యాలను నానబెట్టకుండా ఉపయోగించకూడదు.

వంట: నానబెట్టిన సామలను అదే నీటితో అధిక మంటపై ఉడికించుకోవాలి. రుచి కోసం: తగినంత ఉప్పు వేసి, బాగా ఉడికించుకోవాలి. రుచి కోసం జీలకర్ర వేసి ఉడికించడం వల్ల గంజికి మంచి సువాసన వస్తుంది. అదనపు పదార్థాలు: క్యారెట్, బీట్రూట్, బీన్స్, పచ్చిమిరపకాయలు, ఉల్లిపాయలు లాంటి కూరగాయలను చేర్చుకోవడం వల్ల పోషక విలువలు పెరిగి, గంజి మరింత రుచిగా మారుతుంది. కూరగాయలను నేరుగా గంజితో పాటు ఉడికించుకోవచ్చు లేదా విడిగా ఉడికించి తర్వాత కలపవచ్చు. చివరిగా: గంజి బాగా ఉడికిన తర్వాత, కొత్తిమీరను తప్పనిసరిగా వేసుకోవాలి. కావాలనుకుంటే కొద్దిగా అల్లం కూడా జోడించవచ్చు. చివరగా, స్టవ్ ఆపివేయడానికి ముందు అర టీస్పూన్ లేదా కొద్దిగా ఎక్కువ మిరియాల పొడినిచేర్చి బాగా కలపాలి. దీంతో వేడి వేడి సామల గంజి సిద్ధంగా ఉంటుంది. వంట సమయం సుమారు 10–12 నిమిషాలు పడుతుంది. ఎక్కువసేపు నానబెడితే వంట సమయం తగ్గుతుంది. ఎప్పుడు తీసుకోవాలి: బరువు తగ్గాలనే లక్ష్యం ఉన్నవారు రాత్రిపూట 7:30 లోపు ఈ సామల గంజిని తీసుకోవాలి. కూరగాయలు కలిపి ఒక కప్పు నిండా తీసుకుంటే ఆకలి వేయకుండా ఉంటుంది. పది రోజుల్లోనే అద్భుతమైన ఫలితాలను గమనించవచ్చని పలువురు పేర్కొంటున్నారు. ఒకవేళ రాత్రి పూట మళ్ళీ ఆకలి అనిపిస్తే, నిద్రపోయే ముందు మజ్జిగ తాగవచ్చు. మజ్జిగ, పల్చటి సాంబార్ లేదా ఇంట్లో మిగిలిన కూరలను కూడా 7:30 లోపు తీసుకోవడం వల్ల బరువు తగ్గుతారని చెబుతారు. ఈ సామల గంజి సాధారణ బరువు తగ్గించే పద్ధతులతో పాటు ప్రోటీన్లను అందిస్తుంది.

## కొబ్బరినీళ్లు, ఉసిరి రసం.. శరీరానికి ఎక్కువ చల్లదనాన్ని ఇస్తుంది

ఆయుర్వేదం ప్రకారం, కొబ్బరినీళ్లు మరియు ఉసిరి రసం రెండూ కూడా శరీర ఉష్ణోగ్రతను తగ్గించే గుణాలను కలిగి ఉన్నాయి. కానీ, వీటి పనితీరులో కొంత వ్యత్యాసం ఉంటుంది. ఎండలో తిరిగి వచ్చినప్పుడు మన శరీరానికి తక్షణమే హైడ్రేషన్ అవసరం. ఎండ నుండి వచ్చి వెంటనే చల్లదనాన్ని కోరుకుంటే కొబ్బరినీళ్లే ఉత్తమం. ఎందుకంటే ఇవి శరీరంలోని నీటి శాతాన్ని వేగంగా భర్తీ చేస్తాయి. అదే ఉసిరి రసం అయితే శరీర అంతర్గత ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడానికి కొంత సమయం తీసుకుంటుంది. వేసవి కాలం వచ్చిందంటే చాలు.. భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుంటాడు. మాడు పగిలే ఎండల వల్ల శరీరం త్వరగా వేడెక్కి, నీరసం మరియు డీహైడ్రేషన్ వంటి సమస్యలు తలెత్తుతాయి. ఈ ఉష్ణోగ్రతల నుండి ఉపశమనం పొందడానికి మనం రకరకాల పానీయాలను ఆశ్రయిస్తుంటాం. ముఖ్యంగా కొబ్బరినీళ్లు, ఉసిరి రసం శరీరానికి చల్లదనాన్ని ఇస్తాయని మనకు తెలుసు. అయితే, ఈ రెండింటిలో ఏది ఉత్తమం? ఏది వేగంగా ఫలితాన్ని ఇస్తుంది? కొబ్బరినీళ్లలో 95.5 శాతం నీరు ఉంటుంది. ఇందులో పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం, విటమిన్ బి కాంప్లెక్స్ మరియు సి వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఎండలో ఎక్కువసేపు తిరిగిన తర్వాత కొబ్బరినీళ్లు తాగితే, శరీర ఉష్ణోగ్రత వెంటనే తగ్గుతుంది. ఇందులో ఉండే పొటాషియం వంటి ఎలక్ట్రోలైట్స్ శరీరానికి కావాల్సిన హైడ్రేషన్‌ను తక్షణమే అందిస్తాయి. అందుకే డీహైడ్రేషన్ బారిన పడిన వారికి ఇది మొదటి ఎంపిక. ఉసిరిలో విటమిన్ సి అపారంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. ఉసిరి రసం తాగిన వెంటనే శరీరం చల్లబడదు. ఇది క్రమంగా శరీర వేడిని నియంత్రిస్తుంది.ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఉసిరి రసం తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా దీర్ఘకాలికంగా శరీరం వేడెక్కకుండా ఉంటుంది

# కొబ్బరి చిప్పలు పారేస్తున్నారా?



మీ ఇంటి బాల్కనీని లేదా చిన్న ఖాళీ ప్రదేశాన్ని ఒక అందమైన మినీ గార్డెన్‌లా మార్చుకోవాలని ఉందా? అందుకు వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. సాధారణంగా మనం వంటింట్లో వాడి పారేసే కొబ్బరి చిప్పలతో అద్భుతమైన హ్యాంగింగ్ ప్లాంటర్లను తయారు చేసుకోవచ్చు. ఇవి చూడటానికి సహజంగా ఉండటమే కాకుండా, మొక్కల వేర్లు కుళ్ళిపోకుండా కాపాడతాయి. కొబ్బరి చిప్పలు సహజసిద్ధమైనవి మరియు పర్యావరణానికి మేలు చేసేవి. వీటిలో నీరు నిల్వ ఉండదు కాబట్టి మొక్కల వేర్లు ఆరోగ్యంగా ఉంటాయి. కొంచెం సృజనాత్మకతను జోడిస్తే, ఈ వ్యర్థాలే మీ బాల్కనీలో అందమైన అలంకరణ వస్తువులుగా మారుతాయి. పర్యావరణాన్ని కాపాడుతూ, మన ఇంటిని అందంగా మార్చుకోవడానికి కొబ్బరి చిప్పలు ఒక గొప్ప సాధనం. వంటింట్లో మిగిలిపోయిన చిప్పలను శుభ్రం చేసి, అడుగున ఒక చిన్న రంధ్రం చేసి, కొంచెం మట్టి వేసి మొక్కలను నాటండి. మీ ఇంటికి వచ్చే అతిథులు మీ సృజనాత్మకతను చూసి మురిసిపోవడం ఖాయం! మనీ ప్లాంట్ : హ్యాంగింగ్ ప్లాంట్స్‌లో మనీ ప్లాంట్ అత్యంత ప్రజాదరణ పొందినది. ఇది చాలా తక్కువ సంరక్షణతో వేగంగా పెరుగుతుంది. కొబ్బరి చిప్పలో దీనిని నాటినప్పుడు, దాని తీగలు కిందికి వేలాడుతూ బాల్కనీకి పచ్చని రూపాన్ని ఇస్తాయి. దీనికి తక్కువ నీరు, ఒక మోస్తరు ఎండ ఉంటే సరిపోతుంది. స్పైడర్ ప్లాంట్ : పొడవైన, సన్నని ఆకులతో ఉండే స్పైడర్ ప్లాంట్ కొబ్బరి చిప్పలకు పర్ఫెక్ట్ మ్యాచ్. ఇది చూడటానికి అందంగా ఉండటమే కాకుండా, గాలిని శుద్ధి చేసే గుణాన్ని కూడా కలిగి ఉంటుంది. దీని తీగలు కిందికి వేలాడుతూ చిన్న చిన్న మొక్కలను ఉత్పత్తి చేస్తాయి. పోథోస్ : ఇది చూడటానికి మనీ ప్లాంట్ లాగే ఉన్నా, దీని ఆకులపై ఉండే రంగులు, డిజైన్లు భిన్నంగా ఉంటాయి. తక్కువ వెలుతురు ఉన్న ప్రదేశాల్లో కూడా ఇది అద్భుతంగా పెరుగుతుంది. బాల్కనీ గ్రిల్స్‌కు లేదా హుక్స్‌కు తగిలించడానికి ఇది సరైన ఎంపిక. ఇంగ్లీష్ ఐవీ : క్లాసిక్ గార్డెన్ లుక్ కావాలనుకునే వారు ఇంగ్లీష్ ఐవీని ఎంచుకోవచ్చు. దీని తీగలు గుబురుగా, కిందకు జాలువారుతూ బాల్కనీని అడవిలోని ఒక అందమైన కోణంలో చూపిస్తాయి. ఇది మీ ఇంటికి ఒక విదేశీ గార్డెన్ అనుభూతిని ఇస్తుంది. పోర్టులాకా : మీకు పూల మొక్కలంటే ఇష్టమా? అయితే పోర్టులాకాను ఎంచుకోండి. వివిధ రంగుల్లో పూసే దీని పూలు బాల్కనీని రంగురంగులమయం చేస్తాయి. కొబ్బరి చిప్పల్లో దీని వేర్లు త్వరగా నాటుకుంటాయి. దీనికి కొంచెం ఎండ ఎక్కువగా ఉంటే పూలు బాగా పూస్తాయి.

# సమ్మర్ హీట్ నుంచి ఉపశమనం కోసం



చెరుకురసం అంటేనే వేసవిలో ఒక అమృతం. తక్షణ శక్తిని ఇవ్వడంలో దీనికి సాటి లేదు. అదే రసంతో ఐస్‌క్రీమ్ చేస్తే.. ఆ చల్లదనం, తీపిదనం కలిపి ఇచ్చే కిక్కే వేరు. బయట దొరికే ఐస్‌క్రీమ్స్ లో ప్రిజర్వేటివ్స్ ఉంటాయి, కానీ మనం ఇంట్లో చేసుకునే ఈ వెరైటీ ఐస్‌క్రీమ్ ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. బయట అడుగుపెడితే చాలు, భానుడి భగభగలకు జనం అల్లాడిపోతున్నారు. ఈ వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి మనం రకరకాల శీతల పానీయాలు, ఐస్‌క్రీమ్‌లను ఆశ్రయిస్తుంటాం. అయితే, ఎప్పుడూ తినే వెనిలా, చాక్లెట్ ఫ్లేవర్లు బోర్ కొట్టాయా? అయితే ఈసారి కొత్తగా, స్వచ్ఛమైన ప్రకృతి సిద్ధమైన 'చెరుకురసం ఐస్‌క్రీమ్' ప్రయత్నించండి. వినడానికే వింతగా ఉన్నా, దీని రుచి మాత్రం అద్భుతం.

కావలసిన పదార్థాలు: తాజా చెరుకురసం: 2 కప్పులు (మార్కెట్ నుండి తెచ్చిన వెంటనే వాడటం ఉత్తమం)/ఫ్రెష్ క్రీమ్ లేదా విప్పింగ్ క్రీమ్: 1 కప్పు/కండెన్స్‌డ్ మిల్క్: అర కప్పు (మీ తీపికి తగినట్లుగా)/ నిమ్మరసం: 1 టీస్పూన్ (పులుపు కోసం)/ అల్లం రసం: కొద్దిగా (మంచి ఫ్లేవర్ కోసం)/ ఉప్పు: చిటికెడు/

తయారీ విధానం: రసం సిద్ధం చేయడం : ముందుగా చెరుకురసాన్ని వడకట్టుకుని అందులో నిమ్మరసం, అల్లం రసం, చిటికెడు ఉప్పు కలపాలి. ఇది ఐస్‌క్రీమ్‌కు ఒక రకమైన 'మసాలా చెరుకురసం' ఫ్లేవర్‌ను ఇస్తుంది.క్రీమ్ విప్పింగ్ : ఒక వెడల్పాటి గిన్నెలో చల్లని ఫ్రెష్ క్రీమ్ తీసుకుని, అది చిక్కగా, ఫ్లఫ్ఫీగా అయ్యే వరకు బ్లెండర్‌తో బాగా గిలకొట్టాలి.మిక్సింగ్ : ఇప్పుడు అందులో కండెన్స్‌డ్ మిల్క్ వేసి మరోసారి కలిపాక, సిద్ధం చేసుకున్న చెరుకురసాన్ని కూడా పోసి ఎక్కడా ఉండలు లేకుండా సాఫ్ట్‌గా కలిపేయాలి.ఫ్రీజింగ్ : ఈ మిశ్రమాన్ని ఒక ఎయిర్ టైట్ బాక్స్‌లో పోసి, సుమారు 7 నుంచి 8 గంటల పాటు డీప్ ఫ్రీజర్‌లో ఉంచాలి. ఐస్‌క్రీమ్ పైన ఐస్ ముక్కలు పేరుకోకుండా ఉండటానికి బాక్స్ పైన అల్యూమినియం ఫాయిల్ పెట్టడం మంచిది. బయట దొరికే ఐస్‌క్రీమ్స్‌లో షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. కానీ ఇందులో చెరుకులోని సహజమైన తీపి ఉండటం వల్ల ఇది శరీరానికి తక్షణ గ్లూకోజ్‌ను అందిస్తుంది. ఎండలో తిరిగి వచ్చిన వారికి ఇది ఒక అద్భుతమైన

ఎనర్జీ బూస్టర్‌లా పనిచేస్తుంది. ఈ వేసవిలో మీ పిల్లలకు కొత్తగా ఏదైనా తినిపించాలనుకుంటే ఈ 'చెరుకురసం ఐస్‌క్రీమ్' బెస్ట్ ఆప్షన్. చల్లచల్లని ఈ స్వీట్ ట్రీట్‌తో ఎండ దెబ్బ నుంచి సేదదీరండి. పైన కొద్దిగా పుదీనా ఆకులు లేదా డ్రై ఫ్రూట్స్ చల్లి సర్వ్ చేస్తే ఆ మజానే వేరు!

# ఆ సమస్యలకు అద్భుతమైన ఔషధం



ఆధునిక జీవనశైలి సమస్యలకు ఎండు ద్రాక్ష (కిస్‌మిస్) నీరు ఒక సహజ పరిష్కారం. ప్రతిరోజూ ఎండు ద్రాక్షలను నానబెట్టి ఆ నీటిని సేవించడం ద్వారా అధిక బరువు, రక్తపోటు, డయాబెటిస్ నియంత్రంచబడతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఐరన్ లోపం, రక్తహీనత, జీర్ణ, లైంగిక సమస్యలు దూరం అవుతాయి. ఇది శరీరాన్ని డిటాక్సిఫై చేసి 10 రోజుల్లోనే మంచి ఫలితాలను అందిస్తుంది.ఎండుద్రాక్ష (కిస్‌మిస్) లో శరీరానికి మేలు చేసే ఎన్నో పోషకాలు దాగున్నాయి. రుచికరంగా ఉండే కిస్‌మిస్‌ను తీపి పదార్థాలలో ఎక్కువగా ఉపయోగిస్తారు. ఎండు ద్రాక్షలో ప్రోటీన్లు, ఐరన్, విటమిన్లు, ఫైబర్, ఇతర పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. అయితే.. రాత్రంతా నీళ్లలో నానబెట్టిన ఎండు ద్రాక్ష నీరు పరగడుపున తాగడం వల్ల ఎన్నో సమస్యలు దూరం అవుతాయని.. లైంగిక ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. కిస్ మిస్ నీటితో జీర్ణక్రియ మెరుగుపడటంతోపాటు మలబద్ధకం తగ్గుతుంది. ఇది కాలేయాన్ని శుభ్రపరిచి, రక్తాన్ని పెంచి, రోగనిరోధక శక్తిని పెంచుతుంది. యాంటీఆక్సిడెంట్లతో కూడిన ఈ నీరు చర్మ ఆరోగ్యానికి, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఆధునిక జీవనశైలి కారణంగా ఎదురయ్యే అనేక ఆరోగ్య సమస్యలకు ఎండు ద్రాక్ష నీరు ఒక సహజసిద్ధమైన, సమర్థవంతమైన పరిష్కారం. ఈ పానీయాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా కేవలం 10 రోజుల్లోనే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఈ డ్రింక్ ప్రధానంగా అధిక బరువు సమస్యకు చెక్ పెడుతుంది. దీనిలోని లెప్టిన్, గ్రిలిన్ వంటి సమ్మేళనాలు ఆకలిని తగ్గించి, అతిగా ఆహారం తీసుకోవడాన్ని నియంత్రిస్తాయి. తద్వారా సహజంగా బరువు తగ్గడానికి సహాయపడతాయి. ఇది రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది.. డయాబెటిస్ స్థాయిలను అదుపులో పెడుతుంది. శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్‌ను తొలగించడంలో కూడా ఎండు ద్రాక్ష నీరు కీలక పాత్ర పోషిస్తుంది. ఎండు ద్రాక్షలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీర కణాలకు హాని కలిగించే పదార్థాల నుంచి రక్షణను అందిస్తాయి. ఫెరులుక్ యాసిడ్, రూటీన్, క్వెలెటిన్, ట్రాన్స్ కంప్టరిక్ యాసిడ్ వంటి సమ్మేళనాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఎండు ద్రాక్షలో సహజసిద్ధమైన చక్కెర తక్కువగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. భోజనం తర్వాత ఎండు ద్రాక్ష తీసుకోవడం వల్ల ఇన్సులిన్ నియంత్రణలో ఉంటుంది. గ్లైసెమిక్ ఇండెక్స్ బ్యాలెన్స్ కూడా నిర్వహించబడుతుంది. ఎండు ద్రాక్ష నీరు ఒక సహజసిద్ధమైన డిటాక్సిఫైర్‌గా పనిచేస్తుంది. ఇది శరీరాన్ని లోపలి నుండి శుభ్రపరిచి, మలినాలను తొలగిస్తుంది. జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. కడుపులో యాసిడ్ సమస్యలు ఉన్నవారు ఈ నీటిని తాగడం వల్ల తక్షణ ఉపశమనం పొందుతారు.కిస్‌మిస్ నీటిని తాగడం వల్ల లైంగిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.. ఎండుద్రాక్ష, తేనే కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. పురుషులలో స్టామినా పెరగడంతోపాటు స్పెర్మ్ కౌంట్, నాణ్యతను పెంచడంలో సహాయపడుతుందని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు. ఈ ఆరోగ్యకరమైన డ్రింక్‌ను తయారు చేయడానికి 10 ఎండు ద్రాక్షలను శుభ్రంగా కడిగి ఐదు గంటల పాటు నీటిలో నానబెట్టాలి. నానబెట్టిన తర్వాత, ద్రాక్షలను బాగా పిసికి, ఆ నీటిని వడగట్టాలి. ఈ నీటిని ఉదయం పూట తీసుకోవడం మంచిది. నీటితోపాటు ఆ కిస్‌మిస్ లను కూడా తీసుకోవచ్చు.. ఇందులో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఒక టీస్పూన్ నిమ్మరసం కలిపి తాగడం వల్ల శరీరం ఐరన్‌ను మెరుగ్గా గ్రహిస్తుంది.

## మిల్లెట్స్‌తో ఇలా పలావ్ చేసి తింటే.. ఆరోగ్యం డబుల్, రుచి ట్రిపుల్

మిల్లెట్స్‌తో కూడా పలావ్ చేసి తింటారు. దీని గురించి చాలా మందికి తెలియకపోవచ్చు. ఇది రుచికి మాత్రమే కాకుండా ఆరోగ్యానికి కూడా మంచిది. ఈ రెసిపీని సరైన కొలతలతో చేసి తింటే రుచి అదిరిపోద్ది. ఈ రెసిపీని ఎక్కువగా కొర్రలతో చేసి తింటారు. దీనిలో ఫైబర్, ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయి. దీనిలో మిల్లెట్స్, కూరగాయలు వేస్తారు. ఉదయం పూట బ్రేక్ ఫాస్ట్ కు ఇది పర్ఫెక్ట్. తక్కువ నీరుతో చేస్తే టేస్ట్ నెక్ట్స్ లెవెల్ అని చెప్పుకోవాలి.కావాల్సిన పదార్దాలు : మిల్లెట్స్, నాలుగు బిర్యానీ ఆకు, 5 లవంగం, 4 యాలకులు, ఉల్లిపాయలు ముక్కలు , కట్ చేసిన పచ్చిమిర్చి, ఒక టేబుల్ స్పూన్ అల్లం-వెల్లుల్లి , క్యారెట్, ఉప్పు, కారం, నూనెను తీసుకోవాలి. మిల్లెట్ పులావ్ ను ఎలా తయారు చేయాలంటే? ముందుగా ఒక కప్పు మిల్లెట్స్‌ను తీసుకుని వాటిని ఒకటికి రెండు సార్లు కడిగి ఒక గంట పాటు నానబెట్టి పక్కన పెట్టుకోవాలి. ఇక ఇప్పుడు స్టవ్ వెలిగించి కుక్కర్‌లో కొద్దిగా నూనె వేసి అది వేడయ్యాక దాచిన చెక్క, లవంగం, నాలుగు యాలకులు, మసాలాలు కూడా వేసి బాగా వేయించాలి. కొద్దీ సేపటి తర్వాత ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి, ఒక టేబుల్ స్పూన్ అల్లం-వెల్లుల్లి పేస్ట్ వేసి బాగా వేయించాలి. ఇప్పుడు నానబెట్టిన మిల్లెట్స్ ను కుక్కర్లో వేసి రెండు గ్లాస్ ల నీళ్లు పోసి



రుచికి సరిపడా ఉప్పు కూడా వేసి టేస్ట్ చూసి మూత పెట్టాలి మీడియం మంటపై ఉంచి 5 విజిల్స్ వచ్చే దాకా మెత్తగా ఉడికించాలి. చివర్లో కొత్తిమీర వేసి కిందకు దించేయడమే.

# కొంత నిరాశ ఉంది.. కానీ, బీసీసీఐ తీసుకున్న నిర్ణయం సరైనదే: గంగూలీ



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్–ఆస్ట్రేలియా మధ్య జరగనున్న ప్రతిష్ఠాత్మక టెస్టు సిరీస్ (బోర్డర్ – గవాస్కర్ ట్రోఫీ) వేదికల ఎంపికపై సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చపై టీమిండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ స్పందించారు. ఈడెన్ గార్డెన్స్‌లో టెస్టు మ్యాచ్ జరగకపోవడం పట్ల బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తనకు కొంత నిరాశ ఉన్నప్పటికీ, బోర్డు తీసుకున్న నిర్ణయం సరైనదేనని ఆయన అభిప్రాయపడ్డారు."ఒక మాజీ క్రికెటర్‌గా కోల్‌కతాలో మ్యాచ్ జరగాలని నేను కోరుకుంటాను. కానీ, కేవలం సంప్రదాయ వేదికలకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న ఇతర మైదానాలకూ అవకాశం ఇవ్వడం ముఖ్యం" అని గంగూలీ అన్నారు. గువాహటి, రాంచీ వంటి నగరాల్లో టెస్టులు నిర్వహించడం వల్ల అక్కడి అభిమానులకు మేలు జరుగుతుందని, ప్రస్తుతం దేశంలోని అన్ని స్టేడియాల్లోనూ ప్రపంచ స్థాయి సదుపాయాలు ఉన్నాయని ఆయన చెప్పారు.2001లో ఈడెన్ గార్డెన్స్‌లో ఆస్ట్రేలియాపై సాధించిన చారిత్రక విజయాన్ని గుర్తుచేసుకున్న దాదా, ఆనాటి ఆటగాళ్లంతా మళ్లీ ఒక చోట చేరాలని ప్లాన్ చేస్తున్నట్లు వెల్లడించారు. "మేమంతా ఈ నెలలోనే కలవాల్సి ఉంది. అయితే సచిన్ టెండూల్కర్ కుమారుడి (అర్జున్ టెండూల్కర్) వివాహం ఉండటంతో ఆ భేటీని వాయిదా వేశాం. త్వరలోనే ఆ వేడుక ఎప్పుడనేది ప్రకటిస్తాం" అని ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. తన కెరీర్‌లో లార్డ్స్ బాల్కనీలో చొక్కా విప్పిన నాట్‌వెస్ట్ ట్రోఫీ విజయం కంటే.. కోల్‌కతా, అడిలైడ్, హెడింగ్లేలలో సాధించిన టెస్టు విజయాలే తనకు ఎక్కువ సంతృప్తినిస్తాయని గంగూలీ చెప్పారు. పాకిస్థాన్ తో జరిగిన టెస్టులో సెహ్వాగ్ ట్రిపుల్ సెంచరీ గురించి చెబుతూ... "300 పరుగుల దగ్గర సింగిల్ తీయమని నేను చెప్పినా వినకుండా, వీరూ సిక్స్‌తోనే దాన్ని పూర్తి చేశాడు. త్రిశతకాలు తరచూ రావు, అందుకే అప్పుడు నేను కాస్త కంగారు పడ్డాను" అని నవ్వుతూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రస్తుతం బీసీసీఐ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నాగ్‌పూర్, చెన్నై, గువాహటి, రాంచీ, అహ్మదాబాద్‌లు బోర్డర్–గావస్కర్ ట్రోఫీకి ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

# ధోనీ నా ఫోన్ లిఫ్ట్ చేయడు.. ఆయనకు నాకు మాటలు లేవు







**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ మధ్యలో చెన్నై సూపర్ కింగ్స్ కొత్త, పాత ప్లేయర్స్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక రీయూనియన్ క్యాంపెయిన్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. ఈ వేడుకలో జట్టులోని దాదాపు అందరూ స్టార్ ఆటగాళ్లు కనిపించగా, జడేజా, ధోనీ ఒకరితో ఒకరు మాట్లాడుకోకపోవడం కెమెరాలలో రికార్డు అయింది. దీంతో వీరిద్దరి మధ్య కోల్డ్ వార్ స్టార్ట్ అయిందా అనే ప్రచారం మొదలయింది. ప్రస్తుతం నెట్టింట ఈ గొడవ తెగ ట్రెండింగ్ అవుతుంది. ఈక్రమంలో ఈ వివాదంపై రవీంద్ర జడేజా మాట్లాడుతూ.. అది కేవలం టెక్నికల్ ఎర్రర్ తప్ప మనస్పర్థలు లేవని స్పష్టం చేయడంతో క్రికెట్ అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.

జడేజా మాట్లాడుతూ.. నేను రీయూనియన్‌కు వెళ్లే ముందే 'మహీ భాయ్'కి ఫోన్ చేసి ఎక్కడ ఉన్నారో అడుగుదామని అనుకున్నా.. కానీ ఆయన ఫోన్ స్విచాఫ్‌లో ఉండటంతో.. వేడుక జరిగే ప్రదేశంలో కూడా చాలా రద్దీగా ఉండటంతో మేమిద్దరం మాట్లాడుకునే ఛాన్స్ రాలేదన్నారు. అంతే తప్ప మా మధ్య ఎలాంటి గొడవలు లేవని నవ్వుతూ ఆన్సర్ ఇచ్చాడు. ధోనీకి ఫోన్ చేయడం కంటే అతడ్ని నేరుగా కలవడమే ఈజీ, ఎందుకంటే ఆయన ఎప్పుడు ఫోన్ వాడుతారో ఎవరికీ తెలియదని రవీంద్ర జడేజా ఫన్నీ కామెంట్స్ చేశాడు. 2022 ఐపీఎల్ సమయంలో కెప్టెన్సీ మార్పుతో జడేజా, ధోనీ మధ్య గొడవలు వచ్చాయని ప్రచారం జరిగింది. కానీ 2023 ఫైనల్‌లో జడేజా ఆఖరి బంతికి ఫోర్ కొట్టి సీఎస్కేని విజేతగా నిలిపిన తర్వాత ధోనీ అతడిని ఎత్తుకుని సెలబ్రేషన్స్ చేసుకోవడంతో ఆ వార్తలకు బ్రేక్ పడింది. ం

ఇప్పుడు మళ్ళీ ఇలాంటి చిన్న చిన్న విషయాలను పెద్దవి చేయవద్దని జడేజా ఫ్యాన్స్ ని కోరాడు. ధోనీ తనకు ఎప్పుడూ గురువు, మార్గదర్శి.. అతనిపై ఉన్న గౌరవాన్ని ఎప్పటికీ తగ్గించనని జడ్డూ తేల్చి చెప్పారు. ఈ రీయూనియన్ వివాదంపై జడేజా క్లారిటీ ఇవ్వడంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# పాక్ క్రికెటర్లకు కొత్త రూల్.. రాజకీయ పోస్టులు పెడితే కోటి ఫైన్!




**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ ఫాస్ట్ బౌలర్ నసీం షాకు ఆ దేశ క్రికెట్ బోర్డు (పీసీబీ) భారీ జరిమానా విధించింది. పంజాబ్ ముఖ్యమంత్రి మరియం నవాజ్‌పై సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్ట్ చేసినందుకు గానూ అతడికి 72,000 అమెరికన్ డాలర్లు (పాకిస్థాన్ కరెన్సీలో సుమారు రూ. 2 కోట్లు) ఫైన్ వేసింది. ఈ ఘటన నేపథ్యంలో, కేంద్ర కాంట్రాక్టులో ఉన్న ఆటగాళ్లందరికీ పీసీబీ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఇకపై రాజకీయపరమైన పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే... ఇటీవల పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 2026 ప్రారంభ మ్యాచ్‌కు పంజాబ్ సీఎం మరియం నవాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కుమార్తె, ప్రస్తుత ప్రధాని షెహబాజ్ షరీఫ్ కు కూతురు వరుస అవుతుంది. అయితే, నసీం షా సోషల్ మీడియాలో "గడాఫీ స్టేడియంలో ఆమెకు రాణికి ఇచ్చినంత గౌరవం ఎందుకు ఇస్తున్నారు?" అని వ్యంగ్యంగా పోస్ట్ చేశాడు. గల్ఫ్ యుద్ధం కారణంగా దేశంలో నెలకొన్న సంక్షోభం దృష్ట్యా ప్రభుత్వ పొదుపు చర్యల్లో భాగంగా అభిమానులను స్టేడియాల్లోకి అనుమతించని సమయంలో ఒక రాజకీయ నాయకురాలికి ఇంతటి ప్రాధాన్యత ఇవ్వడంపై ఈ పోస్ట్ దుమారం రేపింది. ఈ పోస్ట్‌ను వెంటనే తొలగించి, తన ఖాతా హ్యాక్ అయిందని నసీం షా వివరణ ఇచ్చే ప్రయత్నం చేశాడు. అయితే, ఈ వాదనను పీసీబీ అంగీకరించలేదు. ఈ నెల 27న అతడికి షోకాజ్ నోటీసు జారీ చేసి, విచారణ చేపట్టింది. క్రమశిక్షణ కమిటీ విచారణ అనంతరం సెంట్రల్ కాంట్రాక్ట్ నిబంధనలను, సోషల్ మీడియా మార్గదర్శకాలను ఉల్లంఘించినట్లు తేల్చి రూ. 2 కోట్ల జరిమానా విధించింది. నసీం షా బేషరతుగా క్షమాపణ చెప్పినట్లు బోర్డు తెలిపింది. ఈ ఘటనకు బాధ్యుడిగా అతడి సోషల్ మీడియా సలహాదారుడిని కూడా విధుల నుంచి తొలగించి, బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది.ఈ నేపథ్యంలో ఆటగాళ్ల సోషల్ మీడియా వినియోగంపై పీసీబీ కఠిన నిబంధనలు తీసుకొచ్చింది. జియో న్యూస్ కథనం ప్రకారం.. ఇకపై బోర్డు మీడియా విభాగం నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి రాజకీయపరమైన పోస్టులు పెట్టరాదని ఆటగాళ్లకు, వారి మేనేజర్లకు స్పష్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే కనీసం కోటి రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించింది. రాజకీయ పోస్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని బోర్డు స్పష్టం చేసింది.

# వారణాసి సినిమాపై ఇంట్రెస్టింగ్ అప్ డేట్!





సూపర్ స్టార్ మహేష్ కథానాయకుడిగా దర్శక ధీరుడు రాజమౌళి దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా –వారణాసి– తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. చిత్రీకరణ మొదలైన నాటి నుంచి రాజమౌళి అండ్ కో ఎక్కడా గ్యాప్ తీసుకోకుండా పని చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో ముందుగా ప్రకటించిన సమయానికే రిలీజ్ చేయాలని కట్టుబడి టీమ్ పని చేస్తోంది. ఈనేపథ్యంలో సినిమాకు సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్ డేట్ ఒకటి వెలుగులోకి వచ్చింది. మహేష్ తన పార్ట్ షూటింగ్ ను సెప్టెంబర్ లేదా? అక్టోబర్ కల్లా పూర్తి చేస్తారని తెలిసింది. అనంతరం కీరవాణి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పనులు మొదలు పెట్టాలని ప్లాన్ చేసుకుంటున్నారుట.సాధారణంగా రాజమౌళి సినిమాలంటే షూటింగ్ పూర్తి చేయడానికి సమయం తీసుకుంటారు. కానీ –వారణాసి– విషయంలో మాత్రం జక్కన్న పక్కా ప్లానింగ్‌తో షూటింగ్‌ను పరుగులు పెట్టిస్తున్నారు. ఓవైపు మహేష్ పై సన్నివేశ్యాలు చిత్రీకరిస్తుండగా మరోవైపు ఇతర పాత్రలకు సంబంధించిన షూటింగ్ కూడా ఏక కాలంలో జరుగుతోంది. కీలక షూట్ లో రాజమౌళి ఉండగా , మిగతా పార్ట్ కు సంబంధించిన షూట్ లో ఆయన టీమ్ పని చేస్తోంది. హీరోపై సన్ని వేశాల చిత్రీకరణ పూర్తయిందంటే మెజార్టీ పార్ట్ షూటింగ్ మొత్తం పూర్తయినట్లే.అప్పటి నుంచి షూటింగ్ పరంగా పెద్దగా ఫోకస్ చేయాల్సిన పని తగ్గుతుంది. సెట్ లో రాజమౌళి ఉన్నా? లేకపోయినా ఆయన టీమ్ మిగతా పనుల్ని సునాయాసంగా పూర్తి చేస్తుంది. అలాగే రాజమౌళి ప్రతి సినిమాకు విజువల్ ఎఫెక్ట్స్, ఇతర సాంకేతిక విభాగాలకు ఎక్కువ సమయాన్ని కేటాయిస్తారు. అయితే –వారణాసి– విషయంలో షూటింగ్‌తో పాటు సమాంతరంగా సాంకేతిక పనులను కూడా పూర్తి చేసేలా టీమ్ ప్లాన్ చేస్తోంది. మహేష్ బాబు షూటింగ్ పూర్తి చేసిన తర్వాత సినిమాను పూర్తి స్థాయిలో ఆవిష్కరించేందుకు కావాల్సిన సమయాన్ని రాజమౌళి తెలివిగా సద్వినియోగం చేసుకుంటారు.

ఇలా చేయడం వల్ల –వారణాసి– అనుకున్న సమయానికి విడుదల కావడానికి ఎంతో దోహదపడుతుంది. ఈ చిత్రాన్ని గ్లోబల్ స్థాయిలో రిలీజ్ ప్లాన్ చేస్తోన్న సంగతి తెలిసిందే. ఏకంగా 120 దేశాల్లో రిలీజ్ చేస్తున్నారు. ఒకేసారి ఇన్ని దేశాల్లో రిలీజ్ చేయడం అన్నది చిన్న టాస్క్ కాదు. రిలీజ్ కు సంబంధించి గ్లోబల్ స్థాయిలో పెద్ద పెద్ద ఏజెన్సీలు, పంపిణీ సంస్థలతో సంప్రదింపులు జరపాల్సి ఉంటుంది. అందుకు కూడా సమయం ఎక్కువగానే పడుతుంది. అయితే రాజమౌళి లాంటి లెజెండ్ కు అదేం పెద్ద పని కాదు. ఆస్కార్ తో అంతర్జాతీయంగా తనకున్న గుర్తింపుతో అనుకున్న గొప్పగా పాన్ వరల్డ్ లో రిలీజ్ చేస్తారు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965